veluturu telugu daily

వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి నల్గొండ | ఆదివారం 11.10.2026

సంపుటి : 9 | సంచిక : 119

www. veluturu.com

రైతును పురుగుల మందు తాగి చావలేదా అని అడుగుతారా

- గజ్వేల్ ఎమ్మార్వో తీరుపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం..
- అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

11

నిజానికి.. నాకు

8 నోబెల్ శాంతి బహుమతులు రావాల్సింది

- ఇప్పటివరకు ఎనిమిది యుద్ధాలు ఆపా..
- డొనాల్డ్ ట్రంప్ తీవ్ర అసంతృప్తి
- బెల్ కమిటీని, నార్వేని లక్ష్యంగా చేసుకుని విమర్శలు
- పురస్కార గ్రహీత నవీ పిళ్లైకి వ్యంగ్యంగా అభినందనలు

వాషింగ్టన్, వెలుతురు:

ఈ ఏడాది కూడా తనకు నోబెల్ శాంతి బహుమతి రాకపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. సిరా క్యూస్‌లో జరిగిన ఒక బహిరంగ సభలో మాట్లాడిన ఆయన.. నోబెల్ కమిటీని, నార్వేని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. తాను ఇప్పటివరకు ఎనిమిది యుద్ధాలు ఆపానని, పరిష్కరించిన ప్రతి యుద్ధానికి ఒక నోబెల్ బహుమతి చొప్పున తనకు మొత్తం ఎనిమిదిసార్లు తనకు నోబెల్ పురస్కారం రావాల్సిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి దక్షిణాఫ్రికాకు చెందిన ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మాజీ కమిషనర్ నవీ పిళ్లైకి దక్కిన నేపథ్యంలో ట్రంప్‌లో అసహనం పెరిగిపోయింది. అమెరికా అధ్యక్షుడిగా తాను నోబెల్ శాంతి బహుమతి పొందాల్సింది కానీ ఇవ్వలేదని, ఇది నార్వేకు శాశ్వత మచ్చ అని విమర్శిం చారు. నోబెల్ ఎవరికి ఇవ్వాలనే విషయంలో నిర్ణయం తీసుకున్న వ్యక్తులు అవమానకరమైన పని చేశారని ట్రంప్ మండిపడ్డారు. నోబెల్ కమిటీని 'రాడికల్ ఐడియాలజిస్టులు, ప్రజాస్వామ్య వ్యతిరేకులు'గా ఆయన అభివర్ణించారు. పురస్కార గ్రహీత నవీ పిళ్లైని ఉద్దేశిస్తూ.. ఆమె పేరు

- మిగతా 2 లో..

ఎల్‌నినోతో

పొంచి ఉన్న సంక్షోభం

సంక్షోభాన్ని గుర్తించాం.. సమస్యలపై అవగాహన కల్పించాలి

- గ్రామస్థాయి నుంచి ప్రజలను అప్రమత్తం చేయాలి
- చేతికొచ్చిన పంటలను కాపాడేందుకు చర్యలు చేపట్టండి
- తక్షణ చర్యలకు ప్రణాళికలు సిద్ధం చేయండి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్ రంగాల్లో తీవ్రమైన సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఈ సంక్షోభాన్ని ముందుగానే గుర్తించి, సమర్థంగా ఎదుర్కొనేందుకు పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంపై అధికారులతో సీఎం రేవంత్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ ఏడాది జూన్ వరకు నీరు, వ్యవసాయం, విద్యుత్‌కు సంబంధించిన సమస్యలను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

హైదరాబాద్, వెలుతురు:

ఎల్‌నినో ప్రభావాన్ని ముందుగానే అంచనా వేయకపోతే భవిష్యత్తులో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. కొవిడ్ సంక్షోభాన్ని ఎదుర్కొన్న తరహాలోనే ఎల్‌నినోతో తలెత్తే సమస్యలనూ అధిగమించేందుకు పకడ్బందీ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. ప్రతి కార్యాచరణలో ప్రజలను భాగస్వా ములను చేయాలని రేవంత్ స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ సమస్యలు తీవ్రతరం అయ్యే ప్రమాదం ఉందని రేవంత్ రెడ్డి తెలిపారు.

అవసరమైతే విద్యుత్ కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉందన్నారు ముఖ్యమంత్రి. అయితే మార్కెట్‌లో విద్యుత్ అందుబాటులో లేకపోవడం ఆందోళనకరమైన అంశమని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాల్సిన అవసరం ఉందని చెప్పుకొచ్చారు. విద్యుత్‌పై ఆధారపడే పనులను సాధ్యమైనంత వరకు తాత్కాలికంగా వాయిదా వేసుకునేలా అవసరమైన చర్యలు

- మిగతా 2 లో..

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీకి సవాల్ విసిరారు. నిరసనలు చేస్తున్న నాయకులు, యువత సహా ఎంతమందినైనా అరెస్టు చేసుకోవచ్చని అన్నారు. అయినా తమ పోరాటం ఆగదని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. గత పదేళ్లకు పైగా ప్రధాని మోదీ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్)తో తాను పోరాడుతున్నానని పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఎక్స్ వేదికగా ఓ వీడియోను విడుదల చేశారు.

మోదీజీ ఎంతమంది పోలీసులనైనా

తెచ్చుకోండి

మేం వెనక్కి తగ్గబోం..

- సీజేపీ నిరసన వేళ రాహుల్ గాంధీ
- మోదీ, ఆర్ఎస్ఎస్‌ను తాను అర్థం చేసుకున్నట్లు ఎవరూ అర్థం చేసుకోలేదు
- రాజ్యాంగాన్ని కాపాడుకుంటామని రాహుల్ స్పష్టం

న్యూఢిల్లీ, వెలుతురు:

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దిల్లీలో నిరసనలు జరుగుతున్న నేపథ్యంలో రాహుల్ ఆ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. నిరసనల్లో పాల్గొంటున్న యువతకు మద్దతు ప్రకటించిన ఆయన, ఆందోళనలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగంపై దాడి చేసిన వారిని ఓడించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు.

'ఎంతమందినైనా అరెస్టు చేసుకోండి'

ప్రధాని మోదీ, ఆరెస్సెస్‌తో తనకు సుదీర్ఘకాలంగా రాజకీయ పోరాటం కొనసాగుతోందని రాహుల్ గాంధీ చెప్పారు. ప్రత్యర్థుల ఆలోచనా విధానాన్ని పూర్తిగా అర్థం చేసుకున్నానని పేర్కొన్నారు. మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్ల పేర్లను ప్రస్తావించారు.

- మిగతా 2 లో..

సంక్షేమ పథకాలే కాంగ్రెస్ విజయానికి బలం

ఖమ్మం-నల్గొండ-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు పార్టీ శ్రేణు లంతా సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టి, అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలని సూచించారు. - ఖమ్మం, వెలుతురు

- ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించాలి
- సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి..
- కాంగ్రెస్ శ్రేణులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపు

11

వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్‌జిల్లా దొంగల ముఠా అరెస్ట్!

- ఆరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో తొమ్మిది చోరీలు
- జైలులో పరిచయం.. బయటకు వచ్చాక దొంగల ముఠాగా ఏర్పాటు!
- 21.05 లక్షల విలువైన సొత్తు స్వాధీనం..

నల్లగొండ జిల్లాలో వరుస చోరీలకు పాల్పడు తున్న అంతర్‌జిల్లా దొంగల ముఠాను మర్రిగూడ, చింతపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. నలుగురు నిందితులను అదుపులోకి తీసుకొని వారి నుంచి సుమారు 11 తులాల బంగారం, 1.5 కిలోల వెండి, రెండు ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

- వివరాలు 11 లో..

రూ.3,296 కోట్ల రేడియల్ రోడ్-2

టెండర్లలో కుంభకోణం!

నచ్చినవారికే కాంట్రాక్టులు.. తక్కువ ధర బిడ్డర్లకు మొండిచేయి

- రూ.600 కోట్ల నష్టం ఆరోపణపై విచారణ జరపాలి.. టెండర్లు రద్దు చేయాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ

హైదరాబాద్, వెలుతురు:

రూ. 3,296 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన రేడియల్ రోడ్-2 టెండర్లలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. తక్కువ ధరకు బిడ్లు వేసిన సంస్థలను పక్కనపెట్టి, అధిక ధరలు కోట్ చేసిన సంస్థలకు పనులు కేటాయించడంపై అనుమానాలు వ్యక్తం చేస్తూ సీఎంకు బహిరంగ లేఖ రాశారు. టెండర్లను రద్దు చేసి సమగ్ర విచారణ జరపాలని కోరారు.

ఐదు పని దినాల్లోనే టెండర్ల ప్రక్రియ పూర్తి

బుద్వేల్ వద్ద ఔటర్ రింగ్ రోడ్డు నుంచి కొడంగల్ సమీపంలోని ఎన్‌హెచ్-167ఎన్ వరకు 81.15 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణానికి మూడు ప్యాకేజీలుగా టెండర్లు పిలిచారని కేటీఆర్ తెలిపారు. 2026 సెప్టెంబర్ 30తో బిడ్ల దాఖలు గడువు ముగియగా, అక్టోబర్ 8 నాటికే సాంకేతిక, ఆర్థిక బిడ్ల పరిశీలనతోపాటు అర్హతల నిర్ధారణ, కేటాయింపుల ప్రక్రియ పూర్తయినట్లు సంబంధిత పత్రాల్లో ఉందన్నారు. సెలవులు మినహాయిస్తే ఐదు పని దినాల్లోనే 13 బిడ్ల పరిశీలన

- మిగతా 2 లో..

రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలి

ఆదిలాబాద్ ఎమ్మెల్యే శంకర్, ఆదిలాబాద్ ఎంపీ నగేష్

ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు కలిసి శనివారం ఆదిలాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్రంలోని రైతుల సమస్యలపై ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ప్రశ్నించారు.

- వివరాలు 2 లో..

అట్టహాసంగా బతుకమ్మ సంబరాలు ప్రారంభం

రవీంద్రభారతిలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు

హైదరాబాద్, వెలుతురు:

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు రవీంద్రభారతిలో శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలకు వందలాది మంది మహిళలు తరలివచ్చారు. రంగురంగుల పూలతో

- మిగతా 2 లో..

- హాజరైన మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్
- బతుకమ్మ పాటలతో మార్మోగిన ప్రాంగణం
- రంగురంగుల పూలు పేర్చి.. మహిళల ఆటపాటలు

మోదీజీ ఎంతమంది పోలీసులనైనా తెచ్చుకోండి

(మొదటిపేజీ తరువాయి)
వీరికి రాజకీయంగా పరిస్థితులు కష్టంగా మారుతున్నాయని వ్యాఖ్యానించారు.

ప్రభుత్వం నిరసనలను అడ్డుకునేందుకు పోలీసులను రంగంలోకి దించినా తమ పోరాటం ఆగదని రాహుల్ అన్నారు. ““మోదీ జీ మీకు నచ్చినట్లు చేసుకోండి. 10 వేల మంది, 20 వేల మంది, 50 వేల మంది పోలీసులను రంగంలోకి దించండి. నాయకులను అరెస్టు చేయండి. యువతను అరెస్టు చేయండి. మమ్మల్ని అందరినీ అరెస్టు చేయండి. అయినా మేం వెనక్కి తగ్గబోం” అని స్పష్టం చేశారు. తమ వద్ద ఇప్పటికే అవసరమైన సమాచారం ఉందని రాహుల్ పేర్కొన్నారు. దేశ రాజ్యాంగాన్ని కాపాడటంతో పాటు ప్రజల గొంతుకను రక్షించేందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. గత పదేళ్ల నుంచి 15 ఏళ్ల కాలంలో దేశానికి జరిగిన నష్టం మళ్లీ జరగకుండా చూస్తామని అన్నారు. రాజ్యాంగంపై దాడి చేసిన వారిని, ప్రస్తుత ప్రభుత్వాన్ని ఓడించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు.

యువతకు రాహుల్ మద్దతు

నిరసనల్లో పాల్గొంటున్న యువతను రాహుల్ గాంధీ అభినందించారు. యువత పోరాటం కొనసాగించాలని కోరారు. “దేశ యువతను చూసి గర్విస్తున్నాను. మీరు నిరసనలు కొనసాగించండి. మేం మీకు అండగా ఉంటాం. రాజ్యాంగంపై దాడి చేసిన వారిని ఓడించేలా కృషి చేస్తాం” అని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం చెన్నైలో ఉన్న రాహుల్ గాంధీ, ఛాత్రోన్ కీ గూంజ్ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ఆయన ఢిల్లీలో జరుగుతున్న నిరసనలకు మద్దతు తెలుపుతూ వీడియోను విడుదల చేశారు.

ఢిల్లీలో నిరసనలు

మరోవైపు, ఢిల్లీలోని జంతర్ మంతర్ వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించిన నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జంతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో ఆ నిరసన చేపట్టారు. అయితే ఆందోళనకు పోలీసులు అనుమతి ఇవ్వలేదని, న్యూఢిల్లీ ప్రాంతంలో నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నాయని పోలీసు వర్గాలు తెలిపాయి. నిరసనల్లో పాల్గొనేందుకు జంతర్ మంతర్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించిన వారిలో 3,000 మందికి పైగా నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ముందస్తు చర్యల్లో భాగంగా నేర చరిత్ర ఉన్న 600 మందికి పైగా వ్యక్తులను కూడా అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలి

ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్

ఆదిలాబాద్ వెలుతురు అక్టోబర్ 10:

ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు కలిసి ఈరోజు ఆదిలాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్రంలోని రైతుల సమస్యలపై ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ప్రశ్నించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, వర్షాభావం, పంట దిగుబడులు తగ్గిపోవడం వంటి కారణాలతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, ఈ పరిస్థితుల్లో కొందరు రైతులు ఆత్మహత్యలకు పాల్పడటం అత్యంత బాధాకరమని అన్నారు. రైతులకు భరోసా కల్పించి, వారిని ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.

రైతులకు పంట నష్టం జరిగినప్పుడు ఆర్థిక రక్షణ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన లో తెలంగాణ రాష్ట్రాన్ని తక్షణమే చేర్చాలని డిమాండ్ చేశారు. ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు దెబ్బతిన్నప్పుడు రైతులకు బీమా పరిహారం అందితే కొంతైనా ఆర్థిక భరోసా లభిస్తుందని పేర్కొన్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మెరుగైన పంటల బీమా సదుపాయం కల్పిస్తామని హామీలు ఇచ్చినప్పటికీ, ఆచరణలో రైతులకు తగిన రక్షణ కల్పించడంలో విఫలమయ్యాయని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసి, పంట నష్టంతో ఇబ్బందులు పడుతున్న రైతులను తక్షణమే ఆదుకోవాలని కోరారు.

రైతుల సమస్యల పరిష్కారం కోసం కిసాన్ మోర్చా మార్గదర్శకత్వంలో అక్టోబర్ 23వ తేదీ నుంచి ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వరకు పాదయాత్ర చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు

ఈ పాదయాత్ర ద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి, కరువు పరిస్థితులపై తక్షణ చర్యలు చేపట్టాలని, అర్హులైన రైతులకు పంట నష్టానికి తగిన పరిహారం అందించాలని, రైతుల రుణమాఫీని అమలు చేయాలని డిమాండ్ చేయనున్నట్లు తెలిపారు. రైతుల సమస్యలను ప్రభుత్వం ఇకనైనా నిర్లక్ష్యం చేయకుండా, క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని పాయల్ శంకర్ గారు కోరారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీజేపీ, కిసాన్ మోర్చా రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తాయని స్పష్టం చేశారు. కార్యక్రమాన్ని నాయకులు జిల్లా అధ్యక్షులు బ్రహ్మానంద్ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జగన్మోహన్ రెడ్డి, దేవర శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అనుజ్ఞ రెడ్డి, శ్రీనివాస్, చంద్రశేఖర్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు కటుకం రామదాసు, ప్రధాన కార్యదర్శి వెంకట్ రెడ్డి, కిసాన్ మోర్చా నాయకులు. బోయర్ విజయ్ దినేష్ మాటోలియా పోషాలు వెంకటరెడ్డి, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

ఎంగిలి పూల బతుకమ్మ సందర్బంగాకరీంనగర్‌లో శ్రీ మహా శక్తి దేవాలయంలో జరిగిన బతుకమ్మ వేడుకలలో పాల్గొన్న కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అపర్ణ దంపతులు. -కరీంనగర్ వెలుతురు

రూ.3,296 కోట్ల రేడియల్ రోడ్-2 టెండర్లలో కుంభకోణం!

(మొదటిపేజీ తరువాయి)
ఎలా పూర్తిచేశారని ప్రశ్నించారు. సంస్థల పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారా నిర్ణయాలకు ఆధారాలను నమోదు చేశారా అన్నది వెల్లడించాలని కోరారు.

అధిక ధరలకు కేటాయింపులు.. భిన్న ప్రమాణాలపై ప్రశ్నలు

ప్యాకేజీ-1ను ఎన్‌సీసీ లిమిటెడ్‌కు రూ.1,286.03 కోట్లకు కేటాయించారని, ఇది అంచనా వ్యయం కంటే 3.95 శాతం అధికమని కేటీఆర్ పేర్కొన్నారు. ప్యాకేజీ-2 బీవీఎస్ఆర్‌కు, ప్యాకేజీ-3 జీకేసీకి దక్కినట్లు తెలిపారు. మిగిలిన ప్యాకేజీల ఆర్థిక వివరాలను ప్రభుత్వం ఎందుకు వెల్లడించడం లేదని ప్రశ్నించారు. ప్రతి ప్యాకేజీకి వచ్చిన బిడ్లు, అర్హత సాధించిన సంస్థలు, కోట్ చేసిన ధరలు, అంచనా వ్యయంతో పోలిస్తే తుది కేటాయింపుల వ్యత్యాసాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

మూడు ప్యాకేజీల్లో ఒకే విధమైన అర్హత ప్రమాణాలు పాటించారా? అన్నది కూడా తేల్చాలని కోరారు. ప్యాకేజీ-1లో జీకేసీని అనర్హంగా ప్రకటించి, ప్యాకేజీ-3లో అర్హత కల్పించారని సంబంధిత పత్రాల్లో ఉన్నట్లు తెలిపారు. బీవీఎస్ఆర్‌కు ప్యాకేజీ-1, 2ల్లో అర్హత కల్పించి, ప్యాకేజీ-3లో తిరస్కరించారని పేర్కొన్నారు. ఒకే సంస్థకు వేర్వేరు ప్యాకేజీల్లో భిన్న నిర్ణయాలు తీసుకోవడానికి కారణాలను వెల్లడించాలని, సాంకేతిక మూల్యాంకన రికార్డులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రేడియల్ రోడ్-1 టెండర్లపైనా అనుమానాలు

రేడియల్ రోడ్-1 అంచనా వ్యయం సుమారు రూ.591 కోట్లు కాగా, అంచనా కంటే సుమారు 15 శాతం అధిక ధరకు కేటాయింపు జరిగిందని సంబంధిత పత్రాల్లో ఉన్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు. రెండు రేడియల్ రోడ్ల అంచనా వ్యయాలు, బిడ్ల ధరలు, సంస్థల అర్హతలు, తుది కేటాయింపుల వివరాలను ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ డిమాండ్లు

- రేడియల్ రోడ్-2 టెండర్లను రద్దు చేసి, ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలి.
- మూడు ప్యాకేజీల అంచనా వ్యయాలు, తుది కేటాయింపు విలువలు, అర్హత సాధించిన బిడ్డర్ల ఆర్థిక బిడ్ వివరాలను విడుదల చేయాలి.
- బిడ్ ఓపెనింగ్, పోలిక పట్టికలు, మూల్యాంకన కమిటీ సమావేశాల వివరాలు, సాంకేతిక మూల్యాంకన నివేదికలను బహిర్గతం చేయాలి.
- రూ.600 కోట్ల నష్టం ఆరోపణపై విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలి.
- గత మూడేళ్లలో హెచ్ఎండీఏ, హెచ్‌జీసీఎల్ చేపట్టిన రూ.100కోట్లకు పైబడిన కాంట్రాక్టుల పై కాగ్ ప్రత్యేక ఆడిట్ నిర్వ హించేలా చర్యలు తీసుకోవాలి.
- రెండు రేడియల్ రోడ్ల టెండర్లపై బిడ్డర్లు, అనర్హతలు, ధరలు, కేటాయిం పుల వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలి.
- సాంకేతిక అర్హతల నిర్ధారణ, బిడ్డర్ల వివరణలు, ఆర్థిక బిడ్ల పరిశీలనలో పారదర్శకతకు స్పష్టమైన నిబంధనలు రూపొందించాలి.
- ప్రజాధనంతో చేపట్టే భారీ ప్రాజెక్టుల టెండర్లలో పారదర్శకత పాటించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.
- ఆరోపణలు నిరాధారమైతే సంబంధిత రికార్డులతో ప్రభుత్వం వివరణ ఇవ్వాలని, ఆర్థిక నష్టం జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రూ.600 కోట్ల నష్టం ఆరోపణపై విచారణ జరపాలి

సుమారు రూ.1,034 కోట్ల విలువైన ప్యాకేజీ-3లో ఇద్దరు బిడ్డర్లు మాత్రమే అర్హత సాధించినట్లు కేటీ ఆర్ తెలిపారు. అతి తక్కువ ధరకు బిడ్లు వేసినట్లు చెబుతున్న సుషీ ఇన్‌ఫ్రా అండ్ మైనింగ్ లిమిటెడ్‌ను మూడు ప్యాకేజీల్లోనూ అనర్హంగా ప్రకటించడంపై ఆ సంస్థ అభ్యంతరం వ్యక్తం చేసిందన్నారు. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రానికి సుమారు రూ.600 కోట్ల నష్టం వాటిల్లుతుందని సంస్థ తరఫున కోర్టులో సమర్పించిన వాదనల్లో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ ఆరోపణలపై విచారణ జరిపి, ధరల వ్యత్యాసాలు, ఆర్థిక బిడ్లు, తుది కేటాయింపులను పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని కోరారు. హెచ్ఎండీఏ, హెచ్‌జీసీఎల్ భారీ టెండర్లలో తమకు అనుకూలంగా వ్యవహరించని కాంట్రాక్టర్లను సాంకేతిక కారణాలతో అనర్హులుగా ప్రకటిస్తున్నారని కొందరు కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నట్లు కేటీఆర్ లేఖలో ప్రస్తావించారు. ఈ ఆరోపణలపైనా అధికారిక విచారణ జరిపి, అనర్హత నిర్ణయాలకు సంబంధించిన రికార్డులను బహిర్గతం చేయాలని కోరారు.

పొంచి ఉన్న సంక్షోభం..

(మొదటిపేజీ తరువాయి)
తీసుకోవాలని అధికారులకు సూచించారు. భవిష్యత్తులో తాగునీరు, సాగునీటి సమస్యలు తీవ్రతరం కాకుండా ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. చుక్క నీరు కూడా వృథా కాకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. నీటి లభ్యత, వ్యవసాయ అవసరాలు, విద్యుత్ వినియోగం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

ఎల్‌నినో ప్రభావం, దాని వల్ల ఎదురయ్యే సమస్యలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని రేవంత్ రెడ్డి తెలిపారు. సినిమా, మీడియా, కళాజాతలతో పాటు వివిధ మాధ్యమాలను ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రజలకు అవగాహన కల్పించి నీరు, విద్యుత్ పొదుపులో వారిని భాగస్వాములను చేయాలని దిశానిర్దేశం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే సవాళ్లను ముందుగానే గుర్తించి, తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్ రంగాల్లో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రేవంత్ స్పష్టం చేశారు.

నిజానికి.. నాకు 8 నోబెల్ శాంతి బహుమతులు రావాల్సింది

(మొదటిపేజీ తరువాయి)
తాను ఎప్పుడూ వినలేదని, యూఎన్‌లో పనిచేసే ఒక లిబరల్ వ్యక్తికి బహుమతి ఇచ్చారని విమర్శించారు. ఆమె మాట ఎవరూ వినరని అంటూనే, అయినా అభినందనలు తెలియజేస్తున్నా అని వ్యంగ్యంగా అన్నారు. తాను అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఎనిమిది యుద్ధాలను ఆపానని ట్రంప్ చెప్పుకున్నారు. భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధం జరగకుండా నివారించి సుమారు 5 కోట్ల మంది ప్రాణాలను కాపాడానని వ్యాఖ్యానించారు. అలాగే ఇరాన్ అణుబాంబు సంపాదించకుండా అడ్డుకున్నానని, తద్వారా పశ్చిమాసియా, యూరప్, అమెరికాకు పెను ప్రమాదాన్ని తప్పించానని ట్రంప్ అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఇరాన్, రష్యా-ఉక్రెయిన్ యుద్ధాలను కూడా త్వరలోనే ముగించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. గతంలో నలుగురు అమెరికా అధ్యక్షులు థియోడర్ రూజ్‌వెల్ట్, వుడ్రో విల్సన్, జిమ్మీ కార్టర్, బరాక్ ఒబామాలు నోబెల్ శాంతి బహుమతి అందుకున్నారు. ఒబామా అధ్యక్షుడైన తొలి ఏడాదిలోనే పురస్కారం పొందడాన్ని ట్రంప్ తరచూ విమర్శిస్తూ.. ఆయనకు ఏమీ చేయకుండానే బహుమతి ఇచ్చారని వ్యాఖ్యానించడం గమనార్హం.

ప్రకాశం జిల్లాలో విషాదం..

- పాకల బీచ్‌లో ఇద్దరు యువకులు మృతి

సింగరాయకొండ, వెలుతురు అక్టోబర్ 10:

ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం పాకల బీచ్‌లో విషాదకర ఘటన చోటుచేసుకుంది. సముద్రంలో స్నానానికి వెళ్లిన కనిగిరికి చెందిన ఏడుగురు యువకులు గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న మెరైన్ సిబ్బంది వెంటనే స్పందించి ఐదుగురిని సముద్రం నుంచి బయటకు తీసుకొచ్చారు. అయితే వారిలో ఇద్దరు మృతి చెందగా, మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.ఇదిలా ఉండగా, సముద్రంలో గల్లంతైన మరో ఇద్దరి ఆచూకీ కోసం మెరైన్ పోలీసులు మత్స్యకారుల సహకారంతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనతో కనిగిరి ప్రాంతంలో విషాదం నెలకొంది. మృతుల పేర్లు, వయస్సులు, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

కోతకొటలో పోలీసుల గ్రామ సందర్శన

- సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన..
- పోలింగ్ కేంద్రాల పరిశీలన

సి. బెళగల్, వెలుతురు అక్టోబర్ 10:

కర్నూలు జిల్లా సి. బెళగల్ మండలంలోని కోతకొట గ్రామంలో పోలీసులు గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సి. బెళగల్ ఎస్ఐ వేణుగోపాల్ రాజు సిబ్బందితో కలిసి శనివారం గ్రామాన్ని సందర్శించి ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు, మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు వివరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగంతో వాహనాలు నడపకూడదని, వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ తమతో పాటు ఇతరుల ప్రాణాల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండా..

ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ లోన్ యాప్‌ల మోసాలు, డిజిటల్ అరెస్ట్ పేరుతో జరుగుతున్న మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, అనుమానాస్పద లింకులు, ఆన్‌లైన్ బెదిరింపుల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.అదేవిధంగా మహిళలపై జరిగే నేరాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. గ్రామంలో భూ వివాదాలు తలెత్తినప్పుడు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా, సంబంధిత అధికారులను సంప్రదించి చట్టపరమైన మార్గాల్లో సమస్యలను పరిష్కరించుకోవాలని ప్రజలకు సూచించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన..

అనంతరం గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను ఎస్ఐ వేణుగోపాల్ రాజు సిబ్బందితో కలిసి పరిశీలించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల పరిస్థితులను సమీక్షించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రజలు పోలీసులకు సహకరించాలని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ కోరారు.

అట్టహాసంగా బతుకమ్మ సంబరాలు ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)
బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆడిపాడారు. బతుకమ్మ పాటలతో రవీంద్రభారతి ప్రాంగణం మార్మోగింది. ప్రారంభ వేడుకలకు మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రులు ఆడబిడ్డలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతి ప్రసాదించిన పూలను దేవతగా కొలిచే అపురూపమైన పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల సామూహిక జీవన విధానానికి, కష్టసు ఖాలను కలిసి పంచుకునే ఐక్యతా భావానికి ఈ పండుగ నిదర్శనమని అన్నారు. రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలని, ప్రతి ఒక్కరూ ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని మంత్రులు ఆకాంక్షించారు. తెలంగాణ సుభిక్షంగా వర్ధిల్లాలని, మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడంతోపాటు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ వాణిప్రసాద్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్‌తోపాటు పలువురు కార్పొరేషన్ చైర్ పర్సన్లు పాల్గొన్నారు.

ఆహార భద్రత కల్తీ నాణ్యతపె దృష్టి సారించాలి

ఆళ్లగడ్డ, వెలుతురు అక్టోబర్ 10: ఆహారభద్రత, నాణ్యత ప్రమాణాలు, కల్తీ లపై ప్రభుత్వం దృష్టి సారించాలని రాష్ట్ర వినియోగదారుల రక్షణ మండలి సమాఖ్య కార్యదర్శి విజయ్ విజ్ఞప్తి చేశారు. ఆళ్లగడ్డ లోని పలు మిఠాయి దుకాణాలను శనివారం అయన తనిఖీ చేశారు.రానున్న దసరా, దీపావళి పండుగల సందర్భంగా మిఠాయిలు, పానీయాలు, పాల ఉత్పత్తులు వినియోగించడం అధికంగా ఉంటుందని ఇదే అదనుగా భావించి నకిలీ, కల్తీ, సురక్షితం కాని ఆహార పదార్థాలను అమ్మకం జరిపేందుకు కొందరు అక్రమ వ్యాపారులు ప్రయత్నిస్తారన్నారు.ఇలాంటి వారిపై ఆహార భద్రత తాధికారులు తగిన చర్యలు తక్షణం ఉపక్రమంచాలని రాష్ట్ర వినియోగ దారుల రక్షణ సంఘాల సమైఖ్య వ్యవహారిక కార్యదర్శి విజయ కోరారు. అక్రమ వియాలను అరికట్టడానికి పర్యవేక్షణ మరియు అమలు చర్యలను పెంచాలని ఫుడ్ షఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియాను కోరారు.

బేబీ రుక్సాన ఆరోగ్యంపై ఆరా

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 10 : గాంధీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బేబీ రుక్సానా ఆరోగ్య పరిస్థితిపై మంత్రి దామోదర్ రాజ నర్సింహ ఆరా తీశారు. మంత్రి ఆదేశాలతో ఆయన కార్యాలయ అధికారులు శనివారం ఉదయం గాంధీ హాస్పిటల్‌కు వెళ్లి పాప, ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. హాస్పిటల్ సూపరింటెండెంట్, డాక్టర్ ఉషారాణి గారితో మంత్రి ఫోన్‌లో మాట్లాడి పాప ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. పాపకు పుట్టుకతోనే పెద్ద పేగు సమస్య ఉందని, ఈ సమస్యకు పాప పుట్టినప్పుడే నీలోఫర్‌లో సర్జరీ చేశారని ఉషారాణి తెలిపారు. ఇటీవలే గాంధీలో పాపకు మరో సర్జరీ జరిగిందని, మరో 3 నెలల తర్వాత ఇంకొక సర్జరీ చేయాల్సి ఉందని ఆమె వివరించారు. పాపకు చికిత్స విషయంలో ఎలాంటి సమస్య లేదన్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉన్నారని చెప్పారు. కుటుంబ కలహాలు, ఆర్థిక పరిస్థితుల వల్లే రుక్సానా తల్లి ఈ కఠిన నిర్ణయం తీసుకున్నదని ఉషారాణి తెలిపారు. కుటుంబ పరిస్థితులు, సరియైన ఉపాధి లేకపోవడం వల్ల ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పాప తల్లి మంత్రి కార్యాలయ అధికారులకు తెలిపారు. భర్త వదిలేసి వెళ్లిపోయాడని, అద్దె ఇంట్లో ఉంటూ, దొరికిన పని చేసుకుంటూ తానే ఇద్దరు ఆడపిల్లల్ని పోషించుకుంటున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైనా ఉపాధి కల్పించాలని ఆమె కోరగా, ఈ విషయాన్ని అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే మంత్రి సానుకూలంగా స్పందించారు. పాప తల్లికి గాంధీ హాస్పిటల్‌లోనే, ఆమె అర్హతకు తగిన ఉద్యోగం కల్పించాలని సూపరింటెండెంట్ ఉషారాణికి సూచించారు. పాపకు గాంధీలోనే పూర్తిస్థాయిలో మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. రుక్సానా తల్లికి వారం రోజుల్లో ఉద్యోగం కల్పిస్తామని ఉషారాణి వెల్లడించారు.

మాట నిలబెట్టుకున్న మంత్రి వెంకన్న

- మూగ, చెవిటి దంపతుల బిడ్డకు అండగా నిలిచి.. మెరుగైన వైద్యం అందేలా చర్యలు
- మరో 2 లక్షల ఆర్థికసాయం.. స్వయంగా వైద్యులతో మాట్లాడి శస్త్రచికిత్స చేయించిన మంత్రి
- చిన్నారి భవిష్యత్తులో విద్యా బాధ్యతలూ తనవేనని భరోసా

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 10 : కష్టాల్లో ఉన్నవారికి నేనున్నానంటూ భరోసా ఇవ్వడమే కాదు.. ఇచ్చిన మాటను నిలబెట్టుకుని ఆ కుటుంబంలో ఆశలు నింపడమే నిజమైన మానవత్వం. రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మరోసారి తన మానవతా హృదయాన్ని చాటుకున్నారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఓ నిరుపేద కుటుంబానికి అండగా నిలిచి, వారి చిన్నారికి మెరుగైన వైద్యం అందేలా స్వయంగా చొరవ తీసుకున్నారు.

రెండు రోజుల క్రితం వచ్చిన కుటుంబానికి తక్షణ సాయం

ఉమ్మడి నల్గొండ జిల్లాలోని పనిగిరి గ్రామానికి చెందిన జంపాల మహేష్‌కుమార్, రజిత దంపతులిద్దరూ వినికిడి, మాటల సమస్యలతో బాధపడుతున్నారు. వారికి జన్మించిన బిడ్డ కూడా అదే సమస్యతో పుట్టడంతో ఆ తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. చిన్నారికి సరైన వైద్యం అందిస్తే మాట్లాడే అవకాశం ఉందని వైద్యులు చెప్పడంతో ఆ తల్లిదండ్రుల్లో ఆశ చిగురించింది. అయితే, చికిత్సకు లక్షల్లో ఖర్చవుతుందని తెలియడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆ దంపతులు రెండు రోజుల క్రితం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఆశ్రయించారు. వారి ఆవేదనను అర్థం చేసుకున్న మంత్రి వెంటనే స్పందించి రూ. 2 లక్షల తక్షణ ఆర్థికసాయం అందించారు. అంతటితో ఆగకుండా, చిన్నారికి మెరుగైన వైద్యం అందించేందుకు వైద్యులతో స్వయంగా మాట్లాడి అవసరమైన చికిత్స చేయిస్తానని ఆ కుటుంబానికి ధైర్యం చెప్పారు.

ఇచ్చిన మాట ప్రకారం.. చిన్నారికి శస్త్రచికిత్స

బాధిత కుటుంబానికి ఇచ్చిన హామీ మేరకు మంత్రి చొరవ తీసుకుని హైదరాబాద్‌లోని కొండాపూర్ కిమ్స్ ఆసుపత్రిలో చిన్నారిని చేర్పించి శస్త్రచికిత్స చేయించారు. శస్త్రచికిత్స పూర్తయిన అనంతరం మంత్రి నేడు ఆసుపత్రికి వెళ్లి చిన్నారిని ఆప్యాయంగా పలకరించి, కుటుంబ సభ్యులను పరామర్శించి, మరో 2లక్షలు ఆర్థికసాయం అందజేశారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. శస్త్రచికిత్స అనంతరం స్పీచ్ థెరపీ పూర్తిచేస్తే రానున్న కొన్ని నెలల్లో చిన్నారి మాట్లాడే అవకాశం ఉందని వైద్యులు వివరించారు. తమ బిడ్డకు మెరుగైన వైద్యం అందడంతో పాటు, భవిష్యత్తుపై ఆశలు చిగురించడంతో ఆ కుటుంబ సభ్యులు ఆనందభాష్పాలు పెట్టుకున్నారు. కష్టకాలంలో తమకు అండగా నిలిచి, బిడ్డకు చికిత్స చేయించిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

బిడ్డ భవిష్యత్తుకూ భరోసా.. విద్యా బాధ్యతలు నావే

చిన్నారికి వైద్యం అందించడంతోనే తన బాధ్యత ముగిసిపోలేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. బిడ్డ భవిష్యత్తులో విద్యకు సంబంధించిన పూర్తి బాధ్యతలను తానే తీసుకుంటానని ఆ కుటుంబానికి హామీ ఇచ్చారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా చిన్నారి భవిష్యత్తుకు ఎలాంటి ఆటంకం కలగకుండా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలవడం, ఎంతో భవిష్యత్ ఉన్న ఓ చిన్నారి జీవితంలో కొత్త ఆశలు నింపడం, ఆ బిడ్డ భవిష్యత్తుకు భరోసా కల్పించడం.. ఇవే ప్రజాసేవకు నిజమైన అర్థమని పలువురు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సేవలు కొనియాడుతున్నారు.

మహిళా సంఘాల ఉత్పత్తులకు విశేష ఆదరణ

- హైదరాబాద్‌లో సందర్శకులతో కిటకిటలాడిన సరస్ మేళా
- నాలుగో రోజు 40 వేలకు పైగా సందర్శకులు.. రూ.30 లక్షలకు పైగా విక్రయాలు
- వ్యాపార అవకాశాలపై అవగాహన కోసం మండల సమాఖ్య అధ్యక్షుల ప్రత్యేక సందర్శన

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 10 : మహిళా స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన గ్రామీణ ఉత్పత్తులకు పట్టణ మార్కెట్‌లో మంచి ఆదరణ లభిస్తోంది. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న గ్రామీణ ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయ మేళా 'సరస్' నాలుగో రోజు సందర్శకులతో కిటకిటలాడింది. తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన స్టాళ్లకు సందర్శకుల నుంచి విశేష స్పందన లభించింది. మేళా ప్రారంభమైనప్పటి నుంచి సందర్శకుల సంఖ్య పెరుగుతుండటంతో పాటు విక్రయాలు కూడా గణనీయంగా నమోదవుతున్నాయి. నాలుగో రోజు నాటికి మేళాను సందర్శించిన వారి సంఖ్య 40 వేలు దాటగా, మొత్తం విక్రయాలు రూ. 30 లక్షలకు మించాయి. మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులకు లభిస్తున్న ఆదరణ గ్రామీణ మహిళల వ్యాపార సామర్థ్యానికి, వారి ఉత్పత్తుల నాణ్యతకు నిదర్శనంగా నిలుస్తోంది.

తెలంగాణ సంప్రదాయ వస్త్రాలు.. హస్తకళలకు ప్రత్యేక ఆకర్షణ

మేళాలో తెలంగాణ సంప్రదాయ చేనేత వస్త్రాలు, హస్తకళలు, గృహోపకరణాలు, పచ్చళ్లు, చిరుతిళ్లు, చిరుధాన్య ఉత్పత్తులు, ఇతర గ్రామీణ ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన మహిళా సంఘాల ఉత్పత్తులకు కూడా మంచి గిరాకీ లభిస్తోంది. ఒక్కో రాష్ట్రానికి ప్రత్యేకమైన సంప్రదాయ కళలు, వస్త్రాలు, ఆహార ఉత్పత్తులను ఒకే వేదికపై కొనుగోలు చేసే అవకాశం ఉండటంతో కుటుంబాలతో సహా పెద్ద సంఖ్యలో ప్రజలు మేళాకు తరలివస్తున్నారు. మహిళలు తమ ఇళ్ల వద్ద, గ్రామాల్లో తయారు చేసిన ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించే అవకాశం కల్పించడం ద్వారా సరస్ మేళా వారికి మంచి మార్కెటింగ్ వేదికగా నిలుస్తోంది. మధ్యవర్తులపై ఆధారపడకుండా తమ ఉత్పత్తులకు తగిన ధర పొందేందుకు, వినియోగదారుల అభిరుచులను తెలుసుకునేందుకు ఈ మేళా దోహదపడుతోంది.

మండల సమాఖ్య అధ్యక్షులకు ప్రత్యేక సందర్శన

మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు మార్కెట్‌లో ఉన్న అవకాశాలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు మండల సమాఖ్య అధ్యక్షుల కోసం ప్రత్యేక సందర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మేళాలోని వివిధ స్టాళ్లను సందర్శించిన వారు మహిళా సంఘాలు తయారు చేస్తున్న ఉత్పత్తులు, వాటి నాణ్యత, ధరలు, ప్యాకేజింగ్, విక్రయ పద్ధతులను పరిశీలించే అవకాశం కల్పించారు. విస్తృతమైన మార్కెట్‌ను ఎలా అందిపుచ్చుకోవాలి? వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తులను ఎలా అభివృద్ధి చేయాలి? ఉత్పత్తులకు మెరుగైన ధర ఎలా పొందాలి? వ్యాపారాన్ని ఏ విధంగా విస్తరించుకోవాలి? అనే అంశాలపై అవగాహన పెంపొందించుకోవడానికి ఈ సందర్శన ఉపయోగపడనుంది. మహిళా సంఘాల నాయకత్వానికి వ్యాపార నిర్వహణపై అవగాహన కల్పించడం, గ్రామీణ మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు మరిన్ని మార్కెటింగ్ అవకాశాలు కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.

సెంట్రలైజ్డ్ ఏసీతో ఆహ్లాదకర వాతావరణం

మేళాకు భారీ సంఖ్యలో సందర్శకులు తరలివస్తున్న నేపథ్యంలో ఉక్క పోత ప్రభావం లేకుండా స్టాళ్ల నిర్వాహకులైన మహిళలకు, కొనుగోలుదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మేళా ప్రాంగణం మొత్తం సెంట్రలైజ్డ్ ఏసీ సౌకర్యంతో ఉండటంతో సందర్శకులు ఆహ్లాదకరమైన వాతావరణంలో షాపింగ్ చేస్తున్నారు. స్టాళ్లను సందర్శిస్తూ వివిధ ఉత్పత్తుల వివరాలు తెలుసుకోవడంతో పాటు తమకు నచ్చిన వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. స్టాళ్లలో ఉత్పత్తులను ప్రదర్శించేందుకు, విక్రయాలు నిర్వహించేందుకు మహిళా సంఘాలకు అనుకూలమైన వాతావరణం కల్పించడంతో పాటు సందర్శకుల సౌకర్యానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. మేళా నిర్వహణలో భాగంగా సందర్శకులకు, స్టాల్ నిర్వాహకులకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు సరస్ ఒక వేదిక

సరస్ మేళా కేవలం ఉత్పత్తుల విక్రయ కేంద్రంగానే కాకుండా గ్రామీణ మహిళల ప్రతిభను, సృజనాత్మకతను వెలుగులోకి తీసుకొచ్చే వేదికగా నిలుస్తోంది. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగడంతో పాటు తమ ఉత్పత్తులను వ్యాపారంగా అభివృద్ధి చేసుకునేందుకు ఇటువంటి మేళాలు దోహదపడుతున్నాయి. సంప్రదాయ కళలు, గ్రామీణ వృత్తులకు ప్రోత్సాహం లభించడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కూడా ఇవి తోడ్పడుతున్నాయి. మహిళలు ఉత్పత్తిదారులుగా మాత్రమే కాకుండా విజయవంతమైన వ్యాపారవేత్తలుగా ఎదగాలంటే ఉత్పత్తి నాణ్యతతో పాటు మార్కెటింగ్, బ్రాండింగ్, ప్యాకేజింగ్, వినియోగదారులతో సంబంధాలపై అవగాహన అవసరం. సరస్ వంటి వేదికలు ఈ అవకాశాలను కల్పిస్తూ మహిళల ఆర్థిక స్వావలంబనకు బాటలు వేస్తున్నాయి. నాలుగో రోజు కూడా సందర్శకుల రద్దీ, పెరుగుతున్న విక్రయాలు సరస్ మేళాకు లభిస్తున్న ఆదరణను ప్రతిబింబిస్తున్నాయి. మహిళా సంఘాల ఉత్పత్తులకు మరింత విస్తృతమైన మార్కెట్‌ను అందించడమే లక్ష్యంగా మేళా కొనసాగుతోంది.

ప్రజా విశ్వాసం కోల్పోయిన పార్టీ

- ఎక్స్పైరీ , ఔట్ డేటెడ్ పార్టీ బి ఆర్ ఎస్ మీడియా సమావేశంలో బీజేపీ కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్

కరీంనగర్, వెలుతురు: కరీంనగర్‌లో బీఆర్ఎస్ పార్టీ ఉనికి కోసమే డ్రామా రాజకీయాలు చేస్తోందని కిసాన్ నగర్ 29వ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం రోజున కరీంనగర్‌లోని ఎస్‌బీఎస్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సొంత పార్టీలో ఉన్నవారినే కొత్తగా చేరికలంటూ బీఆర్ఎస్ నేతలు ప్రజలను మోసం చేస్తున్నారని, ఇదొక పెద్ద ఫేక్ ప్రచారమని మండిపడ్డారు. కిసాన్‌నగర్‌లో బీఆర్ఎస్‌లోకి చేరికలు జరిగినట్లు జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, సోషల్ మీడియాలో పబ్లిసిటీ కోసం తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజలను గందరగోళానికి గురిచేయడానికే ర్యాలీలు నిర్వహించి, చేరికల సమావేశాలు పెట్టడం సిగ్గుచేటన్నారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు సర్వస్వం గులాబీమయం చేసుకున్న బీఆర్ఎస్ నేతలకు, ఇప్పుడు కాషాయ రంగును చూస్తే కడుపుమంట ఎందుకని ప్రశ్నించారు. ప్రభుత్వ భవనాలు, రోడ్లు, ప్రతి చిహ్నాన్ని గులాబీ రంగుతో నింపేసినప్పుడు లేని తప్పు, ఇప్పుడు కాషాయ రంగు కనిపిస్తేనే ఎందుకు వస్తోందని నిలదీశారు. టౌన్ ప్రెసిడెంట్ చల్లా హరిశంకర్ ఆ పదవికి అనర్హుడని, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో రెండు చోట్ల పోటీ చేస్తే ప్రజలు ఆయనను తిరస్కరించారన్నారు. మేయర్ పీఠాన్ని కోల్పోయి సింగిల్ డిజిట్‌కు పరిమితమైనా చల్లా హరిశంకర్ సిగ్గులేకుండా మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. మాజీ మంత్రివర్యులు, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ మేయర్ రవీందర్ సింగ్, ఏడ్ల అశోక్, కంసాల శ్రీనివాస్ లతదితరుల ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు. కరీంనగర్ కిసాన్ నగర్‌లో దళితబంధు ఇళ్ళు ప్రొసీడింగ్స్ ల పేరుతో పేదల నుంచి వేల రూపాయలు వసూలు చేశారని, అందుకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయని, దయచేసి వారందరికీ తిరిగి డబ్బులు ఇవ్వాలని కోరారు. బీసీ నాయకుల ముసుగు కప్పుకొని దొరల పార్టీ వెనుక తిరుగుతూ ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. దళిత బంధు విషయంలో బాధితులు ఇప్పటికీ న్యాయం కోసం ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చొరవ వల్లే నగరంలో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ , స్మార్ట్ సిటీ ద్వారా భారీ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ప్రజా విశ్వాసం కోల్పోయి అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ ఒక 'అవుట్‌డేటెడ్' పార్టీ అని, ఆ మునిగిపోయే నావలో చేరేందుకు ఎవరూ సిద్ధంగా లేరని విషయాన్ని బిఆర్ఎస్ నాయకత్వం గ్రహిస్తే మంచిదన్నారు. బిఆర్ఎస్ నేతలు చిల్లర రాజకీయాలు మానుకోవాలని, లేకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.. కరీంనగర్లో ఇక బి ఆర్ ఎస్ కు స్థానం లేదని రాబోయే రోజుల్లో కరీంనగర్ అసెంబ్లీలో కూడా బీజేపీ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు రవీంద్ర భూపతి, మేకల వెంకటేష్, కర్రే పద్మా అనిల్, పొన్నం మండన్నా కార్యకర్తలు గాలి సురేష్, కళ్యాణ్, విష్ణు ప్రసాద్, పవన్, సాయి వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

లలిత కళా తోరణంలో బతుకమ్మ వేడుకలు

పాల్గొన్న మంత్రులు జూపల్లి, పొన్నం

బతుకమ్మ పాటలను ఆవిష్కరించిన మంత్రులు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 10: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు నగరంలో సందడిగా సాగుతున్నాయి. పబ్లిక్ గార్డెన్‌లోని లలిత కళా తోరణంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖ సమర్పణలో ప్రత్యేకంగా రూపొందించిన బతుకమ్మ పాటలను మంత్రులు ఆవిష్కరించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పేలా ఈ పాటలను రూపొందించారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ వాణిప్రసాద్, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

"వాళ్లు వెళ్లిపోతే... ఒక ప్రపంచం వెళ్లిపోతుంది"

మనిషి జీవితంలో కొన్ని నష్టాలు భర్తీ చేయలేనివి. ఎంత సంపద ఉన్నా, ఎంత సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నా, ఎంత మంది మనుషులు మన చుట్టూ ఉన్నా కొన్ని ఖాళీలను మాత్రం ఏదీ పూరించలేదు. అలాంటి ఖాళీ మన పెద్దలు మనల్ని విడిచి వెళ్లిపోయినప్పుడు ఏర్పడుతుంది. ఒక తాతయ్య, ఒక బామ్మ, ఒక అమ్మ, ఒక నాన్న, ఒక బాబాయి, ఒక పిన్ని మన జీవితంలో నుంచి దూరమైనప్పుడు మనం కేవలం ఒక వ్యక్తిని కోల్పోము. వారితో పాటు ఒక జీవన విధానాన్ని, ఒక సంస్కృతిని, ఒక తరం అనుభవాన్ని, ఎన్నో జ్ఞాపకాలను, మన కుటుంబ చరిత్రలోని ఒక అధ్యాయాన్ని కోల్పోతాం. ఒక్కసారి మనం భవిష్యత్తును ఊహించుకోవాలి. మరో పది, పదిహేను సంవత్సరాల తర్వాత మన చుట్టూ ఉన్న ప్రపంచం ఎలా ఉంటుందో ఆలోచించాలి. ఈరోజు మన ఇళ్లలో కనిపిస్తున్న పెద్దలు ఒక్కొక్కరుగా మన నుంచి దూరమవుతారు. మన చిన్ననాటి జ్ఞాపకాలకు సాక్షులైన వారు ఉండరు. మన కుటుంబం ఎలా ఎదిగిందో చెప్పేవారు ఉండరు. మన తల్లిదండ్రుల చిన్ననాటి సంగతులు తెలిసినవారు ఉండరు. మన ఊరి పాత కథలు, కుటుంబంలోని అనుబంధాలు, పండుగల వెనుక ఉన్న సంప్రదాయాలు, కష్టకాలంలో కుటుంబం ఎలా నిలబడిందో చెప్పే గొంతులు క్రమంగా నిశ్శబ్దమవుతాయి. వారి జీవితం మన ప్రస్తుత జీవితంతో పోలిస్తే చాలా సాధారణంగా కనిపించవచ్చు. కానీ ఆ సాధారణ జీవితంలోనే అసాధారణమైన విలువలు దాగి ఉండేవి. వారి ఉదయం సూర్యుడు ఉదయించకముందే మొదలయ్యేది. ఇంటి ముందు ముగ్గు వేయడం, మొక్కలకు నీళ్లు పోయడం, తోటలో పూలు కోయడం, వాటిని దేవుడి దగ్గర పెట్టడం వంటి పనులు వారి రోజువారీ జీవితంలో భాగం. దేవుడి పేరు చెప్పుకుని రోజును ప్రారంభించేవారు. నేటి జీవితంలో ఇవి చిన్న విషయాలుగా కనిపించవచ్చు. కానీ వారికి అవే జీవనశైలిలోని సహజమైన భాగాలు. వారికి కాలంతో కూడా ఒక ప్రత్యేకమైన అనుబంధం ఉండేది. ఏకాదశి ఎప్పుడు, అమావాస్య ఎప్పుడు, పౌర్ణమి ఎప్పుడు అన్నది తెలుసుకోవడానికి మొబైల్‌లో రిమైండర్లు అవసరం ఉండేది కాదు. పంచాంగం చేతిలో ఉండేది లేదా వారి జ్ఞాపకాల్లోనే ఉండేది. పండుగ ఎప్పుడు వస్తుందో, ఏ రోజున ఏ పని చేయాలో, ఏ సంప్రదాయాన్ని ఎలా పాటించాలో వారికి సహజంగానే తెలుసు. భక్తి, ఆచారం, ప్రకృతి, కుటుంబం---ఇవన్నీ వారి జీవితంలో వేరువేరు అంశాలు కాదు. ఒకదానితో ఒకటి కలిసిపోయిన జీవన విధానం. వారి పలకరింపుల్లో కూడా ఒక ప్రత్యేకమైన ఆత్మీయత ఉండేది. దారిలో పరిచయస్తుడు కనిపిస్తే ఆగి "ఎలా ఉన్నావు? అంతా బాగుందా?" అని అడిగేవారు. అది మర్యాద కోసం అడిగిన ప్రశ్న కాదు. ఎదుటి మనిషి బాగుండాలని కోరుకునే మనసుతో అడిగిన పలకరింపు. ఎవరికైనా అనారోగ్యం వచ్చిందని తెలిసినా, ఇంట్లో ఏదైనా ఇబ్బంది ఉందని తెలిసినా, కేవలం ఫోన్ చేసి ఆరా తీయడం మాత్రమే కాకుండా స్వయంగా ఇంటికి వెళ్లి పరామర్శించేవారు. ఎవరి ఇంట్లో శుభకార్యం జరిగినా తమ ఇంటి వేడుకగా భావించేవారు. ఎవరికైనా కష్టం వస్తే "నీకు ఏం కావాలి?" అని అడిగే మనుషులు. ఈ రోజుల్లో మన ఫోన్‌లో వందలాది, వేలాది పరిచయాలు ఉండవచ్చు. సోషల్ మీడియాలో వందల మంది స్నేహితులు ఉండవచ్చు. కానీ నిజంగా మన కష్టంలో మన పక్కన నిలబడే మనుషులు ఎంతమంది? మనకు ఎదురుగా నివసించే వ్యక్తి పేరు తెలియని పరిస్థితి కూడా ఇప్పుడు సాధారణమవుతోంది. అదే సమయంలో మన

పెద్దల తరం మాత్రం పరిచయాలను కేవలం పేర్లుగా కాకుండా సంబంధాలుగా చూసింది. పక్కింటివారు, బంధువులు, స్నేహితులు, ఊరివారు---ప్రతి సంబంధానికి ఒక బాధ్యత ఉందని వారు నమ్మేవారు. వార్తాపత్రిక కూడా వారి జీవితంలో ఒక ప్రత్యేకమైన భాగం. ఉదయం పేపర్ చదివేవారు. మళ్లీ మధ్యాహ్నం తీసుకుని చదివేవారు. సాయంత్రం మరోసారి తిరగేసేవారు. అది కేవలం వార్తలు తెలుసుకోవడం కోసం కాదు. ప్రపంచంతో తమకున్న అనుబంధాన్ని కొనసాగించుకోవడానికి. ఇప్పుడు వార్తలు మన చేతిలోకి క్షణాల్లో వస్తున్నాయి. కానీ వార్తలు ఎక్కువయ్యాయి తప్ప మనిషి చుట్టూ ఉన్న సమాజంతో సంబంధం అదే స్థాయిలో పెరిగిందా అన్నది ఆలోచించాల్సిన విషయం. వారి ఫోన్‌బుక్ కూడా ప్రత్యేకమే. చిన్న డైరీలో బంధువుల ఫోన్ నంబర్లు, స్నేహితుల నంబర్లు, పరిచయస్తుల వివరాలు రాసుకునేవారు. ఆ డైరీ ఎక్కడ ఉందో వారికి తెలుసు. కొన్నిసార్లు నంబర్లు గుర్తుపెట్టుకునే వారు. మనం ఇప్పుడు వందలాది కాంటాక్టులను ఫోన్‌లో భద్రపరుచుకుంటున్నాం. కానీ ఫోన్ లేకుండా మనకు అత్యంత సన్నిహితులైన కొంతమంది నంబర్లు కూడా చెప్పలేని పరిస్థితి వచ్చింది. సాంకేతికత మన జ్ఞాపక భారాన్ని తగ్గించింది. కానీ దానితో పాటు జ్ఞాపకశక్తిపై ఆధారపడే మన పాత అలవాట్లను కూడా తగ్గించింది. వారి జీవితంలో ఆడంబరం తక్కువ. పాత చెప్పులు, సాధారణ దుస్తులు, మందపాటి కళ్లద్దాలు---అంతే. అయినా ఎవరికీ తమను తాము నిరూపించుకోవాల్సిన అవసరం ఉండేది కాదు. సోషల్ మీడియాలో తమ జీవితం ఎలా కనిపిస్తుందో అనే ఆలోచన ఉండేది కాదు. ఉన్నదానితో సంతోషంగా ఉండేవారు. అవసరానికి మించి సంపాదించాలనే పోటీ కంటే ఉన్నదాన్ని పంచుకోవాలనే మనస్తత్వం ఎక్కువగా కనిపించేది. సంతృప్తి అంటే ఏమిటో వారి జీవితాలను చూస్తే అర్థమయ్యేది. వారి ఆహారంలో కూడా ఒక తరం జీవన జ్ఞానం దాగి ఉండేది. వేసవి వచ్చిందంటే ఇంట్లో ఊరగాయలు, వడియాలు, అప్పడాలు తయారయ్యేవి. ఇంట్లోనే మసాలాలు సిద్ధం చేసుకునేవారు. నాటు టమాటాలు, దేశీ వంకాయలు, తాజా ఆకుకూరలు వంటి స్థానిక ఆహార పదార్థాలకు ప్రాధాన్యం ఉండేది. ఆ భోజనంలో కేవలం రుచి మాత్రమే ఉండేది కాదు. శ్రమ ఉండేది, అనుభవం ఉండేది, కుటుంబ సభ్యుల భాగస్వామ్యం ఉండేది. ఒక వంటకం వెనుక ఒక కథ ఉండేది. ఒక రుచి వెనుక ఒక జ్ఞాపకం ఉండేది. పండుగలు కూడా వారికి కేవలం కొత్త బట్టలు కొనడం కాదు. పండుగ అంటే కుటుంబం మొత్తం ఒకచోట చేరడం. ఇంట్లో నవ్వులు వినిపించడం. పిల్లల అల్లరి. బంధువుల రాక. పక్కింటివారికి పిలుపు. అందరూ కలిసి భోజనం చేయడం. ఒకరి ఇంట్లో జరిగిన ఆనందాన్ని మరొకరు పంచుకోవడం. అదే పండుగ. అదే సామాజిక జీవితం. ఇప్పుడు పండుగలు జరుగుతున్నాయి. కొత్త బట్టలు వస్తున్నాయి. ఖరీదైన వంటకాలు వస్తున్నాయి. ఫోటోలు, వీడియోలు తీస్తున్నాం. కానీ ఒకే ఇంట్లో ఉన్న మనుషులు కూడా కొన్నిసార్లు తమ తమ ఫోన్‌లలో మునిగిపోయే పరిస్థితి వచ్చింది. వేడుక పెరిగింది; కానీ ఆత్మీయత తగ్గుతోందా అన్న ప్రశ్న మన ముందుంది. అందుకే మనం కోల్పోతున్నది కేవలం ఒక తరం కాదు. ఒక జీవన తత్వం. మన పెద్దలు వెళ్లిపోతున్న కొద్దీ వారి వెంట అనేక అనుభవాలు కూడా వెళ్లిపోతున్నాయి. వారు ఎదుర్కొన్న కష్టాలు, చేసిన త్యాగాలు, కుటుంబాన్ని నిలబెట్టిన విధానం, సంబంధాలను కాపాడిన పద్ధతి, జీవితాన్ని తక్కువ వనరులతో సంతోషంగా గడిపిన తీరు---ఇవన్నీ పుస్తకాల్లో పూర్తిగా దొరకవు. అవి వారి జీవితాల్లో కనిపిస్తాయి. వారి మాటల్లో వినిపిస్తాయి. వారి జ్ఞాపకాల్లో ఉంటాయి. వాళ్లు వెళ్లిపోయిన తర్వాతే మనకు వారి విలువ మరింత స్పష్టంగా తెలుస్తుంది. ఇంట్లో వారు కూర్చునే కుర్చీ ఖాళీగా కనిపిస్తుంది. వారి గది తలుపు తెరిచినప్పుడు ఒక నిశ్శబ్దం ఎదురవుతుంది. వారి గొంతు వినిపించదు. వారి పిలుపు వినిపించదు. వారు చేసిన వంట రుచి మళ్లీ అదే విధంగా దొరకకపోవచ్చు. చిన్నప్పుడు ఎన్నిసార్లు విన్న కథలు అప్పట్లో విసుగుగా అనిపించినా, వారు లేని తర్వాత అదే కథ ఒక్కసారి వినడానికి మనసు ఎంతగానో కోరుకుంటుంది.

వారి ఫోటో ముందు నిలబడి కన్నీళ్లు పెట్టుకున్నా వారితో మాట్లాడలేం. వారు మన ముందు కూర్చుని ఉన్నప్పుడు మనకు లభించిన అవకాశాన్ని తిరిగి తెచ్చుకోలేం. అందుకే ప్రేమను వాయిదా వేయకూడదు. పలకరింపును వాయిదా వేయకూడదు. కలవడాన్ని వాయిదా వేయకూడదు. "తర్వాత మాట్లాడతాను", "తర్వాత వెళ్తాను", "సమయం దొరికినప్పుడు కూర్చుంటాను" అంటూ వాయిదా వేస్తూ ఉంటే ఒకరోజు ఆ తర్వాత అనే సమయమే మన చేతుల్లో లేకపోవచ్చు. ఇప్పుడే వారి పక్కన కూర్చోవాలి. వారి చిన్ననాటి కథలు అడగాలి. "మీ చిన్నప్పుడు ఎలా ఉండేది?" అని ప్రశ్నించాలి. వారు చెప్పే అదే కథను పదోసారి చెప్పినా ఓపికగా వినాలి. ఎందుకంటే వారికి అది పాత కథ కావచ్చు. కానీ రేపు మనకు అది దొరకని చరిత్ర కావచ్చు. వారి బాల్యం గురించి, వారి తల్లిదండ్రుల గురించి, మన కుటుంబం గతం గురించి, మన ఊరి పరిస్థితుల గురించి మనం అడిగి తెలుసుకోవాలి. అవసరమైతే వారి మాటలను రికార్డు చేసుకోవాలి. పాత ఫోటోలు భద్రపరచాలి. వారి జ్ఞాపకాలను రాసుకోవాలి. ఎందుకంటే జ్ఞాపకాలు కూడా ఒక తరం నుంచి మరో తరానికి అందించాల్సిన వారసత్వమే. వారికి మనం ఇచ్చే ఖరీదైన బహుమతుల కంటే మన సమయమే విలువైనది. వారి చేతిని పట్టుకుని కొద్దిసేపు మాట్లాడటం, వారితో కలిసి భోజనం చేయడం, వారి పక్కన మౌనంగా కూర్చోవడం, వారి మాటలను శ్రద్ధగా వినడం---ఇవే వారికి నిజమైన ఆనందాన్ని ఇచ్చే విషయాలు. మనం పెద్దలకు సమయం ఇస్తున్నామని అనుకోవద్దు. నిజానికి మనమే వారి ద్వారా మన గతాన్ని, మన కుటుంబాన్ని, మన మూలాలను తెలుసుకునే సమయాన్ని సంపాదించుకుంటున్నాం. సాంకేతికత మారుతుంది. ఇళ్లు మారుతాయి. జీవనశైలి మారుతుంది. మన పిల్లలు మనకంటే భిన్నమైన ప్రపంచంలో పెరుగుతారు. కానీ ఒక కుటుంబానికి గతంతో సంబంధం లేకపోతే ఆ కుటుంబ చరిత్రలో ఒక పెద్ద ఖాళీ ఏర్పడుతుంది. పెద్దలు ఆ గతానికి జీవించి ఉన్న జ్ఞాపకాలు. వారు మన కుటుంబ వేర్లు. వారు మన సంస్కృతికి వాహకులు. వారు మన గతానికి, వర్తమానానికి మధ్య ఉన్న వంతెన. వేర్లను మర్చిపోయిన చెట్టు ఎంత ఎత్తుకు ఎదిగినా దాని బలం ప్రశ్నార్థకమే. అదే విధంగా మన గతాన్ని, మన పెద్దలను, వారి అనుభవాలను మర్చిపోయి ఆధునికత వైపు ఎంత వేగంగా పరుగెత్తినా మన జీవితంలో ఒక అంతర్గత ఖాళీ ఏర్పడే అవకాశం ఉంది. ఆధునికతను తిరస్కరించాల్సిన అవసరం లేదు. సాంకేతికతను వదులుకోవాల్సిన అవసరం లేదు. కానీ అభివృద్ధి పేరుతో మనుషుల మధ్య ఉన్న ఆత్మీయతను కోల్పోకూడదు. కొత్త ప్రపంచాన్ని స్వీకరిస్తూనే పాత తరంలో ఉన్న విలువలను కాపాడుకోవాలి. మన పెద్దలు ఎప్పటికీ మనతో ఉండరు. ఇది జీవిత సత్యం. ఆ సత్యాన్ని మనం తెలుసుకున్నప్పటికీ, వారు మనతో ఉన్నంతకాలం వారి విలువను పూర్తిగా గుర్తించకపోవడం మనిషి జీవితంలోని ఒక విచిత్రమైన విషాదం. వారు వెళ్లిపోయిన తర్వాత "ఇంకొంచెం సమయం వారితో గడిపి ఉంటే బాగుండేది" అనే బాధ మిగలకూడదు. ఆ బాధకు ముందే మనం మేలుకోవాలి. వారిని ప్రేమించాలి. గౌరవించాలి. పలకరించాలి. దగ్గరగా ఉంచుకోవాలి. వారి మాట వినాలి. వారి చేతి వంట తినాలి. వారి కథలు తెలుసుకోవాలి. వారి జ్ఞాపకాలను భద్రపరచాలి. ముఖ్యంగా వారికి మన సమయాన్ని ఇవ్వాలి. రేపు ఏమవుతుందో మనకు తెలియదు. కానీ ఈరోజు మన చేతుల్లో ఉంది. ఈరోజు మన పెద్దలు మనతో ఉన్నారు. ఈరోజు వారి గొంతు వినిపిస్తోంది. ఈరోజు వారి చేతిని పట్టుకోవచ్చు. ఈరోజు వారి పక్కన కూర్చోవచ్చు. ఈరోజు వారిని చూసి నవ్వవచ్చు. రేపు వారి ఫోటో ముందు నిలబడి ప్రేమను వ్యక్తం చేయడం కంటే, ఈరోజే వారి కళ్లలోకి చూసి "మీరు మాకు ఎంతో విలువైనవారు" అని చెప్పడం గొప్పది. ఎందుకంటే వారు కేవలం మన కుటుంబంలోని పెద్దలు కాదు. వాళ్లు మన వేర్లు. వాళ్లు మన చరిత్ర. వాళ్లు మన సంస్కృతి. వాళ్లు మన బాల్యం. వాళ్లు మన జ్ఞాపకాలు. వాళ్లు మన ఇంటి ఆత్మీయత. వాళ్లు మన గతానికి, మన వర్తమానానికి మధ్య ఉన్న వంతెన. అందుకే వాళ్లు మనతో ఉన్నప్పుడే వారిని ప్రేమిద్దాం. వారు మన పక్కన ఉన్నప్పుడే వారి విలువను తెలుసుకుందాం. వారు చెప్పే కథలను ఇప్పుడే విందాం. వారి చేతిని ఇప్పుడే పట్టుకుందాం. వారి పక్కన ఇప్పుడే కూర్చుందాం. ఎందుకంటే ఒకరోజు వారు వెళ్లిపోతే...ఒక మనిషి మాత్రమే వెళ్లిపోడు. ఒక ప్రపంచం వెళ్లిపోతుంది. అందుకే వారి విలువలను తెలుసుకోవాల్సిన అవసరం ఈ నాటి యువతపై ఉంది.

-మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

"దేవుడికి నైవేద్యం పెట్టకపోయినా

ఆయనకు కరువు రాదు

కానీ వయసు మళ్లిన అమ్మానాన్నలకు ప్రేమతో బుక్కెడు బువ్వ పెట్టాలి. వాళ్లు మనకు బరువు కాదు... మన జీవితానికి ఆధారం." ఈ మాటలో తల్లిదండ్రుల పట్ల మనకు ఉండాల్సిన ప్రేమ, కృతజ్ఞత, బాధ్యత దాగి ఉన్నాయి. దేవుడికి సమర్పించే నైవేద్యం మన భక్తికి ప్రతీక. అదే విధంగా, ఆకలితో ఉన్న తల్లిదండ్రులకు ప్రేమతో భోజనం పెట్టడం మన మానవత్వానికి ప్రతీక. మన భక్తి మన ప్రవర్తనలో కూడా కనిపించాలి. ఇంట్లో ఉన్న అమ్మానాన్నల అవసరాలను గుర్తించి, వారి మనసుకు సంతోషం కలిగించడం కూడా దైవసేవగా భావించవచ్చు. మన చిన్నప్పుడు మనకు ఆకలి వేస్తే అమ్మ తన పనులన్నీ పక్కనపెట్టి అన్నం తినిపించింది. మనం అనారోగ్యంతో ఉంటే నాన్న తన బాధలను మరిచి మన ఆరోగ్యం కోసం ఆరాటపడ్డాడు. మన చదువు కోసం, మన భవిష్యత్తు కోసం వారు ఎన్నో కోరికలను వదులుకుని ఉండవచ్చు. మనం ఎదగడానికి తమ సమయాన్ని, శ్రమను, ప్రేమను పంచిన వారి సేవలను గుర్తుంచుకోవడమే కృతజ్ఞత. వయసు పెరిగినప్పుడు శరీరబలం తగ్గవచ్చు. ఒకప్పుడు కుటుంబమంతటికీ అండగా నిలిచిన చేతులకు ఇప్పుడు కొంత సహాయం అవసరం కావచ్చు. ఆ సమయంలో వారిని భారంగా చూడటం వారి మనసును గాయపరుస్తుంది. మన చిన్ననాటి బలహీనతను వారు ప్రేమతో కాపాడారు. వారి వృద్ధాప్యాన్ని మనం గౌరవంతో ఆదరించాలి. ఇక్కడ "బుక్కెడు బువ్వ పెట్టు" అనే మాటకు చాలా విస్తృతమైన అర్థం ఉంది. సమయానికి భోజనం అందించడం, ఆరోగ్య అవసరాలను పట్టించుకోవడం, ప్రశాంతంగా విశ్రాంతి తీసుకునే అవకాశం కల్పించడం, అవసరమైనప్పుడు తోడుగా ఉండటం---ఇవన్నీ అందులో భాగమే. వారి ఆకలిని గుర్తించినట్లే, వారి ఒంటరితనాన్ని కూడా గుర్తించాలి. కొన్నిసార్లు అమ్మా నాన్నలకు మన దగ్గర నుంచి కావాల్సింది పెద్ద బహుమతులు కావు. "అమ్మా, భోజనం చేశావా?", "నాన్నా, ఎలా ఉన్నావు?", "ఏమైనా కావాలా?" అని ఆప్యాయంగా అడిగే మాటలు చాలు. వారి పక్కన కూర్చొని మాట్లాడటం, వారు చెప్పేది ఓపికగా వినడం, వారి జ్ఞాపకాలను పంచుకోవడం వారికి ఎంతో సంతోషాన్ని ఇస్తాయి. వారిని చూసుకోవడంలో గౌరవం కూడా ఉండాలి. కుటుంబ విషయాల్లో వారి అభిప్రాయాన్ని అడగాలి. వారి ఇష్టాలను తెలుసుకోవాలి. వారికి చేతనైన పనులను స్వతంత్రంగా చేసుకునే అవకాశం ఇవ్వాలి. సహాయం చేస్తున్నామనే పేరుతో వారి మాటకు విలువ లేకుండా చేయకూడదు. "మీరు మా కుటుంబంలో ముఖ్యమైనవారు" అనే భావన వారికి మన ప్రవర్తన ద్వారా కలగాలి. ఉద్యోగం, వ్యాపారం, కుటుంబ బాధ్యతలతో మనం ఎంత బిజీగా ఉన్నా, తల్లిదండ్రుల కోసం కొంత సమయం కేటాయించాలి. దూరంగా ఉంటే తరచూ మాట్లాడాలి; వారి అవసరాలు ఎలా తీరుతున్నాయో తెలుసుకోవాలి. తోబుట్టువులు ఉంటే బాధ్యతలను పంచుకోవాలి. ప్రేమతో, పరస్పర సహకారంతో చేసే సంరక్షణ వారికి భరోసాను ఇస్తుంది. "కనిపించే దైవాలు తల్లిదండ్రులు" అని చెప్పడంలో ఉద్దేశం---వారి ప్రేమను, త్యాగాన్ని, మన జీవితంలో వారి స్థానాన్ని గుర్తించడం. మనం ఈ ప్రపంచాన్ని చూడటానికి, తొలి అడుగులు వేయటానికి, జీవితాన్ని నేర్చుకోవటానికి మొదటి తోడు వారే. అందుకే వారికి ఇచ్చే గౌరవంలో మన సంస్కారం కనిపిస్తుంది. అమ్మానాన్నలు మనతో ఉన్నప్పుడే ప్రేమను మాటల్లోనూ, చేతల్లోనూ చూపాలి. వారి ఆకలికి అన్నం పెట్టాలి... వారి బాధకు ఓదార్పు ఇవ్వాలి... వారి వృద్ధాప్యానికి అండగా నిలవాలి. వాళ్లు మనకు బరువు కాదు-మన జీవితాన్ని నిలబెట్టిన మూలాలు. ఆ మూలాలను ప్రేమతో కాపాడుకోవడం మన బాధ్యత.

-మీ నక్క యాదగిరి

భారత సాహిత్యాన్ని ప్రపంచానికి

చాటి చెప్పిన రచయిత ఆర్కే నారాయణ్

సాహిత్యం ద్వారా భారత దేశాన్ని బయటి ప్రపంచానికి పరిచయం చేసిన వారిలో నారాయణ్ ఒకడు. భారత దేశ ఆంగ్ల తొలి తర సాహిత్య రంగానికి చెందిన ముగ్గురు గొప్ప ఇంగ్లీషు రచయిత లలో ఆయన ఒకడు. ముల్క్ రాజ్ ఆనంద్, మరియు రాజారావులు మిగిలిన ఇద్దరు. గురువు, మిత్రుడైన గ్రహం గ్రీన్ సహాయంతో నారాయణ్ వెలుగులోకి వచ్చాడు. ఆయన రాసిన మొదటి నాలుగు పుస్తకాలను ప్రచురించ డానికి ప్రచురణ కర్తలను ఒప్పించడంలో గ్రహం గ్రీన్ ముఖ్యపాత్ర పోషించాడు. ఆయన మొదటి రచన "డెవెలప్మెంట్ అఫ్ మారిటైం లాస్ అఫ్ 17త్ సెంచరీ ఇంగ్లాండ్" అనే పుస్తక పరిచయం. 1951 సంవత్సరపు అత్యుత్తమ అసలైన నవలగా పేరొందిన "ది ఫైనాన్షియల్ ఎక్స్పర్ట్", "సాహిత్య అకాడెమీ పురస్కారం" గెలిచిన "ది గైడ్" నారాయణ్ రాసిన ఇతర నవల లలో కొన్ని. ది గైడ్ నవల హిందీ, ఇంగ్లీషులలో సినిమాగా తీయబడింది. ఆర్.కే. నారాయణ్‌గా పిలువబడే రాశిపురం కృష్ణస్వామి అయ్యర్ నారాయణస్వామి (1906 అక్టోబరు 10 – 2001 మే 13)న ఆర్.కే. నారాయణ్ మద్రాస్ (ప్రస్తుత చెన్నై) లో జన్మించాడు. ఆయన తండ్రి ఒక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు. నారాయణ్ అదే పాఠశాలలో కొన్నాళ్ళు చదివాడు. ఉద్యోగరీత్యా తండ్రి తరచూ బదిలీ అవుతూ ఉండడంతో, నారాయణ్ తన బాల్యంలో కొన్నాళ్ళు అమ్మమ్మ పార్వతి వద్ద పెరిగాడు. అమ్మమ్మ పార్వతి... నారాయణ్‌కు గణితం, పురాణాలు, భారతీయ శాస్త్రీయ సంగీతం, సంస్కృతం నేర్పించింది. ఆయన తమ్ముడు ఆర్.కె.లక్ష్మణ్ ప్రకారం, కుటుంబ సభ్యులు అందరు సాధారణంగా ఇంగ్లీషు లోనే సంభాషించే వారు. నారాయణ్, ఆయన తోబుట్టువులు ఏదైనా వ్యాకరణ తప్పులు చేస్తే, కుటుంబ సభ్యులు సహించేవారు కాదు.

బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయ పండుగ

రంగురంగుల పూలు, గౌరమ్మ పూజ, జానపద పాటలు, మహిళల ఆటపాటలు కలిసిన ఈ వేడుక తెలంగాణ సంస్కృతికి ప్రతీక. ప్రకృతిని గౌరవించడం, కుటుంబ శ్రేయస్సును కోరుకోవడం, అందరూ కలిసి ఆనందాన్ని పంచుకోవడం ఇందులోని ప్రధాన భావాలు. మీరు పేర్కొన్న తేదీలు సరైనవే. 2026 అక్టోబర్ 10, శనివారం ఎంగిలిపూల బతుకమ్మతో వేడుకలు ప్రారంభమై, అక్టోబర్ 18, ఆదివారం సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి. తొమ్మిది రోజుల ఈ పండుగలో ప్రతి రోజుకూ ప్రత్యేకమైన పేరు, సంప్రదాయం ఉంటాయి. మహాలయ అమావాస్యను తెలంగాణలో పెతరమావాస్య అని కూడా పిలుస్తారు. ఈ రోజున జరుపుకునే ఎంగిలిపూల బతుకమ్మ పండుగకు తొలి అడుగు. ఇంటిని శుభ్రం చేసుకోవడం, పూలను సేకరించడం, బతుకమ్మను పేర్చడం, గౌరమ్మను పూజించడం ద్వారా సంబురాలకు శ్రీకారం చుడతారు. తొలి రోజు నువ్వులు, బియ్యంపిండితో తయారుచేసిన నైవేద్యాన్ని సమర్పించడం ప్రధాన సంప్రదాయం. వర్షాకాలం చివర్లో ప్రకృతిలో విరబూసే తంగెడు, గునుగు, బంతి, చామంతి వంటి పూలకు బతుకమ్మలో ప్రత్యేక స్థానం ఉంది. ఒక్కో పువ్వు ఒక్కో రంగుతో మెరిసినట్లే, వాటిని వరుసలుగా పేర్చిన బతుకమ్మ తెలంగాణ నేల అందాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ పండుగలో భూమి, నీరు, మనిషి మధ్య ఉన్న అనుబంధం కనిపిస్తుంది. పూలను కింద విశాలంగా, పైకి వెళ్లే కొద్దీ చిన్నగా పేర్చి బతుకమ్మను తీర్చిదిద్దుతారు. పైభాగంలో పసుపుతో చేసిన గౌరమ్మను ఉంచుతారు. కుటుంబానికి క్షేమం, సుఖసంతోషాలు కలగాలని ప్రార్థిస్తూ పూజిస్తారు. "బతుకమ్మ" అనే పేరులో అమ్మవారిని బతుకును కాపాడే తల్లిగా ఆరాధించే భావన ఉంది. సాయంత్రం మహిళలు, చిన్నారులు బతుక మ్మల చుట్టూ వలయంగా చేరి, లయబద్ధంగా చప్పట్లు కొడు తూ పాటలు పాడతారు. ఒకరు పాటను ప్రారంభిస్తే మిగతా వారు గొంతు కలుపుతారు. ఈ సామూహిక సంబురమే బతుకమ్మకు ప్రత్యేకమైన అందాన్ని తెస్తుంది. తొమ్మిది రోజుల పేర్లు, సాధారణంగా సమర్పించే నైవేద్యాలు ఇలా ఉంటాయి. నైవే ద్యాల తయారీలో ప్రాంతం, కుటుంబ సంప్రదాయాన్ని బట్టి స్వల్ప భేదాలు ఉండవచ్చు. బతుకమ్మ పేరు సాధారణ నైవేద్యం / ఆచారం అక్టోబర్ 10 : ఎంగిలిపూల బతుకమ్మ నువ్వులు, బియ్యంపిండి లేదా నూకలతో నైవేద్యం

అక్టోబర్ 11: అటుకుల బతుకమ్మ అటుకులు, ఉడికించిన పప్పు, బెల్లం.. అక్టోబర్ 12: ముద్దపప్పు బతుకమ్మ ముద్దపప్పు, పాలు, బెల్లం.. అక్టోబర్ 13: నానబియ్యం బతుకమ్మ
నానబెట్టిన బియ్యం, పాలు, బెల్లం
అక్టోబర్ 14: అట్ల బతుకమ్మ అట్లు
అక్టోబర్ 15: అలిగిన బతుకమ్మ సంప్రదాయంగా ఆటపాటలకు విరామం; ప్రత్యేక నైవేద్యం ఉండదు అక్టోబర్ 16: వేపకాయల బతుకమ్మ వేపకాయ ఆకారంలో బియ్యంపిండితో చేసిన వేయించిన వంటకం అక్టోబర్ 17: వెన్నముద్దల బతుకమ్మ వెన్న లేదా నెయ్యి, నువ్వులు, బెల్లం అక్టోబర్ 18 : సద్దుల బతుకమ్మ : పులిహోర, పెరుగన్నం, నువ్వుల అన్నం, కొబ్బరి అన్నం వంటి సద్దులు చివరి రోజు సద్దుల బతుకమ్మను పెద్ద బతుకమ్మ అని కూడా పిలుస్తారు. అందంగా పేర్చిన బతుకమ్మలను తీసుకువెళ్లి, సామూహికంగా పాటలు పాడి, ఆటలు ఆడిన తర్వాత నీటిలో నిమజ్జనం చేస్తారు. ఈ రోజు వివిధ రకాల అన్నపు నైవేద్యాలను తయారుచేసి సమర్పించడం ప్రత్యేకత.

-మీ నక్క యాదగిరి

ఓటర్ల జాబితాలో కాదు..

ఎన్నికల సంఘంలోనే ప్రక్షాళన జరగాలి

ప్రజాస్వామ్యానికి ఊపిరైన ఎన్నికల్లో వ్యవస్థలో ఓటు హక్కు ప్రజలకు తిరుగులేని బ్రహ్మాస్త్రం. ఎన్నికల్లో ఎవరు గెలిచారు, ఎవరు ఓడిపోయారనే విషయం కన్నా ఓటర్ల జాబితాలో పేరు ఉందా? ఎన్నికల రోజు ఓటరు తమ హక్కును వినియోగించే అవకాశం ఉందా అన్నదే ప్రజాస్వామ్యానికి అసలు సిసలైన పరీక్ష. ఓటర్ల జాబితా ప్రక్షాళన పేరుతో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) గందరగోళంతో ఇప్పుడు అర్హులైన ఓటరు తమ ఓటును నిలబెట్టుకోవడానికి నానా తిప్పలు పడాల్సి వస్తోంది. ఓటర్ల జాబితాను సవరించడం భారత ఎన్నికల సంఘం బాధ్యతే అయినా ఆ ప్రక్రియలో ఒక్క అర్హుడైన ఓటరు కూడా అన్యాయం జరగకుండా చూడటం అంతకంటే ముఖ్యమైన బాధ్యత. అయితే దురదృష్టవశాత్తు ఇప్పుడు దేశవ్యాప్తంగా కోట్లాది మంది పేర్లు ఓటర్ల డ్రాఫ్ట్ జాబితాల్లో కనిపించకపోవడం, అర్హులైన వారి పేర్లు కూడా మాయమయ్యాయనే ఆరోపణలు రావడంతో ఎస్ఐఆర్ ప్రక్రియపై, ఎన్నికల సంఘం అధికారులపై సాధారణ పౌరులకు అనుమానాలొస్తు న్నాయి. ప్రజల పక్షాన బాధ్యతగల కాంగ్రెస్ పార్టీ ఈ గందరగోళానికి కారకులైన ఎన్నికల సంఘాన్ని ప్రశిస్తుంటే 'దొంగ ఎవరంటే భుజాలు తడుము కున్నట్టు' అధికార బీజేపీ వ్యవహరిస్తున్న తీరును చూస్తుంటే అసలైన ఓట్ చోరీ దొంగలెవరో స్పష్టమవుతోంది. నరేంద్ర మోదీ హయంలో దేశ వ్యాప్తంగా ఓట్ చోరీ జరుగుతుండడంతో బలం లేని చోట్ల కూడా బీజేపీ గెలుస్తుందని కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ పలు రుజువులతో ఇప్పటికే చాలా సార్లు నిరూపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారులపై ఒత్తిడి తెచ్చి స్వతంత్ర ప్రతిపత్తి గల భారత ఎన్నికల సంఘాన్ని భ్రష్టు పట్టించిందని కాంగ్రెస్ ఎప్పటి నుంచో వ్యక్తం చేస్తున్న అనుమానాలు ఇప్పుడు సాక్ష్యాలతో సహా రుజువయ్యాయి. 2023లో కొత్త నిబంధనలతో ప్రధాన ఎన్నికల అధికారి నియామకం ప్రక్రియతోనే మోదీ ప్రభుత్వం అక్రమాలకు తెరలేపింది. ఇప్పుడు అదే సీఈసీ

జ్ఞానేశ్వర్ కుమార్ తన స్వామి భక్తిని నిరూపించు కుంటూ ఎస్ఐఆర్ రూపంలో బీజేపీకి సహకరిస్తు న్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో సీఈసీతో పలు అంశాలపై మిగతా ఇద్దరు కమిషనర్లు విభేదించిన ఆయన తీసుకున్న ఏకపక్ష నిర్ణయాలు ఇప్పుడు అర్హులైన ఓటర్లకు గుదిబండగా మారాయి. ఎస్ఐఆర్ ఓటర నమోదు, తొలగింపుకు సంబంధించి ఫారాలు 6.7,8 ప్రక్రియలపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నా దీనిపై స్పష్టత ఇవ్వాల్సిన ప్రభుత్వం, ఇందుకు బాధ్యత వహించి పదవి నుండి తప్పుకో వాల్సిన సీఈసీ బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తు న్నారు. దేశవ్యాప్తంగా 13 కోట్ల మందికి పైగా పేర్లు ఓటరు జాబితాల్లో కనిపించలేదనే సమాచారం ఆందోళన కలిగిస్తోంది. ఇందులో మరణించినవారు, డూప్లికేట్ నమోదులు, శాశ్వతంగా వలస వెళ్లినవారు ఉండటం సహజమే. కానీ చిరునామా మారడం, తాత్కాలికంగా అందుబాటులో లేకపోవడం, పేర్లు లేదా వయస్సులో స్వల్ప తేడాలుండటం, తల్లిదండ్రుల వివరాల్లో మార్పులు, పాత ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ కాకపోవడం వంటి కారణాలతో అర్హులైన వారిని తొలగిస్తున్నారు. ఇప్పటికే పలు ఎన్నికల్లో ఓటు వేసిన వ్యక్తి మరోసారి తన అర్హతను నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఎందుకు రావాలన్నదే ఇప్పుడు ప్రశ్న, అంతేకాదు వాళ్ల తాత ముత్తాతల ఓట్లతో నిరూపిం చుకోవాలనడం సరైంది కాదు. జనాభా పెరుగుతున్నప్పుడు ఓట్లు కూడా పెరగడమన్నది నిజం కానీ ఎన్నికల కమిషన్ ఓట్లను తగ్గించడం ఎంతవరకు సమంజసమో ఒకసారి ఆలోచించాలి. 2002 నాటి ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ చేయాలన్న నిబంధన ఇబ్బందిగా మారుతోంది. ఒక తరం నుంచి మరో తరానికి చిరునామాలు మారడం, కుటుంబాలు విడిపోవడం, పట్టణాలకు వలసలు పెరగడం సాధారణమైన నేటి పరిస్థితుల్లో దశాబ్దాల క్రితం ఉన్న రికార్డులను ఆధారంగా చేసుకుని ప్రస్తుత ఓటరు అర్హతను నిర్ధారించడం ఎంతవరకు సమంజసం. ఈ అశాస్త్రీయమైన నిబంధనలను తమకు అనుకూలంగా మల్చుకుంటూ బీజేపీ తమకు వ్యతిరేకమైన సామాజిక వర్గాలను లక్ష్యంగా చేసుకొని ఓట్లను తొలగిస్తోంది. ఎస్ఆర్ఐ ప్రక్రియ ముగిసిన అనంతరం జరిగిన బీహార్, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అక్రమ గెలుపే ఇందుకు తార్కాణం. గోవాలో వెలుగుచూసిన ఒక సంఘటన ఎస్ఐఆర్లోని సాంకేతిక లోపాలను బయటపెట్టింది. ఎస్ఐఆర్లో భాగంగా తొలుత 97 మంది పేర్లు తొలగించగా, విచారణ తర్వాత వారు అర్హులైన ఓటర్లేనని తేలింది. వారిని తిరిగి జాబితాలో చేర్చే సమయంలో సాఫ్ట్వేర్లో రోల్బ్యాక్ సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయని వెల్లడైంది. ఒక తప్పు నిర్ణయం తీసుకున్న తర్వాత దాన్ని సరిచేసే వ్యవస్థ కూడా సులభంగా పనిచేయకపోతే, ఓటర్ల హక్కుల విషయంలో సాంకేతిక ప్రక్రియలపై పూర్తిగా ఆధారపడటం ఎంత ప్రమాదకరమో ఈ ఉదంతం సూచిస్తోంది. పశ్చిమ బెంగాల్ లో ఓట్లు తొలగించడంపై ట్రిబ్యునల్కు వెళ్లిన 22 లక్షల మందిలో, సెప్టెంబరు 10 నాటికి 1.22 లక్షల మందిపై దర్యాప్తు పూర్తయితే 1.14 లక్షల మంది అర్హులైన ఓటర్లే అని తేలింది. ఎన్నికల్లో నిరాకరించబడిన వారి 'ఓటు వినియోగ హక్కును' ఎవరు వెనక్కి తెచ్చిస్తారనే ధర్మసందేహమే. తెలంగాణ పరిస్థితి కూడా అంతే ఆందోళన కలిగిస్తోంది. ఎస్ఐఆర్కు ముందు రాష్ట్రంలో 3,38,26,448 మంది ఓటర్లు ఉండగా, 2,64,87,213 మంది ఎన్యుమరేషన్ ఫారమ్లు సమర్పించారు. మరో 73,39,235 మంది పేర్లు వివిధ కారణాలతో డ్రాఫ్ట్లో కనిపించలేదు. ఇందులో మరణించినవారు, అందుబాటులో లేనివారు, వలస వెళ్లినవారు, డూప్లికేట్ నమోదులు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. అదే సమయంలో మరో 92,87,577 మంది వివరాల్లో లోపాలు లేదా మ్యాపింగ్ సమస్యలు గుర్తించి నోటీసులు ఇచ్చారు. మొత్తం మీద ప్రస్తుతమున్న సమాచారం ప్రకారం రాష్ట్రంలో సుమారు 70 లక్షల ఓట్లు తగ్గే అవకాశాలుండడంతో తమ హక్కును హరిస్తున్నారే ఆవేదన అర్హులైన. ఓటర్లలో కనిపిస్తోంది. కాంగ్రెస్ చెబుతున్నట్టే రాష్ట్రంలో ఫారం 7 ద్వారా ప్రత్యేకంగా ఉద్దేశించిన ఓట్లను తొలగిస్తున్నారని హైదరాబాద్లో సాక్ష్యాలతో సహా నిరూపితమైంది. ఎస్ఐఆర్పై కాంగ్రెస్ చాలాకాలంగా అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. ఎన్నికల వ్యవస్థపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గతంలోనే పలు సాక్ష్యాలు చూపించారు. ఇప్పుడు ఎన్నికల సంఘంలోని కమిషనర్లు సుక్బీర్ సింగ్ సందూ, వివేక్ జోషి కూడా ఎస్ఐఆర్ ప్రక్రియతో పాటు సీఈసీ జ్ఞానేశ్ కుమార్పై సందేహాలు వ్యక్తం చేయడం కాంగ్రెస్ వాదనకు బలం చేకూరింది. ఓటర్ల జాబితాలో కాదు ఎన్నికల సంఘంలోనే ప్రక్షాళన జరగాల్సిన అవసరాన్ని గుర్తించిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే మార్గదర్శకత్వంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ నేతృత్వంలో సీఈసీ రాజీనామాతో పాటు ప్రధాని మోదీ, హెం మంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని డిమాండ్ తో నిరసనలు చేపడుతుంటే కేంద్ర ప్రభుత్వం అణిచివేయాలని చూస్తోంది. సీఈసీకి వ్యతిరేకంగా తెలంగాణలో కూడా కాంగ్రెస్ భారీ ఆందోళనలు నిర్వహిస్తోంది. ప్రజాస్వామ్యంలో ఎన్నికల సంఘంపై నమ్మకమే ఎన్నికల వ్యవస్థకు పునాది. గెలుపోటములు ఎలా ఉన్నా ఓటు హక్కుపై ప్రజలకు ఉన్న విశ్వాసం మాత్రం దెబ్బతినకూడదు. ఎస్ఐఆర్ లక్ష్యం నిజమైన ఓటర్ల జాబితాను రూపొందించడమే అయితే దానిపై ఎవరికీ అభ్యంతరం ఉండదు. అయితే ఆ ప్రక్రియలో నిజమైన ఓటరు పేరు తొలగిపోతే మాత్రం ప్రజాస్వామ్యానికే నష్టం జరుగుతుంది. అందుకే ఎస్ఐఆర్పై వస్తున్న అనుమానాలకు రాజకీయ ఆరోపణలతో కాకుండా పూర్తి పారదర్శకతతో, గణాంకాలతో, నమ్మదగిన చర్యలతో ఎన్నికల సంఘమే సమాధానం చెప్పాలి. ఎందుకంటే ఓటరు జాబితాలో ఒక పేరు తప్పిపోవడం కేవలం ఒక నమోదు పొరపాటు కాదు.. దీంతో ఒక పౌరుడి ప్రజాస్వామ్య హక్కును కోల్పోయే ప్రమాదం ఉంది. చివరగా గుమ్మడికాయల దొంగ ఎవరంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భుజాలు తడుము కుంటుంది. ఎన్నికల కమిషన్ అవినీతి అక్రమాలకు పాల్పడుతుందని విపక్షాలు, ప్రజలు ఆరోపిస్తు నప్పుడు తగు విచారణ జరిపి చర్యలు తీసుకుం టామని చెప్పాల్సిన కేంద్ర ప్రభుత్వం అందుకు విరుద్ధం గా ఈసీని వెనకేసుకు రావ డంతో బీజేపీ ఈసీ అక్రమ సంబంధాన్ని అంగీకరి స్తున్నట్టే.

-రాచమల్ల సిద్ధేశ్వర్
కాంగ్రెస్ సీనియర్ నాయకులు

యోగా సాధనకు స్థలం కేటాయించాలని కొలన్ హన్మంత్ రెడ్డికి వినతి

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) అక్టోబర్ 10: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని శనివారం నిజాంపేట్‌కు చెందిన పతంజలి యోగా టీమ్ వెల్నెస్ అసోసియేషన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి, యోగా సాధన, ధ్యానం నిర్వహించేందుకు అనువైన స్థలం కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. గత ఎనిమిదేళ్లుగా నిజాంపేట్‌లో యోగా, ధ్యానం, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ప్రస్తుతం ఎండ, వర్షం, వాహనాల కాలుష్యం, రోడ్డు భద్రత వంటి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అసోసియేషన్ సభ్యులు వివరించారు. యోగా సాధనకు అనువైన స్థలం కల్పించి తమకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, పతంజలి యోగా టీమ్ వెల్నెస్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

2027 జనవరి 10 నుంచి జరిగే జనగణనను ఓబీసీలు బహిష్కరించాలి

- ఓబీసీలను లెక్కించకుండా మోసం చేస్తున్న బిజెపి ప్రభుత్వం
- ఓబీసీలను లెక్కించకుండా జనగణన చేస్తే బిజెపికి పుట్టగతులు ఉండవు
- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ హెచ్చరిక

న్యూఢిల్లీ వెలుతురు అక్టోబర్ 10: ఓబీసీలను లెక్కించకుండా జనగణన చేయడం చాలా సిగ్గుచేటని జనాభాలో సగానికి పైగా ఉన్న ఓబీసీలను లెక్కించకపోతే బిజెపి పార్టీకి పుట్టగతులు ఉండవని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ హెచ్చరించారు. 2027 జనవరి 10 నుంచి జరిగే జనగణన రెండో దశను ఓబీసీలంతా బహిష్కరించాలని లింగంగౌడ్ పిలుపునిచ్చారు. ఇప్పటికే ఓబీసీల జనాభా లెక్కల వివరాలు లేకపోవడం వల్ల ఓబీసీలకు రావలసిన వాటా దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓబీసీలకు న్యాయపరంగా దక్కాల్సిన వాటా దక్కాలంటే కచ్చితంగా కులగణన అవసరమని అన్నారు. కులగణన జరిగితేనే విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ల పెంపుదలకు ఎలాంటి ఆటంకాలు ఉండవన్నారు.

జీడిమెట్ల డిపో TGS RTC ఎన్నికల్లో అధ్యక్షుడిగా విజయం సాధించిన జాలిగం రాకేష్‌ని అభినందించిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) అక్టోబర్ 10: జీడిమెట్ల డిపో TGS RTC ఎన్నికల్లో అధ్యక్షుడిగా విజయం సాధించిన బీఆర్ఎస్ నాయకులు జాలిగం రాకేష్ మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శ్రీ శంభీపూర్ రాజు ని శంభీపూర్‌లోని కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జీడిమెట్ల డిపో TGS RTC ఎన్నికల్లో అధ్యక్షుడిగా విజయం సాధించిన జాలిగం రాకేష్ ని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు గారు మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, కార్మికులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వారి పక్షాన నిలబడి, వారి హక్కుల పరిరక్షణకు అండగా ఉండాలని సూచించారు. కార్మికుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ బాధ్యతాయుతంగా పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, తాజా మాజీ కౌన్సిలర్లు విష్ణువర్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సురేందర్ రెడ్డి, ధర్మ రెడ్డి, వెంకట్ రెడ్డి, పెప్సీ రాజు, సుదర్శన్, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రజెండాపై నమ్మకమే ఆర్టీసీలో గెలుపు

సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఉమామహేష్

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) అక్టోబర్ 10: రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీలో జరిగిన ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ అనుబంధ సంఘం ఏఐటీయూసీ బలపరిచిన ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6000 పైచిలుకు ఓట్లతో ఘన విజయం సాధించడం వెనకాల ప్రజలు మరియు కార్మికులు ఎర్రజెండాపై ఉన్న నమ్మకం సూచిస్తుందని రాబోవు రోజుల్లో కూడా ప్రజలు ఎర్రజెండా వైపే చూస్తున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ జీడిమెట్ల డిపోలో జరిగిన విజయోత్సవ సభలో పేర్కొన్నారు. మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి జీడిమెట్ల, కూకట్పల్లి ,ఉప్పల్, చెంగిచెర్ల,కుషాయిగూడ డిపోలలో సిపిఐ బలపరిచిన ఎంప్లాయిస్ యూనియన్ బస్సు గుర్తు అత్యధిక మెజారిటీతో గెలిచిందని రేవంత్ రెడ్డి ప్రభుత్వం కార్మికులకు ఎన్ని ప్రలోభాల గురి చేసినప్పటికీ కార్మికులు ఎంప్లాయిస్ యూనియన్ ద్వారానే ఆర్టీసీ పరిరక్షణ అని అనుకోవడం వల్లే నేడు భారీ మెజార్టీతో గెలిచిందని ఇది నీతికి నిజాయితీకి మరియు అధికారం డబ్బు అహంకారానికి మధ్య జరిగిన పోరాటంగా కార్మికులు భావించారని ఇదే విజయం రాబోయే ఎన్నికల్లో కూడా కనిపిస్తుందని అన్నారు. పూర్తిగా తీసుకొని భారత కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐ బలపరిచిన నాయకులను గెలిపించాల్సిందిగా కోరారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినంతవరకు ఎంప్లాయిస్ యూనియన్ మరియు జెఏసి చేసే అన్ని పోరాటాల్లో సిపిఐ కలిసి వస్తుందని ఆర్టీసీ కార్మికులకు ఎల్లవేళలా సిపిఐ తోడ్పాటు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జీడిమెట్ల డిపో యూనియన్ కార్యదర్శి డేనియల్ అధ్యక్షులు పాషా ఆధ్వర్యంలో నిర్వహించిన విజయోత్సవ సభలో సిపిఐ మండల కార్యదర్శి స్వామి సహాయ కార్యదర్శి హరినాథ్ రావు, రాములు, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి శ్రీనివాస్,నాయకులు నరసింహ రెడ్డి, ప్రజెంట్ మండల అధ్యక్షులు బాబు, మహేందర్, బి ఎల్ నారాయణ ,బాలయ్య రాజేష్, కయ్యుం, భాస్కర్, శేఖర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరు బాలాజీ ఆలయంలో విద్యార్థులకు ఉచితంగా పెన్నుల పంపిణీ

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 10: విద్యార్థులను ప్రోత్సహించేందుకు చిలుకూరు బాలాజీ ఆలయంలో మంచి సేవా కార్యక్రమం కొనసాగుతోంది. ఆలయానికి వచ్చే విద్యార్థులకు మాత్రమే ఉచితంగా పెన్నులు పంపిణీ చేస్తున్నారు. భక్తులు స్వచ్ఛందంగా సమర్పించే పెన్నులను సేకరించి విద్యార్థులకు అందజేస్తున్నారు. చదువుపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు విద్యార్థులకు ఉపయోగపడేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆలయానికి ఎప్పుడు వచ్చినా విద్యార్థులకు ఉచితంగా పెన్నులు అందించడం ఈ కార్యక్రమం ప్రత్యేకత. విద్యార్థుల భవిష్యత్తుకు తోడ్పడే ఈ సేవా కార్యక్రమం పలువురి ప్రశంసలు అందుకుంటోంది.

ఆరుట్ల శ్రీశ్రీశ్రీ కంఠమహేశ్వర దేవాలయంలో శివస్వాముల గురుస్వామి లొంగరి యాదగిరి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

ఈ అమావాస్య రోజు అన్నదాన ప్రభువు సుంకరి శ్రీనివాస్ గౌడ్ (ఉపాధ్యాయుడు)

మంచాల వెలుతురు అక్టోబర్10: మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో అమావాస్య సందర్భంగా శ్రీశ్రీశ్రీ కంఠమహేశ్వర దేవాల యంలో అన్నదాన కార్యక్రమం అన్నదాన ప్రభువు సుంకరి శ్రీనివాస్ గౌడ్ ఉపాధ్యాయుడు ముం దుగా గౌడ సంఘం అధ్యక్షుడు తంగడపల్లి నరేందర్ గౌడ్ అయ్యప్పస్వాముల గురుస్వామికావ లి శ్రీనివాస్ ముదిరాజ్ శివస్వాముల గురుస్వామి లొంగరి యాదగిరితో కలిసి కంఠమహేశ్వర స్వామికి శివలింగానికి ప్రత్యేకపూజలు చేసిన అన్నదాన ప్రభువు సుంకరి శ్రీనివస్ గౌడ్ వారి కు టుంబ సభ్యులు శరత్ చంద్ర గౌడ్ దంపతులు అనంతరం భక్తులకు అన్నదాన ప్రసాదం ప్రారం భించారు ఈసందర్భంగా గౌడ సంఘం అధ్యక్షుడు తంగడిపల్లి నరేందర్ గౌడ్ శివస్వాములగు రుస్వామి లొంగరి యాదగిరి మాట్లాడుతూ ప్రతి అమావాస్యకు ప్రతి సోమవారం కంఠమహేశ్వ ర దేవాలయంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందిఅన్నారు ఈకా ర్యక్ర మంలో శ్రీ మహాలక్ష్మిసిండికేట్ గ్రూప్ అధ్యక్షుడు అంతటి రాజుగౌడ్ వైయస్సార్ మాధగోని జంగ య్యగౌడ్ పల్లె శ్రీనివాస్ గౌడ్ మాడపాకుల యాదగిరి పాండాల బుగ్గ రాములుగౌడ్ దూసరి రమే ష్ గౌడ్ రమేష్ నాయక్ తాళ్ళప్రభాకర్ గౌడ్ దూసరి రాజుగౌడ్ మాడపాకుల శేఖర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

కూకట్‌పల్లి హనుమాన్ చౌక్‌లో అంగరంగ వైభవంగా బతుకమ్మ వేడుకలు..

కూకట్ పల్లి: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు కూకట్‌పల్లి హనుమాన్ చౌక్‌లో బతుకమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేశారు. పండుగ వాతావరణంతో హనుమాన్ చౌక్ కళకళలాడింది. అనంతరం మహిళలు బతుకమ్మలను రంగదాముని చెరువులో నిమజ్జనం చేశారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తుందని పలువురు పేర్కొన్నారు. ఈ వేడుకలు మహిళల్లో ఆనందోత్సాహాలను నింపడంతో పాటు, తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పాయి. బతుకమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో మహిళలు, యువతులు, స్థానికులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

దుర్గంధంతో విద్యార్థినులకు, డబుల్ బెడ్ రూమ్ వాసులకు ఇబ్బంది మారిన డంపింగ్ యార్డ్‌ను వెంటనే తరలించాలి

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) అక్టోబర్ 10: సీఎంసీ నిజాంపేట్ సర్కిల్ లోని నిజాంపేట్ డబుల్ బెడ్ రూమ్ సముదాయాల సమీపంలో సుమారు 4 ఎకరాల్లో సువిశాల 42 గదులతో అన్నీ రకాల వసతులతో నూతనంగా నిర్మిస్తున్న తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాల పనులను, అక్కడి వసతులను బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ క్షేత్ర స్థాయిలో అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నూతన కళాశాలకు ఆనుకొని డంపింగ్ యార్డ్ ఉండడంవల్ల ఇక్కడ విద్యను అభ్యసించే విద్యార్థినులు తీవ్ర చెత్త దుర్గంధంతో ఇబ్బంది పడతున్నారని, వెంటనే ఇక్కడి నుంచి డంపింగ్ యార్డు తరలించాలని కళాశాల ప్రిన్సిపాల్ మరియు సిబ్బంది ఎమ్మెల్యే ని కోరగా....ఎమ్మెల్యే ఉన్నతాధికారులతో ఫోన్ లో మాట్లాడి విద్యార్థినుల చదువుకు, డబుల్ బెడ్ రూమ్ వాసుల సముదాయాలకు దుర్వాసనతో ఇబ్బంది కరంగా మారిన ఈ డంపింగ్ యార్డ్ ను వెంటనే ఇక్కడ నుంచి తరలించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈ డబ్ల్యుఎస్ డీఈఈ సంధ్యా రాణి, ఏఈ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇష్రత్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి. స్రవంతి, డిగ్రీ లెక్చరర్లు బి. నూతన, సుచరిత, సీఎంసీ నిజాంపేట్ సర్కిల్ శానిటేషన్ అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అపోలో మెడికల్ కాలేజ్ గ్రాడ్యుయేషన్ డే

వైద్య విద్యార్థులకు పట్టాలు ప్రదానం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 10 : అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ఆధ్వర్యంలో యూజీ, పీజీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ వేడుకలు జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ భవనం వెంకట్రామ్ ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ కార్డియాలజిస్ట్, కేర్ హాస్పిటల్స్ వ్యవస్థాపకులు, సింధు హాస్పిటల్స్ కార్డియాలజీ కన్సల్టెంట్ & మెంటార్ డైరెక్టర్ పద్మశ్రీ డాక్టర్ బీ సోమరాజు విద్యార్థులకు డిగ్రీ పట్టాలు, బంగారు పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ ప్రతాప్ సీ రెడ్డి భారతదేశంలో ప్రైవేట్ ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. అత్యాధునిక వైద్య సేవలను దేశంలో అందుబాటులోకి తెచ్చారన్నారు. ఆ తర్వాత వచ్చిన అనేక సంస్థలకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. మన ప్రగతిలో ఎక్కువ భాగం ఆయన దార్శనికతక ఉందన్నారు. నా విజయ రహస్యం మనకంటే ప్రతిభావంతులైన వ్యక్తులతో మెలగడమన్నారు. వైద్య వృత్తిలో మహిళలు మునుపెన్నడూ లేనంతగా ముందంజ వేస్తున్న తరుణంలో వృత్తిపరమైన బాధ్యతలను కుటుంబ జీవితంతో సమన్వయం చేసుకోవడానికి బలమైన నిర్వహణ నైపుణ్యాలు అవసరమన్నారు. మాతృత్వ అనుభవం తాదాత్మ్యం, నాయకత్వం, మనుషులను నడిపించే సామర్థ్యాన్ని కూడా పెంపొందిస్తుందని తెలిపారు. 1950 నాటి 'హారిసన్స్ ప్రిన్సిపల్స్ ఆఫ్ ఇంటర్నల్ మెడిసిన్' మొదటి ఎడిషన్ అందించిన జ్ఞానం అద్భుతమన్నారు. ఒక వైద్యుడికి సాంకేతిక నైపుణ్యం, శాస్త్రీయ పరిజ్ఞానం, మానవీయ దృక్పథం అనే లక్షణాలు అవసరమన్నారు. నేడు సాంకేతికత, కృత్రిమ మేధ పరిజ్ఞానాన్ని మరింత సులభతరం చేసి, సాంకేతిక నైపుణ్యాల అభ్యాసాన్ని వేగవంతం చేశాయన్నారు. కానీ మానవీయ దృక్పథానికి ఏదీ సాటిరాదన్నారు. మనం కేవలం వ్యాధిని మాత్రమే కాదు, దాని వెనుక ఉన్న మనిషిని, వారి పరిస్థితులను, భయాలను, ఆత్మగౌరవాన్ని అవసరాలను గుర్తించాలన్నారు. వైద్యం అనేది ఒక విశేష అవకాశం అన్నారు. బాధ్యత, కర్తవ్యం. ధైర్యం, వినయం, వివేకంతో వైద్యం చేయాలన్నారు. తప్పులను అంగీకరించేందుకు రెండో అభిప్రాయం తీసుకునేందుకు ధైర్యం, అనిశ్చితిని ఒప్పుకునే వినయం, ఏం చేయగలమో? మాత్రమే కాక ఏం చేయాలో కూడా తెలుసుకునే వివేకం కలిగి ఉండాలన్నారు. ఆరోగ్య సంరక్షణ అనేది ప్రతి రోగికీ, ఆసుపత్రి బృందంలోని ప్రతి సభ్యుడికీ గౌరవం, సంరక్షణ లభించేలా, కరుణతో, సమానత్వంతో కూడినదిగా ఉండాలన్నారు. రోగితో సంభాషణ మీ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతుందన్నారు. ప్రతి విజయం మీ వినయాన్ని, ప్రతి క్లిష్టత మీ నిజాయితీని, ప్రతి నిస్సహాయ రోగి మీ కరుణను పరీక్షిస్తారన్నారు. 'నిరంతరం నేర్చుకోండి, ఒక బృందంగా పని చేయండి, రోగులకే ప్రథమ ప్రాధాన్యత ఇవ్వండి, 'నేను దేని కోసం గుర్తుండిపోవాలి?' అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి' అని అన్నారు.

రంజోల్ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

- తెలంగాణ సంస్కృతి, ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ...
- రంజోల్ ప్రధానోపాధ్యాయుడు జగదీష్వరయ్య...

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 10: బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ విద్యార్థినులు ఆలపించిన పాటలతో ఎంపీపీఎస్ రంజోల్ పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెందోట జగదీష్వరయ్య ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఉత్సాహంగా ఆడిపాడారు. ఈ సందర్భంగా హెచ్ఎం జగదీష్వరయ్య మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. బతుకమ్మ పండుగ వెనుక ప్రకృతితో ముడిపడిన అనేక విశేషాలు ఉన్నాయని విద్యార్థులకు వివరించారు. వర్షాకాలంలో చెరువులు, బావుల్లో నీరు చేరినప్పుడు వాటి పరిశుభ్రతను కాపాడుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. పూల ప్రాధాన్యత, ప్రకృతి పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శకుంతల, స్వప్న జ్యోతి (బాబా నగర్), షహిస్త రూహి, సబిహ బేగం, వీణ కుమారి, మంజుల, అఖిల్ అహ్మద్, సయ్యద్ హాఫిజ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'మనం' పత్రికలో తప్పుడు కథనం.. డబ్బుల కోసం బెదిరింపులు

- "అతనో దళిత సర్పంచ్.. చదివింది మూడో తరగతే" అంటూ నిరాధార వార్త
- డబ్బులివ్వకపోతే మరిన్ని కథనాలు రాస్తామని బ్లాక్‌మెయిలింగ్
- 'మనం' పత్రిక ప్రతినిధిపై జడ్చర్ల ఠాణాలో ఫిర్యాదు చేసిన బాధితుడు



జడ్చర్ల, వెలుతురు అక్టోబర్ 10: గ్రామ పంచాయతీ పాలన, అభివృద్ధి పనులను అడ్డం పెట్టుకుని 'మనం' దినపత్రిక ప్రతినిధి నిరాధార కథనాలు రాస్తూ బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతున్నాడని ఆరోపిస్తూ ఓ బాధితుడు శనివారం జడ్చర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. 'మనం' పత్రికలో "అతనో దళిత సర్పంచ్.. చదివింది మూడో తరగతే.. ఇదే పెట్టుబడిగా మార్చుకున్న బాబాయి–అబ్బాయి? చేయని పనికి రూ. 1.33 లక్షల బిల్లులు?" అనే శీర్షికతో వాస్తవాలకు విరుద్ధంగా, తప్పుడు ఉద్దేశాలతో అసత్య కథనాన్ని ప్రచురించారని బాధితుడు పేర్కొన్నారు. అంతటితో ఆగకుండా, అడిగినంత డబ్బులు ఇవ్వకపోతే పరువు తీసేలా మరిన్ని వార్తలు రాస్తామంటూ సదరు పత్రిక ప్రతినిధి ఫోన్లలో బెదిరింపులకు దిగుతున్నట్లు బాధితుడు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు.

ఫోన్ చేసి డబ్బుల డిమాండ్.. లేదంటే వరుస కథనాలంటూ బెదిరింపులు

బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగం, గ్రామంలో జరిగిన భూముల విక్రయాల వ్యవహారాలను ముడిపెడుతూ 'మనం' పత్రిక ప్రతినిధి ఫోన్ చేసి తీవ్రస్థాయిలో డబ్బులు డిమాండ్ చేశారు. అడిగిన మొత్తం ముట్టజెప్పకపోతే సమాజంలో తలెత్తుకోకుండా వరుస కథనాలు రాసి పరువు తీస్తామని బెదిరించారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. నిరాధార ఆరోపణలతో కుటుంబ పరువుకు భంగం కలిగేలా వ్యవహరిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు.

కాల్ డేటా ఆధారాలతో పోలీసులకు ఫిర్యాదు

పంచాయతీ పాలనపై బురదజల్లుతూ, పత్రిక ముసుగులో డబ్బుల కోసం బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతున్నమ

చౌటుప్పల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ కమిటీ ప్రకటన

చౌటుప్పల్ వెలుతురు అక్టోబర్ 10: మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారి సిఫారస్ మేరకు చౌటుప్పల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పూర్తి కమిటీని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య ఆమోదించి ప్రకటించడం జరిగింది.

చౌటుప్పల్ మున్సిపాలిటీ నూతన కార్యవర్గ సమావేశం

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ నూతన కార్యవర్గ సమావేశం మున్సిపాలిటీ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన అధ్యక్షులు కాసర్ల శ్రీనివాసరెడ్డి, జనరల్ సెక్రెటరీలు, ఇప్ప వెంకటేష్, ఎర్రగుని లింగస్వామి, ఉపాధ్యక్షులు అంతటి విజయలక్ష్మి బాలరాజు, బండమీది మల్లేష్, సయ్యద్ వాయుద్దీన్, చెరుకు లింగస్వామి వర్కాల వెంకట్ కుమార్, , స్పోక్ పర్సన్ సామకూర యాదయ్య, సెక్రెటరీలు గుండెబోయిన మనిత ఐలయ్య యాదవ్, ఓసు శ్రీజా రాజు, మమ్మద్ ఫిరోజ్, మట్టుపల్లి యాదగిరి, మాదాని గోపాల్, దోమటి దయాకర్ రెడ్డి, బత్తుల రాజు, జక్కర్తి సుధా, పేరుపల్లి సుమతి, పాల్గొన్నారు.

ఎన్నికల సంఘంపై బురదజల్లడం మానుకోవాలి.. ఆధారాలతో మాట్లాడాలి

రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు తుమ్మల మురళీధర్ రెడ్డి

మోత్కూర్, అక్టోబర్ 10,వెలుతురు న్యూస్ : ఎన్నికల సంఘం విశ్వసనీయతను దెబ్బతీసేలా కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలు రాజకీయ ప్రయోజనాల కోసమేనని బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు తుమ్మల మురళీధర్ రెడ్డి విమర్శించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (్రా×=) ప్రక్రియను తప్పుగా చిత్రీకరిస్తూ ప్రజల్లో అపోహలు సృష్టించడం కాంగ్రెస్ పార్టీకి తగదని ఆయన హెచ్చరించారు.ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను అర్థం చేసుకోకుండా కోట్లాది ఓట్లు తొలగించారంటూ ఆరోపణలు చేయడం బాధ్యతారాహిత్యమని పేర్కొన్నారు. గైర్హాజరైన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలిపోయిన వారు, మరణించిన వారు, ఒకటికంటే ఎక్కువసార్లు నమోదైన పేర్లు వంటి అంశాలను పరిశీలించడం ఓటర్ల జాబితా ప్రక్షాళనలో భాగమని వివరించారు. అయితే, ఓటర్ల జాబితా నుంచి పేరు తొలగించడానికి ముందు సంబంధిత నిబంధనలు, అర్హతలు, అభ్యంతరాల ప్రక్రియను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఎన్నికల వ్యవస్థపై ఆరోపణలు చేసే ముందు కాంగ్రెస్ పార్టీ తన వాదనలకు తగిన ఆధారాలు చూపాలని మురళీధర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం నిర్ణయాలపై అభ్యంతరాలుంటే చట్టబద్ధమైన మార్గాల్లో పరిష్కారం కోరాలే తప్ప, రాజకీయ ఆందోళనలతో సంస్థల ప్రతిష్ఠను దిగజార్చే ప్రయత్నం చేయకూడదని హితవు పలికారు.ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై కాంగ్రెస్ పార్టీ గతంలోనూ అనేక అనుమానాలు వ్యక్తం చేసిందని, అయితే ఎన్నికల ఫలితాలు రాష్ట్రానికో విధంగా వస్తున్నప్పుడు తనకు అనుకూలమైన ఫలితాలను అంగీకరించి, ప్రతికూల ఫలితాలపై అనుమానాలు వ్యక్తం చేయడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఎన్నికల ప్రక్రియపై ప్రశ్నలు లేవనెత్తే ప్రతి రాజకీయ పార్టీ తన ఆరోపణలకు ఆధారాలు చూపాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుంటే, కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక చర్చకు బదులుగా రాజకీయ ఆరోపణలకే ప్రాధాన్యత ఇస్తోందని ఆయన విమర్శించారు. దేశ ప్రతిష్ఠ, ప్రజాస్వామ్య వ్యవస్థల గౌరవం విషయంలో అన్ని రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.తెలుగు మీడియా సంస్థలకు విజ్ఞప్తి చేస్తూ, రాజకీయ పార్టీల ఆరోపణలను యథాతథంగా ప్రచారం చేయడంతోపాటు, వాటి వెనుక ఉన్న వాస్తవాలను, ఎన్నికల సంఘం అధికారిక వివరాలను కూడా ప్రజలకు తెలియజేయాలని కోరారు. ప్రజల్లో ఆందోళన కలిగించే వార్తలకంటే వాస్తవాల ఆధారంగా ప్రజలకు సమాచారం అందించడం మీడియా బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మోత్కూర్ మండల పార్టీ అధ్యక్షులు గుదే మధుసూదన్ యాదవ్, జిల్లా నాయకులు నాగం సత్తిరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు ఆళ్ల శివప్రసాద్, ముక్కామల గణేష్, నాయకులు అజయ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గుండాల మండలంలో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు

- గ్రామగ్రామాన పండుగ సందడి..
- బతుకమ్మలతో మహిళల కోలాహలం

గుండాల, అక్టోబర్ 10 (వెలుతురు): యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలను మహిళలు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. గ్రామాల్లోని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయబద్ధంగా బతుకమ్మ పండుగను జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. బతుకమ్మ పండుగ ప్రారంభాన్ని సూచించే ఎంగిలిపూల బతుకమ్మతో తొమ్మిది రోజుల పండుగ సందడి మొదలైంది. ప్రకృతిలో లభించే వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, వాటి చుట్టూ చేరి మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. గ్రామాల్లోని మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, పూలతో అలంకరించిన బతుకమ్మలను తీసుకువచ్చి ఒకచోట చేరి సామూహికంగా బతుకమ్మ ఆడారు. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే జానపద పాటలు, ఆటపాటలతో గ్రామాల్లో సందడి నెలకొంది. మహిళలు కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని ప్రార్థించారు.

గ్రామాల్లో ఐకమత్యాన్ని పెంపొందించడంతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని మహిళలు పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న ఈ పండుగను ప్రతి ఒక్కరూ సంప్రదాయబద్ధంగా జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు.ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన ఈ వేడుకలు రానున్న రోజుల్లో మరింత ఉత్సాహంగా కొనసాగనున్నాయి. గుండాల మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనడంతో పండుగ సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు. వార్డు సభ్యులు. మహిళలు. గ్రామస్తులు. ఉత్సాహంగా పాల్గొన్నారు

డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తాం: మేయర్ కొలగాని శ్రీనివాస్

- డంపింగ్ యార్డును తనిఖీ చేసి పరిశీలన
- డంపు యార్డులో చెలరేగుతున్న మంటలు, పొగలను అదుపు చేయించిన మేయర్.
- స్వచ్ భారత్ మిషన్ రూ.17 కోట్లతో బయోమైనింగ్, యూసిఎఫ్

రూ.80 కోట్లతో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్

కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 10: దశాబ్దాలుగా పేరుకు పోయిన డంపింగ్ యార్డు చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి లో భాగంగా శనివారం పలువురు కార్పోరేటర్లు, అధికార సిబ్బంది తో కలిసి డంపింగ్ యార్డును సందర్శించి... క్షేత్ర స్థాయిలో పరిస్థితులను తనిఖీ చేసి పరిశీలించారు. డంపింగ్ యార్డులో చెలరేగుతున్న మంటలను, పొగను అదుపు చేసేందుకు స్థానికంగా ఉండి అధికారులు సిబ్బంది తో తక్షణ చర్యలు చేపట్టారు. మున్సిపల్ వాటర్ ట్యాంకర్లకు మోటార్ ప్రెషర్ పంపులను అమర్చి... చెలరేగుతున్న మంటలను అదుపు చేయించారు. పూర్తి స్థాయిలో మంటలు, పొగలు ఆర్పేందుకు సిబ్బందిని బృందాలుగా నియమించి... సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించి... మంటలు ఆర్పేందుకు సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సంధర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ.... కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నాయకత్వంలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని తెలిపారు. గత 40 నుంచి 50 ఏళ్లుగా డంపింగ్ యార్డులో 5 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా చెత్త పేరుకుపోయిందని...దీంతో చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు పొగ, దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా డంపు యార్డు సమస్యకు ముగింపు పలకడమే తమ పాలకవర్గం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సహాకారం తో స్వచ్ఛభారత్ మిషన్ కింద ?రూ. 17 కోట్లతో బయోమైనింగ్ పనులు చేసేందుకు టెండర్ ప్రక్రియ పూర్తి చేశామన్నారు. త్వరలోనే బయోమైనింగ్ ప్రక్రియకు సంబంధించి 4 యంత్రాలను ఏర్పాటు చేసి పనులు ప్రారంభం చేస్తామని స్పష్టం చేశారు. 6 నుండి 7 నెలల వ్యవధిలోనే దాదాపు 2 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను బయోమైనింగ్ ద్వారా వేగవంత చేస్తామన్నారు. కొత్తగా వచ్చే చెత్త ద్వారా గతంలోనే స్మార్ట్ సిటీలో ప్రారంభం చేసిన బయోమైనింగ్ ప్రక్రియ ఆలస్యం అవుతుందని తెలిపారు. అంతే కాకుండా బండి సంజయ్ కుమార్ గారి సహాకారంతో మరో 20 కోట్లు తెచ్చేందుకు చర్యలు తీస్కుంటూ...ప్రణాళిక ప్రకారం తమ పాలకవర్గం ముందుకు సాగుతుందని తెలిపారు. బండి సంజయ్ కుమార్ చొరవ ద్వారా కరీంనగర్ ను అర్బన్ చాలెంజ్ ఫండ్ స్కింలో చేర్చి... 840 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అందులో డంపింగ్ యార్డు సమస్య శాశ్వత పరిష్కారం కు సాలిడ్ వేస్టు మేనేజ్మెంట్ కింద రూ. 80 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న చెత్తను ప్రక్షాళన చేయడంతో పాటు కొత్తగా రోజు వచ్చే చెత్తను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహణ చేపట్టేలా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో చెత్త గుట్టలుగా పేరుకు పోకుండ... ఏడాదిన్నర కాల వ్యవధి లో డంపింగ్ యార్డు కు శాశ్వత పరిష్కారం చేసేలా తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ సహకారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిధులు సమకూర్చి, ఏడాది వ్యవధిలో డంపింగ్ యార్డ్ సమస్యకు ముగింపు పలుకుతామని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటానికి, నగరంలో పారిశుధ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు మెరుగు పరుస్తుంది... తమ పాలకవర్గం ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. చుట్టు ప్రక్కల ప్రజల దీర్ఘకాల సమస్యను శాశ్వతంగా పరిష్కారం చేయడంలో మా పాలకవర్గం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు మాసం గణేష్, పిపిఏ చంద్ర, తోట అనిల్, మేకల వెంకటేష్లి, శెట్టి వసంత లక్ష్మీ భూమయ్య, నాయకులు బండారి గాయత్రి, వెంకట్ రెడ్డి, మొండయ్య తదితరులు పాల్గొన్నారు.

అనాజిపురంలో మేకల దొంగతనానికి యత్నం

మేకలు అరవడంతో బయటకు వచ్చిన కుటుంబ సభ్యులు

మోత్కూర్, అక్టోబర్ 10,వెలుతురు న్యూస్ : యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం అనాజిపురం గ్రామంలో మేకలను దొంగిలించేందుకు వచ్చిన దుండగులు, కుటుంబ సభ్యులు అప్రమత్తం కావడంతో చెప్పులు అక్కడే వదిలేసి పరారైన ఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం. గ్రామానికి చెందిన నోముల మల్లేష్ ఇంటి వద్ద మేకల కోసం దుండగులు వచ్చినట్లు తెలుస్తోంది. మేకలు గట్టిగా అరవడంతో మల్లేష్, ఆయన తల్లి ఐలమ్మ బయటకు వచ్చారు. ఆ సమయంలో గడ్డివాము వద్ద దాచుకున్న దుండగునీ ఐలమ్మ గమనించారు. దీంతో ఆమె భయభ్రాంతులకు గురై గట్టిగా కేకలు వేయడంతో దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. పారిపోయే క్రమంలో దుండగులు తమ చెప్పులను అక్కడే వదిలేసినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనతో గ్రామస్థులు అప్రమత్తమ య్యారు. రాత్రివేళల్లో గుర్తుతెలియని వ్యక్తుల సంచారంపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు నిఘా పెంచాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మోత్కూరులో ఘనంగా బతుకమ్మ వేడుకలు

మోత్కూరు,అక్టోబర్ 10,వెలుతురు న్యూస్ ; తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతికగా నిలిచే ఎంగిలి పువ్వు బతుకమ్మ పండుగను పురస్కరించుకొని శనివారం మోత్కూరు మున్సిపల్ కేంద్రంతోపాటు మండలంలో అన్ని గ్రామాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు,యువతులు, చిన్నారులు సాంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ ఆటపాటలతో మున్సిపల్ కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో సందడిగా చేశారు. రంగురంగు పూల బతుకమ్మలతో పాఠశాల, వ్యవసాయ మార్కెట్ లో పండుగ శోభను సంతరించుకుంది. ఈ వేడుకలకు స్థానిక ఎస్. ఐ. సతీష్ కుమార్ ఆధ్వర్యంలో తన సిబ్బందితో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీగా బందోబస్తు నిర్వహించారు.

కేసీఆర్‌కు కృతజ్ఞతగా సూర్యాపేటలో 2కే రన్

సూర్యాపేట జిల్లాను ఏర్పాటు చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని చాటిచెప్పేలా బీఆర్ఎస్ శ్రేణులు జిల్లా కేంద్రంలో దశాబ్ది ఉత్సవాలు నిర్వహించాయి. జిల్లా ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భంగా సద్దల చెరువు నుంచి కొత్త బస్టాండ్ వరకు 2కే రన్ చేపట్టారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువత ఉత్సాహంగా పాల్గొని కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గాదరి కిశోర్ కుమార్, బొల్లం మల్లయ్య యాదవ్, జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ దీపికా యుగంధర్ రావు, హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఒంటెద్దు నరసింహారెడ్డి, రాష్ట్ర నాయకులు వై. వెంకటేశ్వర్లు, నంద్యాల దయాకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సూర్యాపేటతో పాటు తుంగతుర్తి, హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలిరావడంతో కార్యక్రమం సందడిగా సాగింది. జిల్లా ఆవిర్భావంలో కేసీఆర్ పాత్రను గుర్తుచేస్తూ పార్టీ శ్రేణులు దశాబ్ది వేడుకల్లో పాల్గొన్నాయి.

అట్టహాసంగా బతుకమ్మ సంబరాలు ప్రారంభం

రవీంద్రభారతి: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు రవీంద్రభారతిలో శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలకు వందలాది మంది మహిళలు తరలివచ్చారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆడిపాడారు. మహిళల ఆటపాటలతో రవీంద్రభారతి ప్రాంగణం సందడిగా మారింది. బతుకమ్మ పాటలతో పరిసరాలు మార్మోగాయి. ఈ ప్రారంభ వేడుకలకు మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు ఆడబిడ్డలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతి ప్రసాదించిన పూలను దేవతగా కొలిచే అపురూపమైన పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల సామూహిక జీవన విధానానికి, కష్టసుఖాలను కలిసి పంచుకునే ఐక్యతా భావానికి ఈ పండుగ నిదర్శనమని అన్నారు. రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలని, ప్రతి ఒక్కరూ ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని మంత్రులు ఆకాంక్షించారు. తెలంగాణ సుభిక్షంగా వర్ధిల్లాలని, మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడంతోపాటు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

నల్గొండ జిల్లాలో భారీ చోరీల ముఠా గుట్టురట్టు

దేవరకొండ : నల్గొండ జిల్లాలో వరుస పగటిపూట దొంగతనాలకు పాల్పడుతూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్న నలుగురు సభ్యుల అంతర్ జిల్లా దొంగల ముఠాను మర్రిగూడ, చింతపల్లి పోలీసులు శనివారం సంయుక్తంగా అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ. 21.05 లక్షల విలువైన 11 తులాల బంగారం, 1.5 కిలోల వెండి, రెండు మోటార్ సైకిళ్లు, 5 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు దేవరకొండ డీఎస్పీ ఎం. వి. శ్రీనివాసరావు వెల్లడించారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు నాంపల్లి సర్కిల్ పరిధిలో శనివారం ఉదయం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించడంతో ఈ భారీ ముఠా ఉదంతం వెలుగుచూసింది. పోలీసుల విచారణలో నిందితులు వనపర్తికి చెందిన బొల్లేమోని అంజి అలియాస్ స్వామి (29), హైదరాబాద్‌కు చెందిన పూజారోల్లా శివకుమార్ అలియాస్ శివయప్ప (23), కొత్తకోటకు చెందిన సంపంగి రాజు అలియాస్ రాము (30), మహబూబ్‌నగర్‌కు చెందిన గోపి అరుణ్ కుమార్ (23)గా గుర్తించారు. ప్రధాన నిందితుడు అంజి గతంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో పలు దొంగతనాలకు పాల్పడి జైలుకు వెళ్లాడు. అక్కడ మిగిలిన ముగ్గురితో పరిచయం పెంచుకుని, జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత అందరూ కలిసి ముఠాగా ఏర్పడ్డారు. విలాసవంతమైన జీవితం గడపడం, అప్పులు తీర్చుకోవడం కోసమే వీరు దొంగతనాల బాట పట్టినట్లు విచారణలో తేలింది.

ఈ ముఠా నల్గొండ జిల్లాలోని మర్రిగూడ, చింతపల్లి, గుర్రంపోడు, దేవరకొండ, కనగల్, నకిరేకల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని పగటిపూట 9 చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారు. ఆస్తి సంబంధిత నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉంటూ ఇళ్లకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ సూచించారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన మర్రిగూడ, చింతపల్లి సబ్ ఇన్‌స్పెక్టర్లు బి. రాంబాబు, ఎం. రామ్మూర్తి, పోలీసు సిబ్బందిని డీఎస్పీ శ్రీనివాసరావు రివార్డులతో ప్రత్యేకంగా అభినందించారు.

రూ.70కోట్లతో పోలేపల్లి గ్రామంలో అభివృద్ధి పనులు: మంత్రి పొంగులేటి

ఖమ్మం రూరల్ మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా రూ. 4.65 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న రెండు నూతన బీటీ రోడ్ల నిర్మాణ పనులకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. ఇందులో రూ. 2.42 కోట్ల అంచనా వ్యయంతో పోలేపల్లి నుంచి దానవాయిగూడెం(వయా మున్నేరు) వరకు, రూ. 2.20 కోట్ల అంచనా వ్యయంతో పోలేపల్లి నుంచి రామునిపేట వరకు బీటీ రోడ్ల నిర్మాణాలు ఉన్నాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. సన్న బియ్యం పంపిణీ, ఉచిత విద్యుత్(200 యూనిట్లు), ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు వంటి అనేక కార్యక్రమాలు విజయవంతంగా అందిస్తున్నామన్నారు. పోలేపల్లి ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రాబోయే కొద్ది రోజుల్లోనే నూతన రేషన్ డీలర్‌ను ఏర్పాటు చేస్తామని మంత్రి అన్నారు. అర్హులైన ప్రతి పేదవానికి విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు. ప్రభుత్వ స్కూల్ లో స్థల సమస్య ఉన్నందున, సమీపంలో అనువైన ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి పిల్లలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నూతన స్కూల్ భవనాన్ని నిర్మిస్తామని మంత్రి తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాల అమలుకు కట్టుబడి ఉన్నామని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, హౌసింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, పిఆర్ ఈఈ మహేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో బతుకమ్మ పండుగ సంబరాలలో పాల్గొన్న భారతీయ జనతా పార్టీ చౌటుప్పల మున్సిపల్ అధ్యక్షులు కడారి కల్పన ఐలయ్య యాదవ్

చౌటుప్పల్ వెలుతురు అక్టోబర్ 10: మొదటిరోజు ఎంగిలిపూల బతుకమ్మ పండగ పురస్కరించుకొని ఈరోజు చౌటుప్పల మున్సిపాలిటీ మూడవ వార్డులో బతుకమ్మ సంబరాలలో పాల్గొన్న భారతీయ జనతా పార్టీ మున్సిపల్ అధ్యక్షులు కడారి కల్పన ఐలయ్య యాదవ్ మహిళా మణులతో బతుకమ్మ ఆడుతూ వారిలో ఉత్సాహం నింపి బతుకమ్మ సంబరాలలో పాల్గొన్నారు తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబి ంచేలా బతుకమ్మ పండగ ఉందని కొనియాడారు ఈ యొక్క కార్యక్రమంలో మహిళా సోదరీ మణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

సిద్దాపూర్ రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి : జగ్గారెడ్డి

సదాశివపేట: సదాశివపేట పట్టణంలోని సిద్దాపూర్ రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అధికారులను ఆదేశించారు. మాజీ టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి తో కలిసి సిద్దాపూర్ రోడ్డును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్, మున్సిపల్ శాఖల అధికారులతో రోడ్డు నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ, వర్షపు నీటి పారుదల, కల్వర్టుల ఏర్పాటు పై సమీక్ష నిర్వహించారు. మెయిన్ రోడ్డు నుంచి సిద్దాపూర్ కాలనీ చివరి వరకు పలుమార్లు పనులు చేపట్టిన సమస్య పరిష్కారం కాకపోవడంపై జగ్గారెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. 2004లో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సిద్దాపూర్ రోడ్డు నిర్మాణం చేపట్టించానని గుర్తుచేశారు. గత పదేళ్లలో ఈ రోడ్డు సమస్య ఎందుకు పరిష్కారం కాలేదో అర్థం కావడం లేదన్నారు.

ఇకపై ప్రజలు రోడ్డు సమస్యపై పదేపదే ఇబ్బందులు ఎదుర్కోకుండా శాశ్వత ప్రణాళికతో పనులు చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. మెయిన్ రోడ్డు నుంచి సిద్దాపూర్ ఈద్గా వరకు సుమారు 1.5 కిలోమీటర్ల మేర పూర్తిస్థాయిలో సీసీ రోడ్డు నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. డిగ్రీ కళాశాల నుంచి మెయిన్ రోడ్డు జంక్షన్ వరకు సాంకేతికంగా సరైన లెవల్స్ తీసుకొని, వర్షపు నీరు, మురుగు నీరు సక్రమంగా వెళ్లేలా నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించారు. రోడ్డు ప్రారంభం నుంచి చివరి వరకు ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా అవసరమైన చోట్ల డ్రైన్లు, కల్వర్టులు నిర్మించాలని తెలిపారు.

చిరు వ్యాపారులకు ఇబ్బందులు కలిగించొద్దు

సిద్దాపూర్ రోడ్డు విస్తరణలో భాగంగా ఎలాంటి కూల్చివేతలు చేపట్టకుండా ప్రణాళిక రూపొందించాలని జగ్గారెడ్డి సూచించారు. అందుబాటులో ఉన్న స్థలాన్ని టేపుతో కొలిచి పరిశీలించిన ఆయన, 30 అడుగుల వెడల్పు ఉన్నచోట 30 అడుగులు, 40 అడుగుల స్థలం ఉన్నచోట 40 అడుగులు, 60 అడుగుల స్థలం అందుబాటులో ఉన్నచోట 60 అడుగుల మేర రోడ్డు నిర్మించాలని అధికారులకు వివరించారు. తనకు తెలియజేయకుండా రోడ్డుపై ఉన్న ఏ డబ్బానూ తొలగించవద్దని స్పష్టం చేశారు. రోడ్డు నిర్మాణం కారణంగా పాన్‌షాపులు, పూల దుకాణాలు, మటన్, చికెన్ దుకాణాలతో పాటు ఇతర చిరు వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టాలని సూచించారు. ప్రజల రాకపోకలకు ఆటంకం లేకుండా, వ్యాపారాలు దెబ్బతినకుండా అందుబాటులో ఉన్న స్థలాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని అధికారులకు తెలిపారు.

సిద్దాపూర్ కూడలిలో ప్రజలకు, వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా జంక్షన్‌ను అభివృద్ధి చేయాలని జగ్గారెడ్డి సూచించారు. మధ్యలో విగ్రహం ఏర్పాటు చేసేందుకు అనువుగా సర్కిల్‌ను రూపొందించాలని తెలిపారు. రోడ్డు నిర్మాణానికి అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తరలించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో కల్వర్టుల నిర్మాణానికి జగ్గారెడ్డి, నిర్మల స్వయంగా పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.

కోహిర్ మండల కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడిగా శ్రీనివాస్

ఉపాధ్యక్షుడిగా మిన్హాజ్ నియామకం

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 10:
కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ విభాగాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో కోహిర్ మండల నూతన సేవాదళ్ కమిటీని నియమించారు. సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు కర్ణం సందీప్ ఆదేశాల మేరకు జిల్లా ఉపాధ్యక్షుడు అయిదాల నర్సింలు నియామక ఉత్తర్వులు జారీ చేసి, నూతన బాధ్యులకు నియామక పత్రాలు అందజేశారు. కోహిర్ మండల సేవాదళ్ అధ్యక్షుడిగా మనియార్‌పల్లి గ్రామానికి చెందిన పూర్ర శ్రీనివాస్‌ను, ఉపాధ్యక్షుడిగా సజ్జాపూర్ గ్రామానికి చెందిన దూదేకుల మిన్హాజ్‌ను నియమించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం ఆదేశాలు, జిల్లా సేవాదళ్ విభాగం సూచనల మేరకు మండలంలో పార్టీ కార్యక్రమాలను వేగవంతం చేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షుడు కర్ణం సందీప్, జిల్లా ఉపాధ్యక్షుడు అయిదాల నర్సింలుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి బీజేపీ నేత పరామర్శ

జహీరాబాద్ వెలుతురు, అక్టోబర్ 10:
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం న్యాల్కల్ మండలం గంగ్వార్ గ్రామానికి చెందిన ఏడో వార్డు సభ్యుడు జాన్ వెస్లీని బీజేపీ న్యాల్కల్ మండల అధ్యక్షుడు మల్లేష్ గంగ్వార్ శనివారం పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో జాన్ వెస్లీ ఎడమ కాలు విరగడంతో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మల్లేష్ గంగ్వార్ ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాన్ వెస్లీ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ధైర్యంగా ఉండాలని, అవసరమైన సమయంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి ప్రజాసేవలో పాల్గొనాలని మల్లేష్ గంగ్వార్ ఆకాంక్షించారు.

కేశవపట్నంలో గాజుల నందన్ స్మారక క్రికెట్ పోటీలు ప్రారంభం

కేశవపట్నం వెలుతురు అక్టోబర్ 10:
ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గాజుల నందన్ (చోటు) స్మారక క్రికెట్ పోటీలను కేశవపట్నం ఉపసర్పంచ్ ఆకుబత్తిని విజయ్ కుమార్ ప్రారంభించారు. పోటీల నిర్వాహకులు గాజుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తొలుత గాజుల నందన్ చిత్రప టానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి క్రికెట్ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా యువత క్రీడల్లో చురుకుగా పాల్గొనాలని, క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐక్యత, స్నేహభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. గాజుల నందన్ జ్ఞాపకార్థం స్మారక క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్, సింగిల్ విండో చైర్మన్ చైర్మన్ కీసరి సంపత్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి తిరుపతి,మాజీ ఎంపీటీసీలు,వార్డు సభ్యులు, గ్రామ ప్రముఖులు, ఆదర్శ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఉనికి కోసం బీఆర్ఎస్ రాజకీయ డ్రామాలు..

- ప్రజా విశ్వాసం కోల్పోయిన పార్టీ.... ఎక్స్పైరీ , ఔట్ డేటెడ్ పార్టీ బిఆర్ఎస్ ...
- మీడియా సమావేశంలో బీజేపీ కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్ ...

కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 10:
కరీంనగర్ లో బీఆర్ఎస్ పార్టీ ఉనికి కోసమే డ్రామా రాజకీయాలు చేస్తోందని కిసాన్ నగర్ 29వ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం రోజున కరీంనగర్‌లోని ఎస్‌బీఎస్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సొంత పార్టీలో ఉన్నవారినే కొత్తగా చేరికలంటూ బీఆర్ఎస్ నేతలు ప్రజలను మోసం చేస్తున్నారని, ఇదొక పెద్ద ఫేక్ ప్రచారమని మండిపడ్డారు.
కిసాన్‌నగర్‌లో బీఆర్ఎస్‌లోకి చేరికలు జరిగినట్లు జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, సోషల్ మీడియాలో పబ్లిసిటీ కోసం తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజలను గందరగోళానికి గురిచేయడానికే ర్యాలీలు నిర్వహించి, చేరికల సమావేశాలు పెట్టడం సిగ్గుచేటన్నారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు సర్వస్వం గులాబీమయం చేసుకున్న బీఆర్ఎస్ నేతలకు, ఇప్పుడు కాషాయ రంగును చూస్తే కడుపుమంట ఎందుకని ప్రశ్నించారు. ప్రభుత్వ భవనాలు, రోడ్లు, ప్రతి చిహ్నాన్ని గులాబీ రంగుతో నింపేసినప్పుడు లేని తప్పు, ఇప్పుడు కాషాయ రంగు కనిపిస్తేనే ఎందుకు వస్తోందని నిలదీశారు. టౌన్ ప్రెసిడెంట్ చల్లా హరిశంకర్ ఆ పదవికి అనర్హుడని, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో రెండు చోట్ల పోటీ చేస్తే ప్రజలు ఆయనను తిరస్కరించారన్నారు. మేయర్ పీఠాన్ని కోల్పోయి సింగిల్ డిజిట్‌కు పరిమితమైనా చల్లా హరిశంకర్ సిగ్గులేకుండా మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. మాజీ మంత్రివర్యులు, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ మేయర్ రవీందర్ సింగ్,ఏడ్ల అశోక్, కంసాల శ్రీనివాస్ లతదితరుల ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు.కరీంనగర్ కిసాన్ నగర్ లో దళితబంధు ఇళ్ళు ప్రొసీడింగ్స్ ల పేరుతో పేదల నుంచి వేల రూపాయలు వసూలు చేశారని, అందుకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయని, దయచేసి వారందరికీ తిరిగి డబ్బులు ఇవ్వాలని కోరారు. బీసీ నాయకుల ముసుగు కప్పుకొని దొరల పార్టీ వెనుక తిరుగుతూ ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. దళిత బంధు విషయంలో బాధితులు ఇప్పటికీ న్యాయం కోసం ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చొరవ వల్లే నగరంలో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ , స్మార్ట్ సిటీ ద్వారా భారీ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని స్పష్టం చేశారు.ప్రజా విశ్వాసం కోల్పోయి అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ ఒక 'అవుట్‌డేటెడ్' పార్టీ అని, ఆ మునిగిపోయే నావలో చేరేందుకు ఎవరూ సిద్ధంగా లేరని విషయాన్ని బిఆర్ఎస్ నాయకత్వం గ్రహిస్తే మంచిదన్నారు. బిఆర్ఎస్ నేతలు చిల్లర రాజకీయాలు మానుకోవాలని, లేకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.. కరీంనగర్లో ఇక బి ఆర్ ఎస్ కు స్థానం లేదని రాబోయే రోజుల్లో కరీంనగర్ అసెంబ్లీ లో కూడా బీజేపీ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు రవీంద్ర భూపతి, మేకల వెంకటేష్, కర్రే పద్మా అనిల్, పొన్నం మండన్నా కార్యకర్తలు గాలి సురేష్, కళ్యాణ్, విష్ణు ప్రసాద్, పవన్, సాయి వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ నియోజకవర్గంలో బతుకమ్మ సంబరాలు

ఆర్మూర్ వెలుతురు అక్టోబర్ 10:
నిజామాబాదు జిల్లా బాల్కొండ నియోజక వర్గంలోని అనేక గ్రామాల్లోని ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల విద్యార్థిని విద్యార్థులు అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాల్లో భాగంగ బతుకమ్మ సంబరాలు అత్యంత వైభ వంగా, ఉత్సాహ భరితవాతా వరణం లో నిర్వ హించారు. బాల్కొండ లోని జిల్లా పరిషద్, శాశీభవి, నవీన్ విద్య నికేతన్, శ్రీ వెంకటే శ్వర,మదర్ థెరిసా ఉన్నత పాఠశాల్లోని విద్యార్థిని విద్యార్థులతో బతుకమ్మ ఆడుతూ పుర వీధుల్లో ఊరేగించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకల్లో విద్యార్థినీ, విద్యార్థులు,ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, ఉత్సా హంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రకృతిలో సహజంగా లభించే గునుగు, తంగేడు, బంతి, చామంతి తదితర రంగు రంగుల పూలను సేకరించి, అందమైన బతుకమ్మలను రూపొందించారు. సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబైన విద్యార్థినులు బతుకమ్మల చుట్టూ తిరుగుతూ జానపద గీతాలు ఆలపిస్తూ, చప్పట్లతో ఆడిన ఆటపాటలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి.
ఈ సందర్భంగా పాఠశాలాల కరెస్పాండెంట్స్ రామ లక్ష్మి సుబ్బారెడ్డి,మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఆత్మగౌరవానికి, ప్రకృతి ఆరాధనకు, సాంస్కృ తిక వైభవానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఇటువంటి పండుగల నిర్వహణ ద్వారా విద్యార్థుల్లో మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల గౌరవం పెంపొందించడంతో పాటు ప్రకృతి పరిరక్షణ, పర్యావరణ స్పృహ, సామాజిక ఐక్యత వంటి విలువలు అలవడ తాయని తెలిపారు. పూలతో ప్రకృతిని పూజించే బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థుల కు వివరించి, మన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల సంబంధిత ప్రధానోపాధ్యాయులు శ్రీ.నర్సింహా రెడ్డి, సీనియర్ హైమద్ ఉపాధ్యాయినీ, ఉపాధ్యా యులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని బతుకమ్మ సంబరాల ను విజయవంతం చేశారు. పాఠశాల ప్రాంగణ మంతా రంగురంగుల బతుకమ్మలు, జానపద గీతాలు, విద్యార్థుల ఆనందోత్సాహాలతో పండుగ శోభను సంతరించుకుంది.

మానవత్వం చాటుకున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్!

- వృద్ధుడి కుటుంబానికి బియ్యం,ఆర్థిక సహాయం
- సమ్మన్నతో మా CNR కాలనీకి 26 ఏళ్ళ అనుబంధం - చైతన్య నగర్ కాలనీ వాసులు

కేసముద్రం మున్సిపాలిటీ వెలుతురు అక్టోబర్ 10:
ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచి, మానవత్వాన్ని చాటుకున్నారు కేసముద్రం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్. కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని చైతన్య నగర్ కాలనీకి చెందిన 90 ఏళ్లకు పైబడిన వృద్ధుడు కొమ్ము సాయిలు మరణించడంతో, ఆయన00 కుటుంబాన్ని పరామర్శించి తన సానుభూతిని తెలియజేశారు. సాయిలు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకుని బియ్యంతో పాటు ఆర్థిక సహాయం అందించి, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు.

ఆపదలో అండగా 7నిలవడమే నిజమైన మానవత్వం

చైతన్య నగర్ కాలనీ వాసులు సమ్మన్న సేవలు మరువలేనివి

: కౌన్సిలర్ వల్లందాసు ఉమారవి

16వ వార్డు కౌన్సిలర్ వల్లందాసు ఉమారవి మాట్లాడుతూ "చైతన్య

నగర్ కాలనీ ప్రజలతో చిలువేరు సమ్మయ్య గౌడ్‌కు గత 26 ఏళ్లుగా మంచి అనుబంధం ఉంది. కాలనీలో ఎవరికైనా కష్టం వచ్చినప్పుడు స్పందిస్తూ, తనకు చేతనైన సహాయం అందించడం ఆయనలోని మానవత్వానికి నిదర్శనం. కొమ్ము సాయిలు కుటుంబం కష్టాల్లో ఉన్న సమయంలో బియ్యం, ఆర్థిక సహాయం అందించి అండగా నిలవడం అభినందనీయం. ప్రజలతో మమేకమై, వారి కష్టసుఖాల్లో భాగస్వాములవుతున్న సమ్మయ్య గౌడ్ సేవలు మా చైతన్య నగర్ కాలనీ వాసులు మరువలేనివి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో 16వ వార్డు కౌన్సిలర్ వల్లందాసు ఉమారవి, మాదిగ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు పోలేపాక ఉప్పలయ్య,మాజీ ఎంపీటీసీ రాహుల్,కీర్తి సురేందర్, మాసాడి శ్రీనివాస్, కత్తెరసాల శ్రీనివాస్, చిట్ల రవి, కొమ్ము వెంకన్న, పందుల సారయ్య, వల్లందాసు దేవదానం, కొమ్ము సంజీవ, పెండెల లక్ష్మణ్, కడారి నాగయ్య, కొమ్ము రామకృష్ణ, పందుల శ్రీను, జిలకర బాబు, కొమ్ము అనిల్, అజ్మీరా రమేష్, వల్లందాసు వెంకన్నతో పాటు కాలనీకి చెందిన మహిళలు, యువకులు పాల్గొన్నారు.

ప్రజా పాలన మరింత మెరుగ్గా కొనసాగాలి.!

కలెక్టర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన TUWJ జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి

సంగారెడ్డి వెలుతురు అక్టోబర్ 10:
సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆధ్వర్యంలో జిల్లాలో ప్రజా పాలన మరింత మెరుగ్గా కొనసాగాలని టి యు డబ్ల్యూ జె (ఐ జేయు) జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి ఆకాంక్షించారు. పేద బడుగు వర్గాల తో పాటు జర్నలిస్టుల ఆకాంక్షలను నెరవేర్చాలని కోరారు. TUWJ-IJU సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను జర్నలిస్టులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. క్యాంపు కార్యాలయంలో కలిసి ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుస్తకాలు, పెన్నులు అంద జేశారు. కలెక్టర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఏ అండ దండా లేని పేద ప్రజలకు పెద్దదిక్కుగా ఉండాలని కోరారు. అందుకు తగిన ఆయురారోగ్యాలను భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా జిల్లాలో జర్నలిస్టులకు తోడుగా ఉండాలని జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సహకారం అందించాలని పేర్కొన్నారు. దీనికి జిల్లా కలెక్టర్ మనస్ఫూర్తిగా స్పందించారు. జిల్లా ఉపాధ్యక్షుడు మతిన్, సీనియర్ జర్నలిస్టు మసూద్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ విల్సన్, చిన్న మధ్యతరహా పత్రికల సంఘం జిల్లా అధ్యక్షుడు సిద్ధిక్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ చవాన్, కోశాధికారి లక్ష్మణ్, ఫోటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు ఆరిఫ్, జర్నలిస్టులు సూర్య వెంకట్, దినేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ముందస్తు అంతర్జాతీయ బాలికల దినోత్సవ వేడుకలు

పాల్గొన్న జిల్లా సర్పంచ్ ల ఫోరం ఉపాధ్యక్షుడు చంద్రం కృష్ణ గౌడ్

కౌడిపల్లి వెలుతురు అక్టోబర్ 10:
కౌడిపల్లి మండల కేంద్రంలో ఈరోజు ఐసిడిఎస్ అంగన్వాడి టీచర్ల ఆధ్వర్యంలో ముందస్తు అంతర్జాతీయ బాలికల దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలో భాగంగా విద్య, క్రీడలు మరియు ఇతర రంగాలలో విశేష ప్రతిభ కనబరిచిన బాలికలను మరియు కిశోర బాలికలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా సర్పంచ్ ల ఫోరం ఉపాధ్యక్షుడు , గ్రామ సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్ మాట్లాడుతూ వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన బాలికలను గుర్తించి సన్మానించినందుకు అంగన్వాడీ టీచర్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్వేతా మల్లికార్జున్ గౌడ్, వార్డు సభ్యులు గౌడి చర్ల ప్రశాంత్, లక్ష్మీ శరత్ కుమార్, మురళి, దేవేందర్, అంగన్వాడి సూపర్ వైజర్ సంతోష, టీచర్లు ఫరీదా, కమలమ్మ,నిర్మల,నాయకులు భూమయ్య పటేల్, పుండరీకం గౌడ్, సత్యనారాయణ గౌడ్, రమేష్ గౌడ్, వడ్ల శేఖర్, పెద్ద సంఖ్యలో మహిళలు, బాలికలు పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో యువతి అదృశ్యం

- మేనమామకు 'నా కోసం వెతకకండి' అంటూ వాట్సాప్ సందేశం

వివరాలు వెల్లడించిన పట్టణ ఎస్ఐ లవ కుమార్

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 10:
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో 21 ఏళ్ల యువతి అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. జహీరాబాద్ పట్టణ ఎస్ఐ ఎన్. లవ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా నాగరం గ్రామానికి చెందిన పోతల హారిక (21) తన తల్లిదండ్రులతో గొడవపడి 15 రోజుల క్రితం జహీరాబాద్‌లోని కాంతారెడ్డి కాలనీలో నివసిస్తున్న తన మేనమామ బి. శివరాజ్ యాదవ్ ఇంటికి వచ్చింది. ఈ నెల 9వ తేదీ మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో షాపునకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన హారిక తిరిగి రాలేదు. కొద్దిసేపటి తర్వాత తన మేనమామ వాట్సాప్‌కు 'నేను వెళ్లిపోతున్నా.. నా కోసం వెతకకండి' అంటూ సందేశం పంపింది. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బంధువులు, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో మేనమామ బి. శివరాజ్ యాదవ్ జహీరాబాద్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అదృశ్యమైన సమయంలో హారిక ఎరుపు రంగు పంజాబీ డ్రెస్ ధరించి ఉందని, ఆమె ఎత్తు సుమారు 5.4 అడుగులు ఉంటుందని, యువతి ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్ఐ లవ కుమార్ కోరారు.

చిన్న సవరణ ఉన్నందున సరి చేసి పంపుతున్నాం.. మన్నించండి..

- విద్యా వ్యాపారం ఫలితంగా పెరుగుతున్న పేదరికం
- విఠపు బాలసుబ్రహ్మణ్యం మాజీ ఏమ్మెల్సీ

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 10:
తమ పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలని అది ప్రభుత్వ రంగంలో ఉన్న అరకొర వసతుల వల్ల సాధ్యం కాదని గమనించిన భారత మధ్యతరగతి వర్గం విద్య పై వ్యయం చేస్తూ, వ్యాపారమయమైన విద్య కారణంగా క్రమంగా పేదరికంలో కూరుకు పోతున్నదని ఆంధ్రప్రదేశ్ శాసన మండలి మాజీ ప్రొటెం చైర్మన్, పూర్వ శాసన మండలి సభ్యులు విఠపు బాలసుబ్రమణ్యం ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం నుంచి మూడు రోజుల పాటు హైదరాబాద్ టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహిస్తున్న స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్టీఎఫ్ఐ) దక్షిణాది రాష్ట్రాల ఉద్యమ శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు తమ పిల్లల పాఠశాల విద్యపై ప్రైవేటు రంగంలో దాదాపుగా 60 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నారు. అలాగే తమ పిల్లలు మెడిసిన్ విద్య అభ్యసించాలని, నీట్ లో ర్యాంక్ సాధించేందుకు తమ తమ పిల్లలపై పెడుతున్న ఖర్చు కేంద్ర ప్రభుత్వం విద్యకు కేటాయించిన బడ్జెట్ కంటే అధికంగా ఉన్నది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 5 తరగతులు ఉంటే ఒకరు లేదా ఇద్దరు మాత్రమే ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలు ఎన్నో ఉన్నాయి . అలాగే సకాలంలో పాఠ్యపుస్తకాలు లేక కనీసం సౌకర్యాలైన తాగునీరు లేకపోవడం అలాగే మూత్ర శాలలు లేకపోవడం లాంటి సమస్యలు ప్రభుత్వ పాఠశాలలో కనిపిస్తున్నాయి. విద్యారంగం రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్నప్పుడు ఆయా రాష్ట్రాల్లో పిల్లలకు న్యాయం జరిగేది మరీ ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో కనిపిస్తున్నది. ఈ అంశం నీట్ లో స్పష్టంగా కనిపిస్తున్నది వైద్య విద్య ప్రవేశ పరీక్ష నీట్ ప్రవేశపెట్టిన తరువాత తమిళనాడు రాష్ట్రంలో 1.6శాతం విద్యార్థులు సీట్లు పొందుతున్నారు . అదే

నీట్ రాకముందు 19.8% గా ఉండేదన్నారు.
విద్య కేంద్ర ప్రభుత్వం లోకి వెళ్లిన తర్వాత సిలబస్ ను కూడా మార్చి నేటి సమాజానికి తీవ్రమైన అన్యాయం చేస్తున్నారు. జీవ పరిణామ క్రమ సిద్ధాంతాన్ని తొలగించి మా పూర్వీకులు కూడా హోమో సిఫియన్స్ (తోకలేని కోతులను) చూడలేదు అంటు తిరోగమనంగా వాదిస్తున్నారు . తొమ్మిదవ తరగతి చరిత్ర భాగంలో భారతదేశం విభిన్న జాతుల సంస్కృతిక కలయిక గా ఉన్న పాఠ్యాంశాన్ని తీసివేసి గత చరిత్ర అంతా కూడా హిందూ మతంపై దాడి చేసిన చరిత్ర గా చిత్రికరిస్తున్నరు. దేశంలో పెద్ద పెద్ద విగ్రహాలు పెడుతూ పేద పిల్లలకు అవసరమైన పాఠశాల నిర్మాణాన్ని మరిచారు. దేశంలో 100% అక్షరాస్యతలో ముందున్న కేరళ రాష్ట్రంలో రెండు లక్షల యాభై వేలకు పైగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరారు. కేవలం 17.39 శాతం మాత్రమే ప్రైవేట్ పాఠశాల ల్లో చేరారు. మిగతా రాష్ట్రాల్లో ఈ పరిస్థితి భిన్నంగా ఉంటుంది. ఈ 12 సంవత్సరాల కాలంలో దేశవ్యాప్తంగా దాదాపుగా లక్ష స్కూళ్లు మూతపడ్డాయి. మరియు ముఖ్యంగా గిరిజన ఆదివాసి గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగవుతున్నాయి. భారతదేశంలో ప్రజాస్వామ్యం బ్రతికి ఉండాలన్నా,విలువలతో కూడిన సమాజం ఉండాలన్నా,ఖీ× తో పాటు విద్యార్థులు, మహిళలు వామపక్ష కార్యకర్తలు అంబేద్కర్ వాదులు అందరూ కలిసి ఈ వ్యవస్థను కాపాడాలి. శాస్త్రీయ ఆలోచనలను ముందుకు తీసుకెళ్లి తిరోగమన ఆలోచనలకు అడ్డుకట్ట వేయాలి. సాంఘిక రాజకీయ ఆర్థిక అంశాల హక్కుల రక్షణకై అందరూ కలవాలి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఎస్టీఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి చావ రవి అధ్యక్షత వహించగా, పూర్వ ప్రధాన కార్యదర్శి రాజేంద్రన్ సందేశం ఇచ్చారు. అనంతరం ఆచార్య హరగోపాల్ సంక్షోభంలో ప్రజాస్వామ్యం - మేధావుల పాత్ర అనే అంశంపై తరగతి బోధించారు. మధ్యాహ్నం భారత ఆర్థిక వ్యవస్థ - మధ్య తరగతి పై ప్రభావం అంశంపై బోధించారు. ఎస్టీఎఫ్ఐ కోశాధికారి షఫీ, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, మయిల్, అరుణ కుమారి, మయవన్, టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

టికెట్ బీసీలకే కేటాయించాలి

నాంపల్లి నుంచి బీజేపీ రాష్ట్ర కార్యాలయం వరకు కుంట్లూరు వెంకటేష్ గౌడ్ నేతృత్వంలో భారీ ర్యాలీ

నాంపల్లి : అక్టోబర్ 10 (వెలుతురు)
హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం బీసీ అభ్యర్థికి కల్పించాలని కోరుతూ తెలంగాణ ఉద్యమ కారుడు , బీజేపీ సీనియర్ నాయకుడు కుంట్లూరు వెంకటేష్ గౌడ్ నేతృత్వంలో భారీ ర్యాలీ నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఎంజే మార్కెట్ నుంచి బీజేపీ రాష్ట్ర కార్యాలయం వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు ర్యాలీగా తరలివెళ్లారు. అనంతరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావును కలిసి ఎమ్మెల్సీ టికెట్‌ను తనకే కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కుంట్లూరు వెంకటేష్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులకు టికెట్లు కేటాయించాయని పేర్కొన్నారు. సామాజిక న్యాయానికి ప్రాధాన్యతనిస్తూ బీజేపీ బీసీ అభ్యర్థికి అవకాశం కల్పించాలని కోరారు. బీసీ అభ్యర్థికి టికెట్ కేటాయిస్తే పట్టభద్రుల మద్దతుతో విజయం సాధించే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంలో అన్ని పార్టీలు చిత్తశుద్ధితో వ్యవహరించాలని వెంకటేష్ గౌడ్ కోరారు. హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో బీసీ అభ్యర్థికి అవకాశం కల్పించడం ద్వారా బీసీ వర్గాలకు తగిన ప్రాధాన్యత ఇచ్చినట్లవుతుందని అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావును కలిసి తమ అభ్యర్థనను వివరించినట్లు వెంకటేష్ గౌడ్ తెలిపారు. పార్టీ నాయకత్వం తమ విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలించి బీసీ అభ్యర్థికి అవకాశం కల్పిస్తుందనే నమ్మకాన్ని ఆయన వ్యక్తం చేశారు. విద్యావంతులందరూ కూడా ప్రధాని మోడీ వైపు చూస్తున్నారని ఆయన అన్నారు. ఫస్ట్ దేశం , నెక్స్ట్ ఫ్యామిలీ అని పిలుపునిచ్చిన మోడీ వైపే యువత చూస్తున్నారని పేర్కొన్నారు. దేశానికి మోడీ శ్రీరామరక్షని ప్రజలు నమ్ముతున్నారని వెంకటేష్ గౌడ్ తెలిపారు. రాబోయే ఎన్నికల్లో అమిత్ షా, మోడీ ఆధ్వర్యంలో తెలంగాణలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమన్నారు.

కీస్టోన్ స్కూల్, ఏఐసీ ఐఎస్‌బీ భాగస్వామ్యం

విద్యార్థుల ఆలోచనలకు ఆచరణ రూపం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 10:
విద్యార్థుల్లోని సృజనాత్మక ఆలోచనలను వాస్తవ జీవితంలో ఉపయోగపడే పరిష్కారాలుగా మార్చేందుకు కీస్టోన్ స్కూల్, ఏఐసీ ఐఎస్‌బీ (రూ×జ ×ాదీ) భాగస్వామ్యం చేసుకున్నాయి. విద్యార్థులు రూపొందించిన ఆలోచనలకు నిపుణుల మార్గదర్శకత్వం అందించి, వాటిని పరీక్షించి, ఆచరణలోకి తీసుకెళ్లేందుకు ఈ భాగస్వామ్యం దోహదపడనుంది. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని ఐఎస్‌బీ క్యాంపస్లో కీస్టోన్ ఎడ్యుకేషన్ గ్రూప్ వ్యవస్థాపకురాలు, డైరెక్టర్ శ్రీలక్ష్మి రెడ్డి, ఏఐసీ ఐఎస్‌బీ సీఈవో ఇషా హండా అవగాహన ఒప్పందాన్ని పరస్పరం మార్చుకున్నారు. కీస్టోన్ స్కూల్ అమలు చేస్తున్న 'ఐడియా లూమ్' విద్యా విధానాన్ని.. వ్యాపార ఆలోచనల అభివృద్ధి, నిపుణుల సలహాలు, స్టార్టప్‌ల రూపకల్పనలో ఏఐసీ ఐఎస్‌బీకి ఉన్న అనుభవంతో అనుసంధానించనున్నారు. ఇందులో భాగంగా 'కీస్టోన్ వెంచర్ ల్యాబ్' కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

విద్యార్థుల ఆలోచనలకు నిపుణుల మార్గదర్శకత్వం

కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ ఏఎస్ అండ్ ఏ లెవల్, ఇంటర్నేషనల్ బాకలారియేట్ డిప్లొమా ప్రోగ్రామ్ (ఐబీడీపీ) చదువుతున్న ఎంపిక చేసిన విద్యార్థులకు వెంచర్ ల్యాబ్ ద్వారా శిక్షణ, మార్గదర్శకత్వం అందించనున్నారు. 'ఐడియా లూమ్'లో భాగంగా విద్యార్థులు ఇప్పటికే చేపట్టిన ప్రాజెక్టులను మరింత అభివృద్ధి చేసేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుంది. నిపుణులు, పరిశ్రమల ప్రతినిధుల సహకారంతో విద్యార్థులు తమ ఆలోచనలను పరీక్షించుకోవడం, ప్రజల అవసరాలను అర్థం చేసుకోవడం, మార్కెట్ పరిస్థితులను తెలుసుకోవడం, తమ పరిష్కారాల్లో మార్పులు చేసుకోవడం వంటి అంశాలపై అవగాహన పొందుతారు. పాఠశాల స్థాయిలో ప్రారంభించిన ప్రాజెక్టులను తదుపరి దశకు తీసుకెళ్లేందుకు అవసరమైన ప్రణాళికలను కూడా రూపొందిస్తారు. కీస్టోన్ ఎడ్యుకేషన్ గ్రూప్ వ్యవస్థాపకురాలు, డైరెక్టర్ శ్రీలక్ష్మి రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు తమ చుట్టూ ఉన్న సమాజంలోని సమస్యలను గుర్తించి, వాటికి పరిష్కారాలు కనుగొనేలా 'ఐడియా

లూమ్' ద్వారా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు రూపొందించే నమూనాలు కేవలం ప్రయోగాలకే పరిమితం కాకుండా, వాస్తవ జీవితంలో ఉపయోగపడాలని తమ లక్ష్యమన్నారు. ఏఐసీ ఐఎస్‌బీతో భాగస్వామ్యం ద్వారా విద్యార్థులు తమ ఆలోచనలను పరీక్షించి, మెరుగుపరుచుకుని, ఆచరణలోకి తీసుకెళ్లే అవకాశం కలుగుతుందని చెప్పారు.

పదేళ్లలో 2,000 మందికి పైగా విద్యార్థుల భాగస్వామ్యం

కీస్టోన్ స్కూల్‌లో పదేళ్లకు పైగా కొనసాగుతున్న 'ఐడియా లూమ్' కార్యక్రమంలో ఇప్పటివరకు 2,000 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. వ్యవసాయం, దివ్యాంగులకు అందుబాటు సౌకర్యాలు, ఆహార వ్యవస్థలు, ఆరోగ్యం, రవాణా, స్థానిక జీవనోపాధి వంటి రంగాల్లో సమాజానికి ఉపయోగపడే 200కు పైగా ప్రాజెక్టులపై పనిచేశారు. ఈ కార్యక్రమం ద్వారా వందలాది నమూనాలను కూడా రూపొందించారు. విద్యార్థులు ముందుగా తమ చుట్టూ ఉన్న సమస్యలను గుర్తిస్తారు. వాటి ప్రభావానికి గురవుతున్న ప్రజలతో మాట్లాడి, పరిశోధన చేస్తారు. ఆ తర్వాత పరిష్కారాల నమూనాలను రూపొందించి, వాటిపై వచ్చిన అభిప్రాయాల ఆధారంగా మెరుగులు దిద్దుతారు. ఏఐసీ ఐఎస్‌బీ సీఈవో ఇషా హండా మాట్లాడుతూ.. విద్యార్థుల వద్ద మంచి ఆలోచనలు ఉన్నప్పటికీ, వాటిని మరింత అభివృద్ధి చేసేందుకు సరైన మార్గదర్శకత్వం, అనుభవజ్ఞుల సలహాలు అవసరమని పేర్కొన్నారు. వెంచర్ ల్యాబ్ ద్వారా వినియోగదారులు, మార్కెట్ అవసరాలను అర్థం చేసుకోవడం, పరిష్కారాలను పరీక్షించడం, తదుపరి ఏం చేయాలనే దానిపై సరైన నిర్ణయాలు తీసుకోవడం నేర్పిస్తామని తెలిపారు. ఆలోచనాత్మకంగా, బాధ్యతాయుతంగా సమస్యలకు పరిష్కారాలు చూపగల విద్యార్థులను తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారు.

తరగతి గది నుంచి క్షేత్రస్థాయి అనుభవాల వరకు

'ఐడియా లూమ్'లో భాగంగా విద్యార్థులు తమకు ప్రాధాన్యమైన సమస్యను ఎంచుకుని, దానిపై పరిశోధన చేస్తారు. సంబంధిత వ్యక్తులతో మాట్లాడి, పరిష్కారాన్ని రూపొందిస్తారు. అనంతరం నమూనాను తయారు చేయడం లేదా అవసరమైన పరిశోధన చేయడం, అభిప్రాయాలు సేకరించడం, వాటి ఆధారంగా మార్పులు చేయడం వంటి దశలను పూర్తి చేస్తారు. తదుపరి స్థాయికి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న ప్రాజెక్టులకు నిపుణుల మార్గదర్శకత్వం, ఇంటర్న్‌షిప్‌లు, కీస్టోన్ ఆధునిక ఆవిష్కరణ కార్యక్రమాల ద్వారా మరింత సహకారం అందిస్తారు. విద్యార్థులకు పరిశ్రమలతో పరిచయం, క్షేత్రస్థాయి పర్యటనలు, నిపుణులతో చర్చలు, వృత్తిపరమైన అనుభవాలను కూడా కల్పిస్తున్నారు. వెంచర్ ల్యాబ్ ద్వారా వినియోగదారుల అవసరాలను గుర్తించడం, మార్కెట్ పరిశోధన, ఉత్పత్తి లేదా సేవ ప్రత్యేకతను వివరించడం, వ్యాపార నమూనాల రూపకల్పన, పరిష్కారాల పరీక్ష, ఆలోచనలను సమర్థంగా వివరించడం వంటి అంశాల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. కొన్ని ప్రాజెక్టులు ప్రయోగాత్మక అమలు లేదా విస్తృత స్థాయి అమలు దిశగా ముందుకు వెళ్లవచ్చు. మరికొన్ని ప్రాజెక్టులు పరిశోధనలో వచ్చిన ఫలితాల ఆధారంగా కొత్త మార్గంలోకి మళ్లవచ్చు. ఈ రెండు సందర్భాల్లోనూ ఆధారాలతో నిర్ణయాలు తీసుకోవడం, ఇతరుల అభిప్రాయాలను స్వీకరించడం, తమ ఆలోచనలను మెరుగుపరుచుకోవడం వంటి నైపుణ్యాలను విద్యార్థులు నేర్చుకుంటారు. విద్యార్థులు తరగతి గదికే పరిమితం కాకుండా, సమాజానికి ఉపయోగపడే ఆలోచనలను వాస్తవ పరిష్కారాలుగా మార్చే అవకాశాలను కల్పించడమే ఈ భాగస్వామ్యం ప్రధాన లక్ష్యం. ప్రజలకు ఉపయోగపడే ఆవిష్కరణలు చేయడానికి అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలు, అనుభవాన్ని విద్యార్థులకు అందించడంలో కీస్టోన్ వెంచర్ ల్యాబ్ కీలక పాత్ర పోషించనుంది.

ఎంఎస్ఎంఈల కోసం 'సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్'

- సమస్యల పరిష్కారానికి నెలకోసారి "ఎంఎస్ఎంఈ గ్రీవెన్స్ డే"
- నగరంలోని పారిశ్రామిక వాడల అభివృద్ధికి చర్యలు
- "ఎల్ యూబీ ఎంఎస్ఎంఈ సౌత్ ఇండియా సమ్మిట్"లో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 10
రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ)ను మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేకంగా 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఈ కేంద్రం ద్వారా "మేడ్ ఇన్ తెలంగాణ" బ్రాండ్ విశ్వవ్యాప్తమయ్యేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్ అవకాశాలు, పెట్టుబడుల అనుసంధానం తదితర అంశాల్లో ఎంఎస్ఎంఈలకు మార్గ నిర్దేశం చేస్తామన్నారు. లఘు ఉద్యోగ్ భారతి(తెలంగాణ) ఆధ్వర్యంలో బంజారాహిల్స్ లోని తాజ్ డెక్కన్ లో శనివారం నిర్వహించిన "ఎల్ యూబీ ఎంఎస్ఎంఈ సౌత్ ఇండియా సమ్మిట్"ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఎంఎస్ఎంఈలు లక్షలాది కుటుంబాలకు

జీవనోపాధి కల్పిస్తూ పారిశ్రామికాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ఈ రంగం అభివృద్ధికి తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. దేశంలోనే తొలిసారిగా ఎంఎస్ఎంఈ పాలసీని తీసుకొచ్చిన ఘనత తెలంగాణకే దక్కిందన్నారు. క్షేత్రస్థాయిలో ఎంఎస్ఎంఈలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటికి ఆచరణాత్మక పరిష్కారాలు చూపించేందుకు నెలకోసారి ప్రత్యేకంగా గ్రీవెన్స్ డే ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌తో పాటు శివారు ప్రాంతాల్లోని పారిశ్రామిక వాడల అభివృద్ధికి

చర్యలు తీసుకుంటున్నామన్నారు. తెలంగాణ ఎంఎస్ఎంఈ ఉత్పత్తులను జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానం చేసేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. మారుతున్న మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నాణ్యత, సాంకేతికత, నైపుణ్యాభివృద్ధి, ఉత్పత్తి సామర్థ్యం పెంపుపై ఎంఎస్ఎంఈలు దృష్టిసారించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ బీఐ ఎండీ రామ్మోహన్ రావు, లఘు ఉద్యోగ్ భారతి (తెలంగాణ) ప్రతినిధులు వై.వెంకటేశ్వర్లు, కె.నరేంద్రనాథ్ దత్, ఓం అనూజ్ ఖదేల్వాల్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల ప్రోత్సాహానికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం

- ప్రపంచస్థాయి క్రీడా మౌలిక సదుపాయాల కల్పనకు కృషి
- కొరియా తరహాలో క్రీడాకారులను తీర్చిదిద్దే దిశగా అడుగులు
- ఐజీపీఎల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 10
?తెలంగాణలో క్రీడల అభివృద్ధికి, క్రీడాకారులను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రీడా మౌలిక సదుపాయాల కల్పనతోపాటు, యువ క్రీడాకారులకు మెరుగైన శిక్షణ, ప్రోత్సాహకాలు అందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి స్పోర్ట్స్ స్టేడియాన్ని నిర్మించనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారని గుర్తుచేశారు. హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్, ఎన్‌డీటీవీ, ఏఎం గ్రీన్, ఇండియన్ గోల్ఫ్ ప్రీమియర్ లీగ్ (ఐజీపీఎల్) సంయుక్త ఆధ్వర్యంలో గోల్కొండ కోట సమీపంలోని గోల్ఫ్ కోర్స్‌లో నిర్వహించిన ఇండియన్ గోల్ఫ్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆర్ అండ్ బి మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి తో కలిసి శనివారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో క్రీడా రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రపంచ ప్రఖ్యాత ఫుట్‌బాల్ క్రీడాకారుడు మెస్సీని తెలంగాణకు ముఖ్యమంత్రి ఆహ్వానించారని తెలిపారు. మెస్సీ ఫుట్‌బాల్ ఆడటంతో పాటు, హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణానికి సంబంధించిన ప్రకటన కూడా వెలువడిందని పేర్కొన్నారు. క్రీడలకు అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం ద్వారా రాష్ట్రాన్ని క్రీడా రంగంలో కీలక కేంద్రంగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. ?ఇటీవల ముఖ్యమంత్రి రాష్ట్రంలో క్రీడలు, ఇతర సంబంధిత కార్యకలాపాల పురోగతిపై సమీక్ష నిర్వహించారని చెప్పారు. దక్షిణ కొరియా వంటి దేశాల్లోని విశ్వవిద్యాలయాలు క్రీడల్లో వందలాది పతకాలు సాధిస్తున్న తీరును పరిశీలించాలని ఈ సందర్భంగా సూచించారని తెలిపారు. ఒకే విశ్వవిద్యాలయం వంద పతకాలు సాధించడం వెనుక ఉన్న శిక్షణా విధానాలు, క్రీడాకారులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ప్రోత్సాహకాలను అధ్యయనం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారని పేర్కొన్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి స్వయంగా దక్షిణ కొరియాలోని

సంబంధిత విశ్వవిద్యాలయాన్ని సందర్శించి, వైస్ ఛాన్సలర్‌తోపాటు క్రీడా అధికారులతో చర్చలు జరిపారని వెల్లడించారు. తెలంగాణ విద్యార్థులకు క్రీడా శిక్షణ అందించేందుకు ఆ విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకోవాలని కోరినట్లు తెలిపారు. అంతర్జాతీయ స్థాయి శిక్షణా విధానాలను అధ్యయనం చేసి, వాటిని రాష్ట్రంలో అమలు చేయాలన్న ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. ?గోల్ఫ్ క్రీడ దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందుతోందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. హైదరాబాద్ గోల్ఫ్ కోర్స్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని, గోల్కొండ కోట వంటి చారిత్రక ప్రాంతానికి సమీపంలో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్ నగరానికి మరింత ప్రాచుర్యం తీసుకువస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో కొనసాగుతున్న గోల్ఫ్ కోర్స్‌ను క్రీడలు, పర్యాటక రంగాల అభివృద్ధికి ఉపయోగపడే ముఖ్యమైన ప్రాజెక్టుగా అభివర్ణించారు. క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధితోపాటు పర్యాటక రంగానికి కూడా ప్రోత్సాహం అందిస్తామని చెప్పారు. హైదరాబాద్ గోల్ఫ్ కోర్స్‌తోపాటు రాష్ట్రంలోని ఇతర క్రీడా వేదికలకు అవసరమైన సహకారాన్ని భవిష్యత్తులోనూ అందిస్తామని భరోసా ఇచ్చారు.

విజేతలకు అభినందనలు

ఐజీపీఎల్ టోర్నమెంట్‌లో పతకాలు, విజయాలు సాధించిన క్రీడాకారులను భట్టి విక్రమార్క ప్రత్యేకంగా అభినందించారు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో వారు మరిన్ని విజయాలు సాధించి, తమ ప్రతిభతో దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి హాజరుకావాలని ఎన్‌డీటీవీ ప్రతినిధులు, తన మిత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఫహీమ్ ఖురేషి, భాస్కర్ రెడ్డి, ప్రత్యేకంగా ఆహ్వానించారని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు రావడానికి ఐదు నుంచి ఐదున్నర గంటల సమయం పడుతుందని, అయినప్పటికీ ఈ కార్యక్రమ ప్రాధాన్యాన్ని గుర్తించి తన ఇతర కార్యక్రమాలను రద్దు చేసుకుని వచ్చానని చెప్పారు. క్రీడాకారులను ప్రోత్సహించే ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని జరగాలని ఆకాంక్షించారు. అనంతరం విజేతలకు ట్రోఫిలను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అందజేశారు.

సీపీఎం నేతల అరెస్టు దుర్మార్గం

- ఎన్నికల ప్రధాన కమిషనర్ తక్షణమే రాజీనామా చేయాలి
- ఆర్‌టీసీ క్రాస్ రోడ్స్‌లో నిరసన కార్యక్రమం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 10
ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని, సర్ ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న సీపీఐ(ఎమ్) అఖిలభారత మరియు తెలంగాణ రాష్ట్రంతో పాటు, వివిధ రాష్ట్రాల నాయకులపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగించడాన్ని సీపీఐ(ఎమ్) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తోంది. ఢిల్లీలో శాంతియుతంగా ప్రదర్శనగా వెళ్తున్న పార్టీ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీతో సహా పొలిట్ బ్యూరో సభ్యులు బి. వి. రాఘవులు, ఆర్. అరుణకుమార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు టి. జ్యోతితో పాటు ఇతర కేంద్ర కమిటీ సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. అంతేకాకుండా, సీపీఐ(ఎమ్) కేంద్ర కార్యాలయాలైన సూర్జిత్ భవన్, ఏకేజీ భవన్‌లపై పోలీసులు దాడి చేసి, పార్టీ నాయకులను, కార్యకర్తలను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లలో నిర్బంధించారు. ఈ అక్రమ అరెస్టులు, కేంద్ర ప్రభుత్వ నిర్బంధ వైఖరిని నిరసిస్తూ, హైదరాబాద్ సీపీఎం రాష్ట్ర కార్యాలయం నుండి ప్రదర్శనగా బయలుదేరి ఆర్‌టీసీ క్రాస్ రోడ్స్‌లో భారీ నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా

సీపీఐ(ఎమ్) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి. నాగయ్య మాట్లాడుతూ.. సీపీఎం జాతీయ పార్టీ ఆఫీసులైన సూర్జిత్ భవన్, ఏకేజీ భవన్‌లపై దాడి చేసి నాయకులను, కార్యకర్తలను నిర్బంధించడం అత్యంత దుర్మార్గమైన చర్య. దీనిని సీపీఐ(ఎమ్) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తోంది. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఈరోజు ప్రధాని మోడీకి ఒక ఏజెంట్‌లా వ్యవహరిస్తున్నారు. రాజ్యాంగం ప్రకారం 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలనే సూత్రాన్ని విస్మరించి, బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నారనే నెపంతో ముస్లింలు, క్రిస్టియన్లు, దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల ఓట్లను ఏరికోరి దేశవ్యాప్తంగా దాదాపు 13 కోట్ల ఓట్లను రద్దు చేశారు. ఇది అత్యంత అప్రజాస్వామికమైన రాజ్యాంగ ఉల్లంఘన. మోడీ ప్రభుత్వం రాజ్యాంగ యంత్రంలోని వివిధ డిపార్ట్‌మెంట్‌లను, స్వతంత్ర సంస్థలను తన ఏజెంట్లుగా మార్చుకుని ఆర్ఎస్ఎస్ కార్యకర్తలతో నింపివేస్తోంది. ఈ దుర్మార్గపు చర్యలకు నిరసనగా దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలు, యువకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున నిరసనలు తెలియజేస్తున్నారు. ప్రజల, ప్రతిపక్షాల మరియు యువత ఒత్తిడికి తలొగ్గి కేంద్ర ప్రభుత్వం తక్షణమే జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి. ప్రభుత్వం ఇప్పటికైనా మొండివైఖరి వీడాలి. లేకపోతే ఇది కేవలం సీఈసీ రాజీనామాతో ఆగదు, నరేంద్ర మోడీయే రాజీనామా చేయాలని కోరుతూ కోట్లాది మంది ప్రజలు వీధుల్లోకి వచ్చే సమయం ఆసన్న మౌతుంది. తక్షణమే జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి, సర్ ప్రక్రియను రద్దు చేయాలి, రద్దు చేసిన 13 కోట్ల ఓట్లను పునరుద్ధరించాలి. లేనిపక్షంలో సీపీఐ(ఎమ్), ప్రతిపక్ష పార్టీలు, యువత, విద్యార్థులతో కలిసి దేశవ్యాప్తంగా భారీ పోరాటాలు నిర్వహించి ఈ ప్రభుత్వం మెడలు వంచుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్, టి సాగర్ ప్రసంగించారు. హైదరాబాద్ సెంట్రల్ కమిటీ కార్యదర్శి ఎం వెంకటేష్, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు భరోసానిచ్చిన మంత్రి

- డాక్టర్ అవుతానన్న బాలిక లక్ష్యాన్ని, పట్టుదలను మెచ్చుకున్న మంత్రి
- "కోమటి రెడ్డి ప్రతీక్ ఫౌండేషన్" ద్వారా బాలిక కోరుకున్న డాక్టర్ విద్య చదివిస్తానని మంత్రి హామీ

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 10
తల్లిదండ్రులను కోల్పోయి ఇబ్బందిపడుతున్న నిరుపేద బాలికకు తాను అండగా ఉంటానని,ఉన్నత చదువులకు అయ్యే ఖర్చునంతా భరిస్తానని రాష్ట్ర రోడ్లు భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మరోసారి తన మంచి మనసు చాటుకున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా, కట్టంగూర్ మండలం, చండూర్ గ్రామానికి చెందిన రాజగోపాల మనస్విని అనే బాలికకు తల్లితండ్రులు ఇద్దరూ లేకపోవడంతో, ప్రస్తుతం ఆమె పెద్దమ్మ వద్ద ఉంటూ చదువుకుంటోంది. స్థానిక నాయకుల ద్వారా... శనివారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసిన సదరు బాలిక,కుటుంబ సభ్యులు అమ్మాయి ఎదుర్కొంటున్న ఇబ్బందులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈసందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి బాలికతో ఎంతో ఆప్యాయంగా మాట్లాడి, ఆమె యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. "ప్రస్తుతం ఏం చదువుతున్నావు? భవిష్యత్తులో ఏం కావాలనుకుంటున్నావు?" అని మంత్రి ప్రశ్నించగా...తాను ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్నానని, భవిష్యత్తులో బాగా చదువుకొని 'డాక్టర్' కావాలనేది తన లక్ష్యమని బాలిక మనస్విని తెలిపింది. ఆ బాలిక లక్ష్యాన్ని, పట్టుదలను మెచ్చుకున్న మంత్రి.. 'ప్రతీక్ ఫౌండేషన్' ద్వారా ఆమె ఉన్నత విద్యకు కావాల్సిన పూర్తి సహాయాన్ని అందజేస్తామని హామీ ఇచ్చారు. బాలిక భవిష్యత్తుకి అన్ని విధాలా అండగా ఉంటానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు. మంత్రి వెంట ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య,తదితరులు ఉన్నారు.

హైదరాబాద్‌లో అక్టోబర్ 14, 15 తేదీల్లో సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీట్--2026

- ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి..
- హాజరుకానున్న సినీ నటుడు చిరంజీవి, కేంద్ర మంత్రులు
- ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లు, మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

హైదరాబాద్, అక్టోబర్ 10: వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక రంగాల అభివృద్ధితో పాటు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అంతర్జాతీయ స్థాయిలో కొత్త అవకాశాలను కల్పించే లక్ష్యంతో సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో 'సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీట్--2026' అక్టోబర్ 14, 15 తేదీల్లో హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో రెండు రోజుల పాటు ఈ సదస్సు నిర్వహించనున్నట్లు సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు టీవీఎన్ రావు, పీవీ రావు, ఏవీ రత్నం, తోట చంద్రశేఖర్, రజనీకాంత్ వెల్లడించారు. ఈ మేరకు శనివారం లక్డీకాపూల్ లోని ఓ ప్రైవేట్ హోటల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 14న ఉదయం 10.30 గంటలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా

పాల్గొని సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్‌ను ప్రారంభించనున్నట్లు వారు తెలిపారు. అదే రోజు సాయంత్రం 5 గంటలకు పద్మవిభూషణ్, ప్రముఖ సినీ నటుడు కొణిదెల చిరంజీవి కార్యక్రమానికి హాజరుకానున్నారని పేర్కొన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాస్వాన్ సైతం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొననున్నారని తెలిపారు. వ్యాపార భాగస్వామ్యాల ఏర్పాటు, పెట్టుబడులను ఆకర్షించడం, కొత్త మార్కెట్లను అన్వేషించడం, పారిశ్రామిక రంగంలో పరస్పర సహకారాన్ని పెంపొందించడం ఈ గ్లోబల్ బిజినెస్ మీట్ ప్రధాన లక్ష్యాలని వారు వివరించారు. వివిధ రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, వ్యాపార ప్రతినిధులు ఒకే వేదికపైకి రావడం ద్వారా కొత్త వ్యాపార సంబంధాలు ఏర్పడటంతో పాటు పెట్టుబడులకు అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు), స్టార్టప్‌లు, మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఈ సదస్సు ప్రాధాన్యమివ్వనుంది. ఔత్సాహిక వ్యాపారవేత్తలకు తమ ఆలోచనలు, ఉత్పత్తులు, సేవలను విస్తృత స్థాయిలో పరిచయం చేసుకునేందుకు ఈ వేదిక దోహదపడనుందన్నారు. దక్షిణ భారతదేశంలో వ్యాపార, పారిశ్రామిక అభివృద్ధికి ఈ సమావేశం కొత్త అవకాశాలను అందిస్తుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

యువత నైపుణ్యం పెంపొందించుకొని,
వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు

సిద్దిపేట, వెలుతురు అక్టోబర్ 10 : జిల్లా అభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని, తమ నైపుణ్యాలను పెంపొందించుకొని అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు అన్నారు. సిద్దిపేట జిల్లా ఏర్పడి పది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిద్దిపేట (స్వయం ప్రతిపత్తి)లో విద్యార్థి యువజన సదస్సును నిర్వహిం చారు. ఈ కార్యక్రమా నికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు మాట్లాడుతూ, ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఘనమైన చరిత్ర ఉందని, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి సహా పలువురు ఐఏఎస్ అధికారులు, శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, ఉపాధ్యా యులను ఈ కళాశాల సమాజానికి అందించిందని పేర్కొన్నారు. జిల్లా ఏర్పాటు కాకముందు విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తుచేస్తూ, జిల్లా ఏర్పడిన అనంతరం విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని వివరించారు. యువతకు ఉన్నత విద్యావకాశాలను కల్పించేందుకు వైద్య కళాశాలలు, పాలిటెక్నిక్ కళాశాలలు, ఫార్మసీ కళాశాలలు ఏర్పాటు చేయడంతో పాటు ఉపాధి అవకాశాలను మెరుగు పరిచేందుకు ఐటీ టవర్ వంటి సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకొని, అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటూ భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన కోర్సులు, విద్యా సదుపాయాలను అందిస్తూ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. సునీతను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా సంప్రదాయ వంటకాలు, బతుకమ్మకు సంబంధించిన ప్రసాదాలను ప్రదర్శించారు. సాయంత్రం కళాశాల ప్రాంగణంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నందిని సిధారెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. అయోధ్య రెడ్డి, డాక్టర్ సి. హెచ్. మధుసూదన్, డాక్టర్ గోపాల సుదర్శనం, పిట్ల దాసు, ప్రొఫెసర్ మట్టా సంపత్ కుమార్ రెడ్డి, డాక్టర్ జి. లీలావతి తదితర అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

బోడుప్పల్‌లో ఘనంగా
తీరొక్క పూలతో బతుకమ్మ సంబరాలు

హైదరాబాద్ (బోడుప్పల్) వెలుతురు, అక్టోబర్ 10: తెలంగాణ వ్యాప్తంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. బతుకమ్మ ఉత్సవాల్లో తొలిరోజైన ఎంగిలిపూల బతుకమ్మను తీరొక్క పూలతో పేర్చి మహిళలు, పిల్లలు ఆడిపాడుతున్నారు. హైదరాబాద్ నగరంలోని బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలో 17 వ డివిజన్ రామ్ రెడ్డి నగర్, విజయపురి కాలనీలో ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలను, శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మహిళలందరూ తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి కలిసి కట్టుగా పాటలు పాడుతూ బతుకమ్మ చుట్టూ తిరుగుతూ ఆటలాడారు. అనంతరం చెరువులో బతుకమ్మను నిమజ్జనం చేశారు.

దేవీ నవరాత్రి ఉత్సవాలను
ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

- రెండు కమిటీల మధ్య వివాదం నేపథ్యంలో అధికారుల సూచనలు
- దేవి చౌక్‌లో పోలీస్ ఔట్‌పోస్ట్ ను ప్రారంభించిన గోకవరం తహసీల్దార్, కోరుకొండ సిఐ

గోకవరం, వెలుతురు అక్టోబర్ 10 : దేవీ నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు సంబంధించి రెండు కమిటీల మధ్య వివాదాస్పద సంఘటన చోటుచేసుకున్న నేపథ్యంలో, ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కమిటీ సభ్యులు సహకరించాలని మండల తహసీల్దార్ వినిశెట్టి రామకృష్ణ సూచించారు. ఈ మేరకు ఇరు వర్గాలను పిలిపించి, చట్టపరమైన సూచనలు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గోకవరం మండలం దేవి చౌక్‌లో ఏర్పాటు చేసిన పోలీస్ ఔట్‌పోస్టును తహసీల్దార్ వినిశెట్టి రామకృష్ణ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కోరుకొండ సీఐ సత్యనారాయణమూర్తి, తహసీల్దార్ రామకృష్ణ మాట్లాడుతూ.. దేవి చౌక్‌లో తొమ్మిది రోజులపాటు నిర్వహించే దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాలను అందరూ సమన్వయంతో, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించినా, వివాదాలకు కారణమైనా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

న్యాయవ్యవస్థలో బహుజనులకు
సముచిత ప్రాతినిధ్యం కల్పించాలి

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 10 : న్యాయ వ్యవస్థలో బహుజన వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని బీసీ లాయర్స్ అసోసియేషన్ తీర్మానించింది. న్యాయవ్యవస్థలో సామాజిక న్యాయం, సమాన అవకాశాలు బలోపేతం కావాలంటే న్యాయమూర్తుల నియామకాలతో సహా అన్ని కీలక వ్యవస్థల్లో బహుజనుల నిష్పత్తికి అనుగుణంగా బహుజన న్యాయవాదులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని సదస్సు అభిప్రాయపడింది. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో శనివారం 'ఉన్నత న్యాయవ్యవస్థలో సామాజిక న్యాయం' అనే అంశంపై బీసీ లాయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు తలకొక్కుల రాజు అధ్యక్షతన, కార్యదర్శి పొన్నం దేవరాజ్ గౌడ్ సమన్వయంతో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని న్యాయవ్యవస్థలో సామాజిక ప్రాతినిధ్యంపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. న్యాయవ్యవస్థలో సమాన అవకాశాలకు ప్రాధాన్యం సమాజంలోని అన్ని వర్గాలకు న్యాయం అందించే వ్యవస్థలోనే అన్ని సామాజిక వర్గాలకు తగిన భాగస్వామ్యం ఉండాలని వక్తలు పేర్కొన్నారు. న్యాయవ్యవస్థలో బహుజన వర్గాల ప్రాతినిధ్యం పెరగడం ద్వారా సామాజిక న్యాయం, సమానత్వం పట్ల ప్రజల్లో విశ్వాసం మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. అర్హత కలిగిన బహుజన న్యాయవాదులకు ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

లింగ్యా తండాలో విషాదం

మహబూబాబాద్, వెలుతురు అక్టోబర్ 10 : కురవి మండలం లింగ్యా తండాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాలతో తల్లి తన ఇద్దరు పిల్లలతో కలిసి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతులు బానోత్ అనూష (35), కుమా రుడు విశాల్ కృష్ణ (09), కూతురు వర్షిణి (05) గా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వైభవంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

వరంగల్, వెలుతురు : వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆలయంలో వైభవంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ముందుగా భద్రకాళి అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. దసరా మహోత్సవాల ముందు వచ్చే అమావాస్య తిథిరోజున అమ్మవారికి ప్రత్యేక పసుపు అభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. ఆలయ ప్రధాన అర్చకులు శేషు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు అభిషేకం నిర్వహించారు. నవరాత్రి మహోత్సవాల సందర్భంగా భక్తులు వేలాదిగా తరలివచ్చారు.

రైతులకు సాగునీరు,
నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి

-మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

పెద్దపల్లి, వెలుతురు అక్టోబర్ 10 : రైతులకు సాగునీరు, వ్యవసాయానికి అవసరమైన నిరంతర విద్యుత్ సరఫరా చేయడంలో నెలకొన్న తీవ్ర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎలిగేడు మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ధర్నా, ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, పెద్దపల్లి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దాసరి మమతా రెడ్డి, జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ రఘువీర్ సింగ్ పాల్గొని రైతుల సమస్యలపై గళమెత్తారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతి-మోహన్ రావు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, సుల్తాన్‌పూర్ సర్పంచ్ బాపయ్య, ఉప సర్పంచ్ రమేష్ రావు, పార్టీ నాయకులు బద్దం తిరుపతిరెడ్డి, పోషాలు, రాజేశం, వినోద్, సంపత్, నారాయణ, సాయినాథ్, సది, కార్తీక్, టేక్ కుమార్ తదితరులు, పెద్ద సంఖ్యలో రైతులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫలక్ నామా కాళీ మాత ఆలయంలో కవిత పూజలు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 10 : పాత బస్తీలోని ఫలక్నుమా కాళీ మాత అమ్మ వారిని టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శనివారం దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆలయం వద్ద ఉన్న సమస్యలను అక్కడి పరిస్థితులను భక్తులను అడిగి తెలుసుకున్నారు.

విజయవాడ రైల్వే స్టేషన్లో
దసరా భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

- భక్తుల రద్దీ నియంత్రణకు 7 ప్రత్యేక రైళ్లు..
- మూడు షిఫ్టుల్లో 100 నుంచి 200 మంది సిబ్బందితో భద్రత

విజయవాడ, వెలుతురు అక్టోబర్ 10 : విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలను పురస్కరించుకుని రైల్వే శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. విజయవాడ రైల్వే స్టేషన్కు వచ్చే భక్తుల రద్దీని నియంత్రించేందుకు పాటు, ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంది. ఐజీ బి రాజకుమారి మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఏడు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. కేరళ, తమిళనాడు, సికింద్రాబాద్, విశాఖపట్నం, గుజరాత్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ప్రయాణ సౌకర్యాలు కల్పించేందుకు రైల్వే అధికారులు చర్యలు చేపట్టారు అక్టోబర్ 10 నుంచి 22వ తేదీ వరకు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు అమలులో ఉంటాయని తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సాధారణ సిబ్బందితో పాటు అదనపు బలగాలను రంగంలోకి దింపారు. మూడు షిఫ్టుల్లో సుమారు 100 నుంచి 200 మంది రైల్వే సిబ్బందిని భద్రతా విధులకు కేటాయించారు. భక్తుల రాకపోకల సమయంలో తోపులాటలు, క్రాస్ వాకింగ్ జరగకుండా ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను వేర్వేరుగా ఏర్పాటు చేశారు. రైల్వే స్టేషన్లోని పార్సెల్ కార్యాలయం వద్ద అడ్డుగా ఉన్న గోడను తొలగించి, భక్తులు సులభంగా నడిచివెళ్లేలా మార్గాన్ని సౌకర్యవంతంగా మార్చారు. జీఆర్పీ (ఉమెన్), ఆర్పీఎఫ్ (వీఐపీ), లా అండ్ ఆర్డర్ పోలీసుల సమన్వయంతో కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. రైలు ప్రయాణంలో ఏదైనా సమస్య ఎదురైతే 139 నంబర్కు, అత్యవసర పోలీసు సహాయం కోసం 112 నంబర్కు ఫోన్ చేయాలని అధికారులు సూచించారు. తప్పిపోయిన చిన్నారుల వివరాలను గుర్తించేందుకు పోలీస్ అవుట్‌పోస్టులను కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. దసరా ఉత్సవాల సందర్భంగా విజయవాడకు వచ్చే భక్తులు రైల్వే శాఖ సూచనలను పాటిస్తూ సురక్షితంగా తమ ప్రయాణాన్ని కొనసాగించాలని కోరారు.

కుప్పంలో 20న వైభవంగా శ్రీ మహాలక్ష్మీ దీపపూజ

కుప్పం, వెలుతురు అక్టోబర్ 10 : విజలాపురం రోడ్డు, కుప్పం చెరువు కట్ట సమీపంలోని శ్రీ మహాలక్ష్మి దీపోత్సవ ప్రాంగణంలో అక్టోబరు 20వ తేదీ సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న శ్రీ మహాలక్ష్మీ దీపపూజకు అన్ని ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని టీడీపీ జేఈవో డా. ఎ. శరత్ అధికారులను ఆదేశించారు. పెద్దసంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శనివారం తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో తన ఛాంబర్ నుంచి నిర్వహించిన జూమ్ సమావేశంలో ఆయన కుప్పంలో జరుగుతున్న ఏర్పాట్లను సంబంధిత అధికారులతో సమీక్షించారు.

భక్తులకు పటిష్ట సౌకర్యాలు

ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ, శ్రీ మహాలక్ష్మీ దీపపూజలో పాల్గొనే భక్తుల కోసం తగిన సంఖ్యలో షెడ్లు, మ్యాట్లు, దీపారాధన సామగ్రి, ఎల్‌ఈడీ స్క్రీన్లు, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కుప్పం, గుడుపల్లె, రామకుప్పం, శాంతిపురం, వి.కోట తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో విచ్చేసే భక్తుల కోసం తాగునీరు, మజ్జిగ, అన్నప్రసాద పంపిణీ కేంద్రాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతమైన ఆధ్యాత్మిక వాతావరణంలో దీపపూజలో పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.



12 నుంచి 20 వరకు
శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు

తిరుపతి, వెలుతురు అక్టోబర్ 10 : అక్టోబర్ 16న గరుడ వాహనం, 17న పుష్పకవిమానం, అక్టోబరు 19న స్వర్ణరథం, 20న చక్రస్నానం శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబరు 12 నుండి 20వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. చాంద్రమానం ప్రకారం ప్రతి మూడు సంవత్సరాలకోసారి అధికమాసం వస్తుంది. ఇలావచ్చిన సందర్భాల్లో కన్యామాసం (భాద్రపదం)లో వార్షిక బ్రహ్మోత్సవాలు, దసరా నవరాత్రుల్లో (ఆశ్వయుజం) నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం, ధ్వజావరోహణం ఉండవు. ప్రధానంగా అక్టోబరు 16న గరుడ వాహనం, 17న పుష్పకవిమానం, అక్టోబరు 19న స్వర్ణరథం, 20న చక్రస్నానం జరుగనున్నాయి. ఉదయం వాహనసేవ 8 నుండి 10 గంటల వరకు, రాత్రి వాహనసేవ 7 నుండి 9 గంటల వరకు జరుగుతుంది. గరుడవాహనసేవ రాత్రి 6.30 నుండి 11.30 గంటల వరకు జరుగుతుంది.

11నుంచి కట్ట మైసమ్మ
శరన్నవరాత్రి ఉత్సవాలు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 10 : లోయర్ ట్యాంక్ బండ్ తనకాల కట్ట మైసమ్మ దేవాలయ శరన్నవరాత్రి ఉత్సవాలను 11వ తేదీ నుండి ప్రారంభం కానున్నాయని ఆలయ ప్రధాన అర్చకులు సాత్విక్ శర్మ విలేకరుల సమావేశంలో తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం కూడా దేవి శరన్నవరాత్రులను ఘనంగా జరుపుకోనున్నట్టు పేర్కొన్నారు ఈ నవరాత్రి ఉత్సవాల కార్యక్రమానికి పలువురు మంత్రులు, ప్రముఖులు రానున్నట్లు తెలిపారు. భక్తులు ఇక్కడకు అధిక సంఖ్యలో వస్తారని వారికి అన్ని సౌకర్యాలను కల్పించనున్నట్లు స్పష్టం చేశారు. నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి ప్రతి రోజు ఒక్కో దేవత రూపంగా అలంకరించడం జరుగుతుందని వివరించారు. చివరి రోజు అమ్మవారి అలంకరణ మహిషాసుర మర్దినిగా ప్రత్యేకంగా అలంకరించడం జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆశీర్వాదాన్ని పొందాలని విజ్ఞప్తి చేశారు.

చాదర్‌ఘాట్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 10 : మలక్‌పేటలోని డీ-మార్ట్ సిగ్నల్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎల్బీనగర్‌కు చెందిన బి. లావణ్య (25) తన భర్తతో కలిసి ద్విచక్ర వాహనం నంబర్ టీఎస్ 09 ఈఈ 2709పై ఎల్బీనగర్ నుంచి చాదర్‌ఘాట్ వైపు వెళుతుండగా, డీ-మార్ట్ సిగ్నల్ వద్ద బైక్ అదుపుతప్పి ఇద్దరూ రోడ్డుపై పడిపోవడం జరిగింది. ఈ క్రమంలో లావణ్య అదే మార్గంలో వెళ్తున్న ఏపీ 39 జె 0361 నంబర్ గల బస్సు వెనుక చక్రాల కింద పడటంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది.

కంచుకట్ల సుభాష్ రాష్ట్ర కన్వీనర్ ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి తెలంగాణ రాష్ట్రం

దక్షిణాఫ్రికాలో బతుకమ్మ
వేడుకల్లో పాల్గొన్న మంత్రి సీతక్క

- ఆడబిడ్డలతో కలిసి బతుకమ్మ ఆడి, పాడిన మంత్రి సీతక్క
- సౌత్ ఆఫ్రికా తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

కేప్ టౌన్, వెలుతురు అక్టోబర్ 10 : దక్షిణాఫ్రికాలో సౌత్ ఆఫ్రికా తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో రాష్ట్ర మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా దక్షిణాఫ్రికాలో నివసిస్తున్న తెలంగాణ ఆడబిడ్డలతో కలిసి ఆమె బతుకమ్మ ఆడి, పాడారు. సంప్రదాయ బతుకమ్మ పాటలు, ఆటలతో వేడుకల్లో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను విదేశీ గడ్డపై సైతం ఘనంగా చాటుతున్న ప్రవాస తెలంగాణ మహిళలతో కలిసి మంత్రి సీతక్క బతుకమ్మ సంబరాల్లో పాలుపంచుకున్నారు. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయత, ఉత్సాహం మధ్య సాగిన ఈ వేడుకలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, సంప్రదాయ దుస్తుల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ పాటలు పాడుతూ సంబరాలు జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను దేశ సరిహద్దులు దాటి విదేశాల్లోనూ ఘనంగా నిర్వహించడం పట్ల మంత్రి సీతక్క సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణ ఆడబిడ్డలు ఎక్కడ ఉన్నా తమ మూలాలను, సంస్కృతి సంప్రదాయాలను మరిచిపోకుండా బతుకమ్మ వంటి పండుగలను జరుపుకోవడం అభినందనీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇలాంటి వేడుకలు ప్రవాస తెలంగాణ ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించడంతో పాటు, భావితరాలకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేయడానికి దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క వెంట వ్యవసాయ కమిషన్ సభ్యురాలు భవాని రెడ్డి పాల్గొన్నారు. సౌత్ ఆఫ్రికా తెలంగాణ అసోసియేషన్ ప్రతినిధులు, ప్రవాస తెలంగాణ మహిళలు, ఇతర సభ్యులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

చాగల్లు కలవలపల్లి మధ్య పెద్దపులి సంచారం

- పట్టుకునేందుకు రంగంలోకి పూణే బృందం
- పంట పొలాల్లోకి వెళ్లొద్దంటూ హెచ్చరికలు
- పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశాలు

తూర్పుగోదావరి, వెలుతురు అక్టోబర్ 10 : కొవ్వూరు నియోజకవర్గం చాగల్లు మండల పరిధిలో పెద్దపులి సంచారం కలకలం రేపుతోంది. చాగల్లు?కలవలపల్లి గ్రామాల మధ్య పులి తిరుగుతున్నట్లు సమాచారం. దీంతో పులిని సురక్షితంగా పట్టుకునేందుకు పూణే రెస్క్యూ టీంతో పాటు ఆర్ఆర్ఆర్ బృందం రంగంలోకి దిగాయి. గ్రామాల పరిసర ప్రాంతాలను జల్లెడ పడుతూ పులి జాడను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నాయి. పెద్దపులిని పకడ్బందీగా పట్టుకునేందుకు అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. మరో వైపు చాగల్లు మండలంలో ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఎమ్మార్వో మెరికమ్మ ఆధ్వర్యంలో చాటింపు వేయిస్తున్నారు. పంట పొలాల్లో పనిచేసే రైతులు, వ్యవసాయ కూలీలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ సిబ్బంది హెచ్చరించారు. పాడిపశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని రెవెన్యూ యంత్రాంగం సూచించింది. పెద్దపులి కదలికలపై అధికారులు నిరంతరం నిఘా ఉంచి, దానిని బంధించేందుకు చర్యలు కొనసాగిస్తున్నారు.

బేబీ రుక్సానా ఆరోగ్యంపై మంత్రి రాజనర్సింహ ఆరా

సికింద్రాబాద్, గాంధీ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న బేబీ రుక్సానా ఆరోగ్య పరిస్థితిపై మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆరా తీశారు. మంత్రి ఆదేశాలతో ఆయన కార్యాలయ అధికారులు శనివారం ఉదయం గాంధీ హాస్పిటల్కు వెళ్లి పాప, ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. హాస్పిటల్ సూపరింటెండెంట్, డాక్టర్ ఉషారాణి గారితో మంత్రి ఫోన్లో మాట్లాడి పాప ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. పాపకు పుట్టుకతోనే పెద్ద పేగు సమస్య ఉందని, ఈ సమస్యకు పాప పుట్టినప్పుడే నీలోఫర్లో సర్జరీ చేశారని ఉషారాణి తెలిపారు. ఇటీవలే గాంధీలో పాపకు మరో సర్జరీ జరిగిందని, మరో 3 నెలల తర్వాత ఇంకొక సర్జరీ చేయాల్సి ఉందని ఆమె వివరించారు. పాపకు చికిత్స విషయంలో ఎలాంటి సమస్య లేదన్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉన్నారని చెప్పారు. కుటుంబ కలహాలు, ఆర్థిక పరిస్థితుల వల్లే రుక్సానా తల్లి ఈ కఠిన నిర్ణయం తీసుకున్నదని ఉషారాణి తెలిపారు. కుటుంబ పరిస్థితులు, సరియైన ఉపాధి లేకపోవడం వల్ల ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పాప తల్లి మంత్రి కార్యాలయ అధికారులకు తెలిపారు. భర్త వదిలేసి వెళ్లిపోయాడని, అద్దె ఇంట్లో ఉంటూ, దొరికిన పని చేసుకుంటూ తానే ఇద్దరు ఆడపిల్లల్ని పోషించుకుంటున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైనా ఉపాధి కల్పించాలని ఆమె కోరగా, ఈ విషయాన్ని అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే మంత్రి సానుకూలంగా స్పందించారు. పాప తల్లికి గాంధీ హాస్పిటల్లోనే, ఆమె అర్హతకు తగిన ఉద్యోగం కల్పించాలని సూపరింటెండెంట్ ఉషారాణికి సూచించారు. పాప తల్లికి గాంధీ హాస్పిటల్లోనే, ఆమె అర్హతకు తగిన ఉద్యోగం కల్పించాలని సూపరింటెండెంట్ ఉషారాణికి సూచించారు. పాపకు గాంధీలోనే పూర్తిస్థాయిలో మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. రుక్సానా తల్లికి వారం రోజుల్లో ఉద్యోగం కల్పిస్తామని ఉషారాణి వెల్లడించారు.

11న శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

తిరుపతి, వెలుతురు అక్టోబర్ 10 : శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు అక్టోబరు 11వ తేదీ ఆదివారం అంకురార్పణ జరుగనుంది. రాత్రి 7 నుండి 8 గంటల వరకు సేనాధిపతి ఉత్సవం, శ్రీవారి ఆలయంలోని యాగశాలలో అంకురార్పణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఆగమశాస్త్రం ప్రకారం ప్రతి వైదిక ఉత్సవానికి ముందు అంకురార్పణ చేపడతారు. నవధాన్యాలను మొలకెత్తించి ఈ భూమండలమంతా పాడిపంటలతో, పశుపక్ష్యాదులతో సుభిక్షంగా, సస్యశ్యామలంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తారు. సేనాధిపతి ఉత్సవం. శ్రీవారి సర్వసైన్యాధ్యక్షుడు శ్రీ విష్వక్సేనుడు. ఈ సందర్భంగా శ్రీ విష్వక్సేనులవారిని ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు చేపడతారు. జగద్రక్షకుడైన శ్రీవారికి నిర్వహించే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు శ్రీ విష్వక్సేనులవారు ఈ విధంగా మాడ వీధుల్లో ఊరేగుతారని ప్రాశస్త్యం. మేదినిపూజ, నవధాన్యాలు మొలకెత్తేందుకు అవసరమైన పుట్టమన్ను కోసం ముందుగా భూదేవిని ప్రసన్నం చేసుకునేందుకు మేదినిపూజ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అర్చకులు భూసూక్తాన్ని పఠిస్తారు. అంకురార్పణ. వైఖానస ఆగమంలోని క్రతువుల్లో అంకురార్పణం లేదా బీజవాపనం అత్యంత ముఖ్యమైనది. ముందుగా పాలికల్లో(మట్టికుండలు) పుట్టమన్ను నింపుతారు. ఈ విత్తనాలు బాగా మొలకెత్తాలని కోరుతూ ఓషధీసూక్తాలను పఠిస్తారు. ఇందులో గోధుమలు సూర్యుడు, బియ్యం చంద్రుడు, కందులు కుజుడు, పెసలు బుధుడు, శనగలు బృహస్పతి, అలసందలు శుక్రుడు, నువ్వులు శని, మినుములు రాహువు, ఉలవలు కేతువుకు సంకేతంగా భావిస్తారు. అలాగే యాగశాలలో ఈ పాలికల చుట్టూ అష్టదిక్పాలకులైన ఇంద్రుడు, అగ్ని, యముడు, నిరృతి, వరుణుడు, వాయుదేవుడు, కుబేరుడు, ఈశానతోపాటు మొత్తం 49 మంది దేవతలను ఆవాహన చేస్తారు.

రైతును పురుగుల మందు తాగి చావలేదా అని అడుగుతారా

- గజ్వేల్ ఎమ్మార్వో తీరుపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం..
- అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 10:

రైతులకు అన్నం పెట్టే అన్నదాతల పట్ల ఇంత అమానవీయంగా వ్యవహరిస్తారా అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన వ్యవసాయ భూమిని, జీవనాధారాన్ని కాపాడుకోవాలని గజ్వేల్ ఎమ్మార్వో కార్యాలయానికి వెళ్లిన రైతును అధికారి అవమానించిన తీరు సిగ్గుచేటని, ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని మండిపడ్డారు. రైతు సమస్యను పరిష్కరించాల్సిన అధికారి.. అతడి బాధను ఎగతాళి చేయడం దారుణమని పేర్కొన్నారు.

తన భూమిని కాపాడుకోవడానికి సాయం కోరిన రైతును "ఇంకా పురుగుల మందు తాగలేదా ఇంకా బతికే ఉన్నావా" అంటూ అధికారి ప్రశ్నించినట్లు వెలుగులోకి వచ్చిన వీడియోపై కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. తన బాధను చూసి కూడా ఎగతాళి చేస్తారా అని రైతు ప్రశ్నించగా, అధికారి "అవును.. ఖచ్చితంగా" అని సమాధానమిచ్చినట్లు వీడియోలో కనిపిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తోటి మనిషి పట్ల ఇంత అమానవీయంగా వ్యవహరించాలంటే ఎంతటి నిర్దయతో ఉండాలని ప్రశ్నించారు.

"మనకు అన్నం పెట్టే రైతులను ఇలాగేనా మనం చూసుకునేది తోటి మనిషితో ఈ అధికారి వ్యవహరించిన తీరు చూస్తే, ఆయన మానసికంగా ఎంతటి అమానవీయ స్థితిలో ఉన్నారో అర్థమవుతోంది. ఇది సిగ్గుచేటు.. ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు" అని కేటీఆర్ పేర్కొన్నారు.

ఈ ఘటనపై తక్షణమే స్పందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (తెలంగాణ సీఎస్)ను కేటీఆర్ డిమాండ్ చేశారు. రైతును అవమానించిన గజ్వేల్ ఎమ్మార్వోపై చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు వారిని కించపరిచేలా వ్యవహరించడం సహించరాని విషయమని స్పష్టం చేశారు.

రైతుల సంక్షేమం గురించి మాట్లాడే ప్రభుత్వం.. క్షేత్రస్థాయిలో అన్నదాతలకు ఎదురవుతున్న అవమానాలపై బాధ్యత వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రైతు ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

సంక్షేమ పథకాలే కాంగ్రెస్ విజయానికి బలం

- ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించాలి
- సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి..
- కాంగ్రెస్ శ్రేణులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపు

ఖమ్మం, వెలుతురు అక్టోబర్ 10:

ఖమ్మం-నల్గొండ-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు పార్టీ శ్రేణులంతా సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టి, అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలని సూచించారు. ఖమ్మం పట్టణంలోని ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మెజారిటీ సాధించాలంటే పక్కా కార్యాచరణతో ముందుకు సాగాలని భట్టి విక్రమార్క అన్నారు. జిల్లా స్థాయి సమావేశం అనంతరం ఐదు శాసనసభ నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించాలని, ఆ తర్వాత మండల, గ్రామస్థాయిల్లో సమావేశాలు ఏర్పాటు చేసి పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి శాసనసభ నియోజకవర్గానికి సీనియర్ నాయకుడిని ఇన్‌ఛార్జిగా నియమించి, వారి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. గతంలో ఓటరుగా నమోదైన వారు సైతం ప్రస్తుత ఎన్నికల ప్రక్రియకు అనుగుణంగా మళ్లీ నమోదు చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు. కాంగ్రెస్ కుటుంబాల్లోని పట్టభద్రులను గుర్తించి, వారంతా ఓటర్లుగా నమోదయ్యేలా చూడాలని చెప్పారు. అనంతరం తటస్థ ఓటర్లను, ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల సానుకూలంగా ఉన్న ఇతర వర్గాల పట్టభద్రులను కలిసి పార్టీఅభ్యర్థికి మద్దతు కూడగట్టాలని సూచించారు.

3.42 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తున్న ప్రయోజనాలను ఇంటింటికీ వివరించాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సుమారు కోటి 15 లక్షల కుటుంబాలు ఉండగా, దాదాపు కోటి 6 లక్షల కుటుంబాలకు చెందిన 3 కోట్ల 42 లక్షల మందికి ప్రతి నెలా ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు లభించే సన్నబియ్యాన్ని పేదలకు ఉచితంగా అందించడం ద్వారా ప్రభుత్వం వారికి అండగా నిలుస్తోందన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొంటూ, సుమారు 72 లక్షల మంది రైతులకు రైతు భరోసా ఆర్థిక సహాయం అందించామన్నారు. గృహజ్యోతి పథకం కింద సుమారు 53 లక్షల మందికి నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని సుమారు 30 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ పథకాల వల్ల కుటుంబాలపై విద్యుత్ బిల్లుల భారం తగ్గుతోందని చెప్పారు. సామాజిక భద్రతలో భాగంగా సుమారు 43 లక్షల మందికి చేయూత పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు.రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రాష్ట్రంలోని కోటి 6 లక్షల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల వరకు వైద్య చికిత్స పొందే అవకాశం కల్పిస్తున్నామని వివరించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్రమైన అనారోగ్య సమస్యలతో ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఈ పథకం అండగా నిలుస్తోందన్నారు. విద్యార్థుల చదువుకు ఆర్థిక ఇబ్బందులు ఆటంకం కాకూడదనే ఉద్దేశంతో సుమారు 12.5 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల ను నేరుగా వారి ఖాతాల్లో జమ చేసే విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయం అల్పాహారంతో పాటు ఒక గ్లాసు పాలు అందించే కార్యక్రమాన్ని ఈ ప్రభుత్వం విజయవంతంగా నిర్వహిస్తుందని వివరించారు.

ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

రాష్ట్రంలో ఇల్లు లేని పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పెద్ద ఎత్తున అమలు చేస్తున్నామని చెప్పారు. తొలి దశలో 4.5 లక్షల ఇళ్లకు ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. రెండో దశలో మరో 2.5 లక్షల ఇళ్లను మంజూరు చేసే దిశగా, ఒక్కో నియోజకవర్గానికి 2,000 ఇళ్ల చొప్పున ముందుకు సాగుతున్నామని వివరించారు. హైదరాబాద్‌లోనూ పేదలకు లక్ష ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం 40 వేలకోట్ల రూపాయలు వెచ్చిస్తున్నదని చెప్పారు.

ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రతే లక్ష్యం

ఇందిరమ్మ జయంతి సందర్భంగా నవంబర్ 19న ఇందిరమ్మ బీమా పథకాన్ని ప్రారంభించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. కుటుంబానికి ఆదాయాన్ని సమకూర్చే పెద్ద వ్యక్తి ప్రమాదవశాత్తు మరణిస్తే, ఆ కుటుంబానికి రూ.5 లక్షల బీమా సాయం అందించేలా ఈ పథకాన్ని రూపొందిస్తున్నామని వివరించారు. కులం, మతం, ప్రాంతం వంటి భేదాలు లేకుండా తెలంగాణలోని కుటుంబాలకు భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను కరపత్రాల రూపంలో రూపొందించి ప్రతి ఇంటికీ అందించాలని భట్టి విక్రమార్క పార్టీ నాయకులకు సూచించారు.

కాంగ్రెస్‌కు అంకితమైన కుటుంబం నుంచి సర్వోత్తమ్ రెడ్డి

రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీతో సుదీర్ఘ అనుబంధం ఉందని పేర్కొన్నారు. రాంరెడ్డి వెంకట్ రెడ్డి, దామోదర్ రెడ్డి వంటి నాయకుల కుటుంబం పార్టీకి అవసరమైన ప్రతి సందర్భంలో అండగా నిలిచిందన్నారు. కాంగ్రెస్ కోసం నిబద్ధతతో పనిచేసిన ఈ కుటుంబాన్ని పార్టీ ఎప్పటికీ మరిచిపోదని చెప్పారు. సర్వోత్తమ్ రెడ్డిని కేవలం ఒక అభ్యర్థిగా కాకుండా కాంగ్రెస్ పార్టీ ప్రతినిధిగా భావించి ఆయన విజయం కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఓటరు నమోదు నుంచి ఎన్నికల్లో ఓటు వేసే వరకు ప్రతి దశలోనూ అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీకి బలమైన పునాది ఉన్న ప్రాంతమని పేర్కొంటూ, అదే ఐక్యతను పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో చాటాలని, రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తుమ్మల నాగేశ్వరరావు ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్ మట్ట రాగమయి కోరం కనకయ్యలు ప్రసంగించారు. ఈ సమావేశానికి డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ అధ్యక్షత వహించారు.

ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రానికి అభివృద్ధి కిరీటం

- నాలుగు నియోజకవర్గాల సరిహద్దులు దాటి దూసుకెళ్తున్న తుడా మెగా విజన్
- ట్రాఫిక్ ఫ్రీ కారిడార్లు.. 100 అడుగుల గ్రీన్ ఫీల్డ్ హైవేలు:
- తిరుపతి ముఖచిత్రాన్ని సమూలంగా మారుస్తున్న 'తుడా' మాస్టర్ ప్లాన్
- ఏడుకొండల వైభవం ఇక తిరుపతి వీధుల్లోనూ కనిపించాలి
- తిరుమల బ్రహ్మోత్సవ శోభతో తిరుపతి జిల్లా వెలగాలి.
- తుడా ఛైర్మన్ డా డాలర్స్ దివాకర్ రెడ్డి
- ప్రజా ధనానికి సంపూర్ణ రక్షణ.. పారదర్శక పాలనకు తుడానే నిదర్శనం..

తిరుపతి, వెలుతురు అక్టోబర్10:

గత ప్రభుత్వంలో 'తుడా' అంటే కేవలం ఒక్క నియోజకవర్గానికో లేక చిన్నపాటి పనులకో పరిమితమై ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పరిస్థితిని పూర్తిగా మార్చి వేశామని తుడా ఛైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డా. డాలర్స్ దివాకర్ రెడ్డి,చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, యువ నేత నారా లోకేష్ మార్గదర్శకం లో తిరుపతి జిల్లాను రాష్ట్రంలోనే నంబర్ వన్ స్థానంలో నిలబెట్టేందుకు సమగ్ర ప్రణాళికలతో పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా తుడా ఛైర్మన్ డా డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ.. తుడా కార్యకలాపాలను ఒకే ప్రాంతానికి పరిమితం చేయకుండా చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి, నగరి నియోజకవర్గాల్లో విస్తరిస్తూ, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యేలందరినీ సమన్వయం చేసుకుం టూ ప్రజావసరాలకు పెద్దపీట వేస్తూ,తిరుపతికి వచ్చే లక్ష నుంచి లక్షన్నర మంది యాత్రికుల అవసరాల అనుగుణంగా ట్రాఫిక్ జామ్‌లతో ఇబ్బంది పడకుండా అధునాతన రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాల వ్యవస్థను సిద్ధం చేస్తున్నాం అని తెలిపారు. నగర పరిసరాల్లో ఎన్నడూ లేని విధంగా 19 కిలోమీటర్ల మేర సుమారు 200 కోట్ల వ్యయంతో 8 ప్రధాన మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులకు శ్రీకారం చుట్టామన్నారు.శెట్టిపల్లి పరిధి లో 80 అడుగులు,100 అడుగుల విశాలమైన రోడ్లను నిర్మిస్తున్నామని,ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఈ ప్రతిష్టాత్మక లేఅవుట్ ను రాబోయే మూడు నెలల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం అని అన్నారు. చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని దామినేడు ప్రాంతంలో గతంలో వేసిన లేఅవుట్లు, ప్లాట్లలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యేతో చర్చించి, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అన్ని విధాలా రోడ్డు మౌలిక సదుపాయాలు కల్పించేలా నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు.

వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్‌జిల్లా దొంగల ముఠా అరెస్ట్!

- ఆరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో తొమ్మిది చోరీలు
- జైలులో పరిచయం.. బయటకు వచ్చాక దొంగల ముఠాగా ఏర్పాటు!
- 21.05 లక్షల విలువైన సొత్తు స్వాధీనం.. నలుగురు నిందితుల అరెస్ట్

మర్రిగూడ, వెలుతురు అక్టోబర్10:

నల్లగొండ జిల్లాలో వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్‌జిల్లా దొంగల ముఠాను మర్రిగూడ, చింతపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. నలుగురు నిందితులను అదుపులోకి తీసుకొని వారి నుంచి సుమారు 11 తులాల బంగారం, 1.5 కిలోల వెండి, రెండు ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ సుమారు రూ.21.05 లక్షలు ఉంటుందని దేవరకొండ డీఎస్పీ ఎం.వి. శ్రీనివాసరావు వెల్లడించారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు ఆస్తి సంబంధిత నేరాల నియంత్రణకు పోలీసులు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా అక్టోబర్ 10న ఉదయం నాంపల్లి సర్కిల్ పరిధిలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించారు. మర్రిగూడ పోలీస్‌స్టేషన్ క్రైమ్ నంబర్ 118/2026, చింతపల్లి పోలీస్‌స్టేషన్ క్రైమ్ నంబర్ 38/2026 కేసుల దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు.

జైలులో పరిచయం.. బయటకు వచ్చాక దొంగల ముఠాగా ఏర్పాటు!

పోలీసుల కథనం ప్రకారం.. ప్రధాన నిందితుడిగా పేర్కొన్న బొల్లెమోని అంజి అలియాస్ స్వామి గతంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రాంతంలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడి జైలుకు వెళ్లి వచ్చినట్లు తెలిపారు. జైలులో ఉన్న సమయంలోనే మరో ముగ్గురితో పరిచయం ఏర్పడిందని, అనంతరం విడుదలైన తర్వాత ఆ పరిచయాలనే ఆధారంగా చేసుకొని నలుగురూ కలిసి చోరీలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైందని పోలీసులు పేర్కొన్నారు. చోరీల ద్వారా వచ్చిన డబ్బుతో అప్పులు తీర్చుకోవడంతోపాటు విలాసవంతమైన జీవితం గడపాలనే ఉద్దేశంతో నేరాలకు పాల్పడినట్లు వెల్లడించారు.

పగటిపూట తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యం

నిందితులు పగటిపూట తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించి చోరీలకు పాల్పడేవారని పోలీసులు తెలిపారు. మర్రిగూడ, చింతపల్లి, గుర్రంపోడు, దేవరకొండ, కనగల్, నకిరేకల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో మొత్తం తొమ్మిది చోరీలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైందన్నారు. ఈ కేసుల దర్యాప్తులో భాగంగా నిందితుల నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

నలుగురు నిందితులు వీరే

అరెస్టయిన వారిలో వనపర్తి పట్టణానికి చెందిన బొల్లెమోని అంజి అలియాస్ స్వామి (29), హైదరాబాద్ బోరబండకు చెందిన పూజారోల్ల శివకుమార్ అలియాస్ శివయ్య (23), వనపర్తి జిల్లా కొత్తకోట మండలం అప్పరాల గ్రామానికి చెందిన సంపంగి రాజు అలియాస్ రాము (30), మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రకు చెందిన గోపి అరుణ్‌కుమార్ (23) ఉన్నారు.

రూ.21.05 లక్షల సొత్తు స్వాధీనం

నిందితుల నుంచి సుమారు 11 తులాల బంగారం, 1.5 కిలోల వెండి, రెండు ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.21.05 లక్షలుగా అంచనా వేశారు.

పోలీస్ బృందానికి డీఎస్పీ అభినందనలు

కేసులను ఛేదించి నిందితులను అరెస్ట్ చేయడంలో కీలక పాత్ర పోషించిన మర్రిగూడ ఎస్ఐ బి. రాంబాబు, చింతపల్లి ఎస్ఐ ఎం. రామ్మూర్తితోపాటు పోలీసు సిబ్బంది కిషన్, శరణ్, వేణుగోపాల్, అనిల్, యాదగిరి, సత్యనారాయణ, యాదయ్యలను డీఎస్పీ ఎం.వి. శ్రీనివాసరావు అభినందించి రివార్డులు అందజేశారు. ఆస్తి సంబంధిత నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

బెజవాడకు దళపతి విజయ్

విజయవాడ, వెలుతురు అక్టోబర్10:

తమిళనాడు సీఎం ఆంధ్రప్రదేశ్ పర్యటనకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. విజయవాడలో అత్యంత వైభవంగా జరిగే ప్రసిద్ధ ఇంద్రకీలాద్రి దసరా ఉత్సవాలకు హాజరుకావాల్సిందిగా విజయ్‌ను విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని శివనాథ్ ప్రత్యేక బృందం నేరుగా ఆహ్వానించింది. ఎంపీ బృందం ఆహ్వానానికి విజయ్ కూడా సానుకూలంగా స్పందించినట్లు, దసరా వేడుకల్లో పాల్గొనేందుకు ఆయన ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది.ఇటీవల కాలంలో విజయ్ ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై, ఇక్కడి సామాజిక పరిస్థితులపై ప్రత్యేక ఆసక్తి కనబరుస్తున్నట్లు ఆయన వ్యూహకర్తలు చెబుతున్నారు. తన పార్టీ భావజాలాన్ని, తమిళనాడు ప్రభుత్వ విజయాలను కేవలం సొంత రాష్ట్రానికే పరిమితం చేయకుండా తెలుగు ప్రజలకు కూడా చేరేలా ప్రత్యేకంగా తెలుగులో ప్రకటనలు ఇప్పించడం, టీవీ ఛానెళ్లలో ప్రసారం చేయించడం చేస్తున్నారు. కేవలం సినిమాల ద్వారానే కాకుండా, రాజకీయంగా కూడా తన ప్రభావాన్ని ఇతర రాష్ట్రాలకు, ముఖ్యంగా పొరుగునే ఉన్న ఏపీకి విస్తరించాలనే ఆలోచనలో విజయ్ ఉన్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు అంటున్నాయి. తమిళనాడు దాటి తన పార్టీని దక్షిణాది ఇతర రాష్ట్రాల్లోకి తీసుకువెళ్లేందుకు అడుగులు వేస్తున్న విజయ్‌కు, ఏపీ తొలి పర్యటన ద్వారా ప్రజా స్పందనను పరిశీలించే అవకాశం ఉంది. విజయవాడ దసరా ఉత్సవాల వేదికగా ఆయన పర్యటిస్తే, ఇక్కడి రాజకీయ, సామాజిక సమీకరణాలపై ఆయనకు ఒక స్పష్టమైన అవగాహన వచ్చే అవకాశం ఉంది. ఇక్కడి స్పందనను బట్టి భవిష్యత్తులో ఏపీ రాజకీయాల్లో టీవీకే ఏ రకమైన పాత్ర పోషించాలనే దానిపై ఆయన ఒక స్పష్టమైన నిర్ణయానికి రావచ్చని భావిస్తున్నారు.తమిళనాట విజయ్ వేస్తున్న ప్రతి అడుగు జాతీయ స్థాయిలోనూ ఆసక్తి రేపుతున్న తరుణంలో, ఆయన ఏపీ టూర్ ఖరారైతే అది తెలుగు రాజకీయాల్లోనూ సరికొత్త చర్చకు తెరలేపడం ఖాయం.

కోట్ల ఓట్లను తొలగించిన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలి

- సీఐటీయూ జ్ఞానేశ్వర్ కుమార్ దిష్టిబొమ్మ దగ్ధం
- ఢిల్లీలో నిరసనకారులను అడ్డుకోవడం, ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడం దుర్మార్గం

తిరుపతి, వెలుతురు అక్టోబర్10:

ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో 13 కోట్ల ఓట్లను తొలగించిన కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో తిరుపతిలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో జ్ఞానేశ్వర్ కుమార్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా వందవాసి నాగరాజు మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడికి రాజ్యాంగం ఓటు హక్కు కల్పించిందని, ఆ హక్కును కాపాడాల్సిన ఎన్నికల కమిషన్ కోట్లాది మంది ఓటర్ల పేర్లను తొలగించడం ద్వారా వారి హక్కులను కాలరాసిందని తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా వ్యవహరించాల్సింది పోయి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేస్తోందని విమర్శించారు. మోదీ, అమిత్ షా రాజకీయ ప్రయోజనాల కోసం ఎన్నికల వ్యవస్థను ఉపయోగించుకోవడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు.

మోడి అంటే మర్డరర్ ఆఫ్ డెమొక్రటిక్ ఆఫ్ ఇండియా

- ఫారం 6, ఫారం 7 లను మోడీ దుర్వినియోగం చేశారు
- మా దగ్గర కత్తులు కటార్లు బాంబులేమీ లేవు..
- అడ్డుకోవడం చంద్రబాబుకి తగదు
- వైఎస్ షర్మిలా రెడ్డి

విజయవాడ, వెలుతురు అక్టోబర్10:

నన్ను హౌజ్ అరెస్ట్ చేయించడం చంద్రబాబు కి న్యాయమా? నిరసన వ్యక్తం చేయడం రాజ్యాంగం కల్పించిన హక్కు. కత్తులు, రాళ్లుమా దగ్గర లేవు. శాంతియుతంగా రాజ్ భవన్‌కి వెళ్ళాలి అనుకు న్నాం. ప్రజాస్వామ్యం బ్రతకాలి అంటే ఓటు ఉండాలి. ఇలాంటి ఓటు హక్కును బీజేపీ ప్రభుత్వం తొలగిస్తుందని ఏపీసీసీ ఛీఫ్ షర్మిలా రెడ్డి అన్నారు.

షర్మిలా మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 13.40 కోట్ల ఓట్లను తొలగించారు. ఓటర్ల జాబితా నుంచి 13 నుంచి 20 శాతం మందిని తొలగించారు. ఇలా చేస్తే ప్రజాస్వామ్యం ఎలా బ్రతుకుతుంది? ప్రజల ఓటు చోరీ అవుతుంటే నిరసన చేయడం తప్పా? ఓటు వజ్రాయుధం. నచ్చిన నాయకుడిని స్వేచ్ఛగా ఎన్నుకొనే హక్కు ఉంది. దళితులు, పేదలు, ముస్లిం, క్రిస్టియన్ల ఓట్లు తొలగిస్తున్నారు. పథకం ప్రకారం బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తుంది. కర్ణాటకలో వోట్ చోరీ పై రాహుల్ గాంధీ అన్ని నిజాలు బయట పెట్టారు. బ్రతికి ఉన్న వారి ఓట్లను చనిపోయినట్లు తొలగించారు. ఫారం 6, ఫారం 7 ను బీజేపీ కావాల్సినట్టుగా దుర్వినియోగం చేస్తుంది స్వయం ప్రతిపత్తి సంస్థలు అన్ని మోదీ గుప్పిట్లో ఉన్నాయి. ఎన్నికల సంఘం మోదీ చెప్పినట్లుగా పని చేస్తుంది. జ్ఞానేశ్ కుమార్ ను పథకం ప్రకారం అఇఅ చేశారు. జ్ఞానేష్ కోసం ఏకంగా 2023 లో చట్టాన్ని మార్చారని అన్నారు.

సీఈసీని ఎంపిక చేయాలి అంటే ప్రధాని, ప్రతిపక్ష నాయకుడు, సీజేఐ ముగ్గురు కమిటీ సభ్యులుగా ఉండాలి. కానీ అఏఎ స్థానంలో క్యాబినెట్ మంత్రిని పెట్టారు. అమిత్ షాను కావాలని మోదీ కమిటీకి నామినేట్ చేశారు. ముగ్గురి సభ్యుల్లో ఇద్దరి మెజారిటీ ఉంటే చాలు. ఎల్వోపీ ఆమోదం లేకుండా నచ్చిన వ్యక్తిని అఇఅ చేయొచ్చు . అందుకే బీజేపీ కార్యకర్త జ్ఞానేష్ ను అఇఅ చేశారు .చీఫ్ ఎలక్షన్ కమిషనర్ గా జ్ఞానేష్ ఉండటం ప్రజాస్వామ్యానికి సేఫ్ కాదు. జ్ఞానేష్ మీద మాకు నమ్మకం లేదు. ఫారం 7 ను పూర్తిగా బీజేపీ దుర్వినియోగం చేసింది. కర్ణాటకలో ఒక బీజేపీ కార్యకర్త 7 వేల ఓట్లను పేరు రాసి తొలగించారఅన్నారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITOR G BAKKA YADAIAH, R.N.I. TEL TEL/2019/78609. Cell: 91773 87328, Email: velthurunewspaper@gmail.com